WWW.ninadam.co.in

తెలుగు దినపత్రిక

# నినాదం

నిఖార్సైన జర్నలిజం

ఆదివారం, డిసెంబర్ 29, 2024 | సంపుటి - 21 | సంచిక 102 | వెల - 7 | పేజీలు -12 + 8

Published from Hyderabad and Vijayawada Circulated from TS and AP.. Hyderabad, Karimnagar, Khammam, Mahabubnagar, Nalgonda, Nizamabad, Warangal, Vijayawada, Guntur, Ongole, Nellore, Tirupathi, Kadapa, Anantapur, Kurnool, Tadepalligudem, Rajahmundry, Visakhapatnam, Srikakulam

## తెలుగు భాషను కాపాడుకుందాం

- ఆత్మాభిమానాన్ని పెంచుకుందాం
- తెలుగు భాష ఔన్నత్యం కోసం కృషి చేద్దాం
- భాషా,సంస్కృతులను పరిరక్షించుకోవాల్సిందే
- ప్రపంచ తెలుగు రచయితల మహాసభలో జస్టిస్ ఎన్వీరమణ పిలుపు

'తెలుగు భాషను కాపాడుకుందాం. ఆత్మాభిమానాన్ని పెంచుకుందాం అనే నినాదంతో ఐక్యత చాటేందుకు నలుమూలల నుంచి విజయవాడకు తరలివచ్చిన వారందరికీ వందనాలు' అని సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ అన్నారు. విజయవాడలో జరుగుతున్న ప్రపంచ తెలుగు రచయితల ఆరో మహాసభల్లో ఆయన పాల్గొని ప్రసంగించారు.



5లో..

## విషానికి విరుగుడు

- నినాదం కథనంపై ప్రశంసల జల్లు

**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి(నినాదం):**




ఏకలవ్య పాఠశాల భవనాల నిర్మాణాలపై కొన్ని శక్తులు చేస్తున్న విష ప్రచారానికి నినాదం కథనం విరుగుడు మందుగా పలువురు వర్ణించారు. 'ఏకలవ్యపై ఎందుకింత కక్ష' శీర్షికన శనివారం నినాదం దినపత్రిక ప్రచురించిన కథనం చర్లలో చర్చనీయాంమైంది. ఏకలవ్య పాఠశాల భవనాల నిర్మాణానికి ఎదురవుతున్న ఆటంకాలు.. అడ్డంకులు.. చెడు ప్రచారం లోగుట్టుని నినాదం పత్రిక బట్టబయలు చేసి విద్యార్థులు, వారి తల్లిదండ్రుల్లో భయదోళనలు తొలగించిందని విద్యాభిమానులు అభిప్రాయపడ్డారు. నినాదం వార్తని పలువురు వాట్సప్ గ్రూపుల్లో విస్తృతంగా షేర్ చేయడమే గాకుండా నిజాన్ని నిర్భయంగా ప్రచురించిన వార్త అంటూ మరికొందరు వాట్సప్ స్టేటస్‌లుగా పెట్టుకున్నారు. ఎక్కడ చూసినా నినాదం కథనంపైనే జోరుగా చర్చ కనిపించింది. పలువురు నినాదం ప్రతినిధికి ఫోన్ చేసి విద్యాభివృద్ధిని కాంక్షించే చక్కని కథనం అంటూ అభినందించారు. అధికారులు జోక్యం చేసుకొని అభివృద్ధికి ఆటంకాలు కల్పించే వారిపై దృష్టిపెట్టాలని పలువురు కోరుతున్నారు.

## మన్మోహన్‌కు నివాళి కోసం అసెంబ్లీ భేటీ

- 30న ప్రత్యేక సమావేశం ఏర్పాటు

**హైదరాబాద్, నినాదం:**
దివంగత మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు నివాళి అర్పించేందుకు తెలంగాణ అసెంబ్లీ ప్రత్యేక సమావేశం ఈ నెల 30వ తేదీన జరగనుంది. సోమవారం ఉదయం 10 గంటలకు సభ ప్రారంభం కానుంది. సంతాప దినాల్లో భాగంగా మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు శాసన సభ నివాళులర్పించనుంది.

4లో..



## తెలంగాణ నేతల సిఫార్సులకు నో

- ఇంకా నిర్ణయం తీసుకోలేదన్న ఇవో

**తిరుమల, నినాదం:**
తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) తెలంగాణ ప్రజాప్రతినిధుల సిఫారసు లేఖలను స్వీకరిస్తున్నట్లు పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతోంది. తెలంగాణ లీడర్ల విజ్ఞప్తి మేరకు సానుకూలంగా స్పందించి వారంలో రెండు రోజులు సిఫారసు లేఖలు స్వీకరించేందుకు టీటీడీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు వార్తలు గుప్పుమన్నాయి. ఈ క్రమంలో తెలంగాణ రాజకీయ నాయకుల సిఫారసు లేఖల స్వీకరణపై టీటీడీ ఈవో శ్యామల రావు కుండబద్దలు కొట్టారు. తెలంగాణ ప్రజా ప్రతినిధుల సిఫారసు లేఖలు స్వీకరిస్తున్నట్లు జరుగుతోన్న ప్రచారాన్ని ఆయన ఖండించారు



# ఇక సెలవు

## మన్మోహన్ సింగ్‌కు తుది వీడ్కోలు

- నిగమ్‌బోధ్ ఘాట్‌లో ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు
- నివాళి అర్పించిన రాష్ట్రపతి ముర్ము, ఉపరాష్ట్రపతి ధన్‌కడ్
- ప్రధాని మోడీ, మంత్రులు, స్పీకర్ తదితరులు
- కాంగ్రెస్ కార్యాలయం నుంచి ఘాట్ వరకు అంతిమయాత్ర

**ఇక సెలవ్ అంటూ ఆర్థికవేత్త మన్మోహన్ నింగికేగారు. దివంగత మాజీ ప్రధానికి వీడ్కోలు పలికారు. దివికేగిన దివంగత నేతకు ప్రముఖులు కడసారి శ్రద్ధాంజలి ఘటించారు. అనారోగ్యంతో తుదిశ్వాస విడిచిన భారత మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ అంత్యక్రియలు ముగిశాయి.**

**న్యూఢిల్లీ,డిసెంబర్28(నినాదం):**
ఢిల్లీలోని నిగమ్‌బోధ్ ఘాట్‌లో ఆయన పార్థివదేహానికి ప్రభుత్వ లాంఛనాలతో అంతిమ సంస్కారాలు పూర్తి చేశారు. కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ పాడె మోశారు. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ఉప రాష్ట్రపతి జగ్‌దీప్ ధన్‌ఖడ్, ప్రధానమంత్రి నరేంద్రమోదీ, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, కేంద్ర మంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్, జేపీ నడ్డా, కిరణ్ రిజిజు, కాంగ్రెస్ జాతీయాధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, కాంగ్రెస్ అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా హాజరై మాజీ ప్రధానికి తుది వీడ్కోలు పలికారు.

2లో..

## అంత్యక్రియల విషయంలో వివాదం

- సంప్రదాయాలు పాటించలేదని కాంగ్రెస్ విమర్శలు
- గతంలో మీరేం చేశారో తెలుసంటూ బిజెపి ప్రతి విమర్శలు
- తాజాగా పివికి జరిగిన అవమానంపై సర్వత్రా చర్చ

**న్యూఢిల్లీ, నినాదం:**
మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ అంత్యక్రియలు ఢిల్లీలోని నిగమ్ బోధ్‌లో జరిగాయి. ఆయన స్మారకం కోసం ప్రత్యేకంగా స్థలం కేటాయించాలని, కాంగ్రెస్ పార్టీ కేంద్రప్రభుత్వానికి లేఖ సైతం రాసింది. దీనిపై కాంగ్రెస్, బీజేపీ నేతల మధ్య రాజకీయ విమర్శలు కొనసాగుతున్నాయి. కేంద్రం మన్మోహన్‌సింగ్ అంత్యక్రియల విషయంలో సంప్రదాయాలను పాటించడం లేదని కాంగ్రెస్ పేర్కొంది. ఇదే సమయంలో గతంలో కాంగ్రెస్ ఎలాంటి సంప్రదాయాలు పాటించిందో తెలుసుకోవాలని బీజేపీ నేతలు కౌంటర్ ఇచ్చారు.

2

## ఎసిబి వలలో సర్వేయర్

### లంచం తీసుకుంటుండగా పట్టివేత

**భద్రాద్రికొత్తగూడెం, నినాదం:**
ఏసీబీ అధికారులు ఎన్ని దాడులు చేసినా.. ఎంత మంది పట్టుబడుతున్నా.. లంచావతారులు మాత్రం తగ్గడం లేదు. తాజాగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో రూ.50 వేలు లంచం తీసుకుంటూ పట్టుబడ్డాడు ఓ సర్వేయర్. దమ్మపేట మండలం గాంధీనగరంలో ఓ వ్యక్తి నుండి మండల సర్వేయర్ మెరుగు వెంకటరత్నం 50 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి రెడ్ హ్యాండెడ్ గా పట్టుబడ్డాడు.



# కొత్త ఏడాదిలో మరింత దూకుడు

## ఆక్రమణలన్నీ రికార్డు చేస్తున్నాం

- చెరువుల పరిరక్షణకు ప్రత్యేక ప్రాధాన్యం
- అక్రమ నిర్మాణాల కూల్చివేతలకు 15 బృందాలు
- హైడ్రా కమిషనర్ రంగనాథ్ వెల్లడి

**కొత్త సంవత్సరంలో హైడ్రా మరింత దూకుడు పెంచుతుందని హైడ్రా కమిషనర్ రంగనాథ్ హెచ్చరించారు. కూల్చివేతలు ఆగలేదు.. ఇంకా ఉంటాయని స్పష్టం చేశారు. చెరువుల హద్దులపై గ్రౌండ్ వర్క్ జరుగుతోందని అన్నారు. స్పష్టత రాగానే హైడ్రా యాక్టివ్‌గా ఉంటుందని తెలిపారు. చెరువులను అభివృద్ధి చేస్తూ.. అక్రమ నిర్మాణాలు కూల్చేస్తామని స్పష్టం చేశారు. ఎల్టీఎఫ్ నిర్ధారణ అనంతరం అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తామని చెప్పారు. ఇందుకోసం 15 హైడ్రా బృందాలు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు.**

**హైదరాబాద్,డిసెంబర్28(నినాదం):**
భాగ్యనగరంలో అక్రమ నిర్మాణాల కూల్చివేతలపై హైడ్రా కఠినంగానే ఉంటుందని హైడ్రా కమిషనర్ రంగనాథ్ తేల్చిచెప్పారు. అక్రమ నిర్మాణాలపై ప్రజల్లో అవగాహన కల్పించామని తెలిపారు. హైడ్రాకు త్వరలో ఒక ఎఫ్ఎం ఛానల్‌కు ప్రయత్నిస్తున్నాం. హైడ్రా వల్ల ప్రజల్లో భూములు, ఇల్లు క్రయవిక్రయాలపై అవగాహన పెరుగుతుంది. నగరంలో అక్రమ నిర్మాణాల కూల్చివేతలపై హైడ్రా కఠినంగానే ఉంటుంది. జూలై తర్వాత అనధికారికంగా, వ్యాపార వాణిజ్య కార్యకలాపాలు నిర్వహించేవాటిపై చర్యలు తప్పవు. వచ్చే ఏడాది నుంచి ప్రతి సోమవారం గ్రీవెన్ సెల్ ఏర్పాటు చేస్తున్నాం. ఎఫ్‌టీఎల్‌లో ఉన్న షెడ్లపై ప్రజలెవరు అద్దెకు తీసుకోవద్దు. ప్రజలు ఇచ్చే ఫిర్యాదులకు ప్రాధాన్యత ఇచ్చి పరిష్కరిస్తున్నాం' అని రంగనాథ్ వెల్లడిరచారు. 2024 జూలై 19వ తేదీన హైడ్రా ఆవిర్భవించిందని అన్నారు. హైడ్రా 5 నెలల పని తీరు, వచ్చే ఏడాది కార్యాచరణను ప్రకటిస్తున్నామని రంగనాథ్ తెలిపారు. శనివారం హైడ్రా కార్యాలయంలో రంగనాథ్ మీడియాతో మాట్లాడారు. 2050 కిలోమీటర్ల పరిధి.. తెలంగాణలో 33 శాతం హైడ్రా పరిధిలోకి వస్తుందని స్పష్టం చేశారు

▸▸తరువాయి2లో

## కెటిఆర్‌కు బిగ్ షాక్..

### ఫార్ములా ఈ-రేసు కేసులో ఇడి నోటీసులు



**హైదరాబాద్, నినాదం:**
ఫార్ములా ఈ-రేసు కేసులో భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌కు ఈడీ నోటీసులు ఇచ్చింది. జనవరి 7న విచారణకు రావాలని అందులో పేర్కొన్నారు. సీనియర్ ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్‌కు, హెచ్ఎండీఏ మాజీ చీఫ్ ఇంజినీర్ బీఎల్ఎన్ రెడ్డికి కూడా ఈడీ నోటీసులు ఇచ్చింది. జనవరి 2, 3న విచారణకు రావాలని అరవింద్, బీఎల్ఎన్ రెడ్డికి ఇచ్చిన నోటీసుల్లో పేర్కొన్నారు. ఏసీబీ ఎఫ్ఐఆర్ ఆధారంగా పీఎంఎల్ఏ కింద ఈడీ విచారణ చేస్తోంది.

▸▸తరువాయి2లో



## బడుగుల గళం పీజేఆర్

### ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాళి

**హైదరాబాద్, నినాదం:** పేద ప్రజలకు అన్ని వేళలా అండగా నిలిచిన వ్యక్తి మాజీ మంత్రి పి.జనార్దన్ రెడ్డి అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొనియాడారు. పీజేఆర్ వర్ధంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి ముఖ్యమంత్రి పూలమాల వేసి నివాళులర్పించారు. 1994 నుంచి 1999 వరకు సీఎల్పీ నేతగా ఆయన పని చేసిన ఆయన నిత్యం ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాడారని, తెలంగాణ వాదానికి బలమైన గొంతుకగా నిలిచారని సీఎం తెలిపారు. కాగ్రెస్ వ్యవస్థాపక దినోత్సవం రోజే పిజెఆర్ గుండెపోటుతో హఠాన్మరణం చెందారు.

## సాగర్ డ్యామ్‌పై సీఆర్పీఎఫ్ భద్రత తొలగింపు

### తిరిగి ఎస్పీఎఫ్ ఆధీనంలోకి సాగర్

**నాగార్జునసాగర్, నినాదం:**
నాగార్జున సాగర్ ప్రధాన డ్యాంపై సీఆర్పీఎఫ్ భద్రత తొలగించారు. నాగార్జున సాగర్ డ్యాం తిరిగి ఎస్పీఎఫ్ ఆధీనంలోకి వచ్చింది. గత తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ సమయంలో నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నిర్వహణ విషయంలో ఇరు రాష్ట్రాల మధ్య వివాదం రాజుకున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం నాగార్జున సాగర్ డ్యాం భద్రత కేఆర్ఎంబీ అధీనంలో ఉండటంతో సీఆర్పీఎఫ్ బలగాలతో భద్రత నిఘాలో ఉంది.. ఇరు రాష్ట్రాల మధ్య అవగాహన

▸▸తరువాయి2లో

## దల్లేవాల్‌కు వైద్య సాయం అందకుండా అడ్డంకులు

### రైతుసంఘాల తీరుపై మండిపడ్డ సుప్రీం

**న్యూఢిల్లీ, నినాదం:**
రైతు సంఘాల నేతలపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తంచేసింది. ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న రైతు నాయకుడు జగ్జిత్ సింగ్ దల్లేవాల్ ఆరోగ్యం రోజురోజుకీ క్షీణిస్తున్నా.. ఆయనకు వైద్య సహాయం అందకుండా

▸▸తరువాయి2లో

## ఎసిబి వలలో సర్వేయర్

ఖమ్మంలో నివాసముండే మద్దినేని వెంకట్ కు దమ్మపేట మండలంలో పొలాలు ఉన్నాయి. తన చెల్లెలుకు సంబంధించిన పొలం పాస్ బుక్ కోసం దరఖాస్తు చేసుకోగా, సర్వే పూర్తి చేసిన సర్వేయర్ వెంకటరత్నం రిపోర్ట్ తన దగ్గరే ఉంచుకొని లక్షా యాభై వేలు డిమాండ్ చేశాడు. అంతమొత్తం తమవద్ద లేదని, రూ.50 వేలకు ఒప్పందం చేసుకుని బాధితుడు మద్దినేని వెంకట్ ఏసీబీ ని ఆశ్రయించాడు. ఫిర్యాదు స్వీకరించిన ఏసీబీ డీఎస్పీ వై. రమేష్ టీం మండలంలోని గాంధీ నగరంలో మాటువేసి సర్వేయర్ లంచం తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. లంచగొండి సర్వేయర్ ను అరెస్టు చేసి వరంగల్ కోర్టుకు తరలించారు. తన రికార్డులన్నీ స్పష్టంగా ఉన్నప్పటికీ నెంబర్లు తేడాలు ఉన్నాయంటూ.. తన మ్యాపులో లేదంటూ నెల రోజులుగా తిప్పుతూ డబ్బులు డిమాండ్ చేశారని బాధితులు పేర్కొన్నారు. రెవెన్యూ పై కనీసం నాలెడ్జి లేని వ్యక్తి ఆరేళ్లుగా సర్వేయర్ గా ఇక్కడ పనిచేస్తున్నాడని, ఎవరు ఏ పని కోసం వచ్చినా సకాలంలో పనులు చేయకుండా విసిగించేవాడని ర్యాదుదారుడు తెలిపాడు. డబ్బులు డిమాండ్ చేస్తూ రైతుల కష్టాన్ని కొల్ల గొడుతుండటంతో విసిగిపోయి ఏసీబీ నాశ్రయించానని వెంకట్ తెలిపాడు.

## దల్లేవాల్‌కు వైద్య సాయం అందకుండా అడ్డంకులు

అడ్డుకుంటున్న రైతు సంఘాల తీరును అత్యున్నత న్యాయస్థానం తప్పుబట్టింది. నిజంగా ఆయన క్షేమం కోరుకునేవారైతే అలా అడ్డుకోరనే విషయాన్ని వారికి తెలియ జేయాలని జస్టిస్ సూర్యకాంత్ పంజాబ్ చీఫ్ సెక్రటరీకి సూచించారు. దల్లేవాల్‌కు వైద్య సహాయం అందించాలన్న ఆదేశాలను అమలుచేయకుండా కోర్టు ధిక్కరణకు పాల్పడ్డారంటూ పంజాబ్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి, డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్‌కు వ్యతిరేకంగా దాఖలైన వ్యాజ్యంపై విచారణలో భాగంగా అత్యున్నత న్యాయస్థానం ఈ వ్యాఖ్యలు చేసింది. నిరవధిక దీక్షను కొనసాగిస్తున్న దల్లేవాల్‌కు వైద్య సహాయం అందేలా చూడాలని తాము పంజాబ్ ప్రభుత్వానికి ఆదేశాలు ఇచ్చామని.. అయితే వాటిని అమలుచేయడానికి రాష్ట్రం చేస్తున్న ప్రయత్నాలపై కోర్టు సంతృప్తి చెందలేదని జస్టిస్ సూర్యకాంత్ అన్నారు. ఈ విషయంలో పంజాబ్ రాష్ట్రానికి ఏదైనా సహాయం అవసరమైతే, కేంద్ర ప్రభుత్వం మద్దతివ్వాలని సుప్రీం తన ఆదేశాల్లో పేర్కొంది. ఈ కేసుపై తదుపరి విచారణను డిసెంబర్ 31న చేపట్టనున్నట్లు వెల్లడిరచింది. పంటల కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించడం వంటి డిమాండ్లతో నవంబరు 26 నుంచి జగ్జీత్ సింగ్ దల్లేవాల్ పంజాబ్–హరియాణా సరిహద్దులోని ఖనౌరీ శిబిరం వద్ద నిరవధిక నిరసన దీక్ష చేపట్టిన విషయం తెలిసిందే.

## సాగర్ డ్యామ్‌పై సీఆర్పీఎఫ్ భద్రత తొలగింపు

రావడంతో సీఆర్పీఎఫ్ నుంచి భద్రతపరమైన చర్యలను ఎస్పీఎఫ్ అప్పజెప్పారు. బోర్డుకు ఇండెంట్ ఇస్తున్నా తెలంగాణను పదేపదే అడగాల్సి వస్తోందని..13వ గేటు నుంచి తమ వైపు ఉన్న గేట్లను తామే ఆపరేట్ చేసుకుంటామని కృష్ణా బోర్డుకు లేఖ రాసింది. తెలంగాణ ప్రభుత్వం స్పందిస్తూ.. ప్రస్తుతం 13వ క్రెస్ట్ నుంచి ఏపీ పరిధిలో మిగతా భాగమంతా తెలంగాణ పరిధిలో ఉన్నది. తమ పరిధిలో ఉన్న ప్రాజెక్టును ఏపీ బలవంతంగా ఆక్రమించిందని తెలంగాణ కేంద్రానికి ఫిర్యాదు చేయడం వంటి పరిణామాలతో ఎన్నికల సమయంలో తీవ్ర ఉద్రిక్తతలు తలెత్తాయి. ఈ క్రమంలో సమయంలో కేంద్ర బలగాలు రంగ ప్రవేశంతో కాస్త ఉద్రికత్త తగ్గింది. ఆ విషయంలో కేంద్ర హోం శాఖ, జలవనరుల శాఖలు రెండు రాష్ట్రాలతో సంప్రదింపులు జరిపి, కృష్ణా బోర్డుకు చెందిన ఇద్దరు అధికారులు క్షేత్ర స్థాయి పరిశీలన కూడా చేశారు. ఐతే ఏపీ పునర్వ్యవస్థీకణ చట్టం ప్రకారం సాగర్ నిర్వహణ తెలంగాణే చూస్తుందని, కాబట్టి వెంటనే ప్రాజెక్టును అప్పగించాలని తెలంగాణ కేంద్రానికి వరుస లేఖలు రాసింది. కేంద్ర హోంశాఖ సూచించిన విధంగా 2023 నవంబర్ 28కి ముందు ఉన్న పరిస్థితిని కొనసాగేలా చూడాలని కోరింది.

## ఈ కార్ రేసులో ప్రభుత్వ ధనం దుర్వినియోగం

**కెటిఆర్‌కు ఈడి నోటీసులపై ఎంపి రఘునందన్ రావు**

హైదరాబాద్ :



ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నప్పుడు.. కేటీఆర్ ఎన్నికల కమిషన్ అనుమతి లేకుండా ఫార్ములా ఈ కార్ రేస్ ఎలా నిర్వహించారని మెదక్ ఎంపీ రఘునందన్ రావు ప్రశ్నించారు. ఎన్నికల కోడ్ ఉన్నప్పుడు ఒక్క రూపాయి ఖర్చు చేసిన అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది.. ఇటు కేంద్ర ప్రభుత్వం, అటు ఆర్బీఐకి చెప్పకుండా మన రాష్ట్ర సొమ్మును దేశ ఫారెన్ కంపెనీల కోసం ఖర్చు పెట్టారని రఘునందన్ రావు ఆరోపించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కి ఈడీ నోటీసులపై మెదక్ ఎంపీ రఘునందన్ రావు స్పందించారు. అందుకే కేటీఆర్ పై ఈడీ కేసు నమోదవుతుంది.. విచారణను ఆయన ఎదుర్కోవాల్సి ఉంటుందనితెలిపారు. ఈడీ, మోడీ, బోడి అని నోరు పారేసుకునే టప్పుడు నోరు, ఒళ్ళు జాగ్రత్తగా పెట్టుకుంటే మంచిదని కేటీఆర్ కు రఘునందన్ రావు హెచ్చరించారు. గతంలో ఎమ్మెల్సీ కవిత కూడా ఇలానే మాట్లాడిరదని తెలిపారు. తనను అరెస్ట్ చెయ్యి అని ట్విట్టర్‌లో పెట్టిన టిల్లు.. కేసు కాగానే కోర్టుకి వెళ్ళాడని విమర్శించారు. ధైర్యముంటే కేటీఆర్ జైలుకి వెళ్ళాలి.. జైలు లోపల ఎలా ఉంటుందో చూసి రావాలని రఘునందన్ రావు తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కాగా.. ఫార్ములా ఈ–కార్ కేసులో కేటీఆర్ పై ఏసీబీ, ఈడీ కేసులు నమోదు చేసిన సంగతి తెలిసిందే.. ఫార్ములా ఈ–కార్ రేసులో పెద్ద ఎత్తున అవినీతి జరిగిందంటూ కేసు నమోదు చేశారు. మనీలాండరింగ్, ఫెమా ఉల్లంఘన కింద ఈడీ, ఏసీబీ కేసు నమోదు చేసింది. ఫార్ములా ఈ–కార్ రేసులో ప్రమేయం ఉన్న కేటీఆర్, అరవింద్ కుమార్, బీఎల్ఎన్ రెడ్డిపై కేసు నమోదు చేసింది.

## ఆగివున్న లారీని ఢీకొన్న బైక్

**ఇద్దరు యువకుల దుర్మరణం**

పెద్దపల్లి :

పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలంలోని బంజేరుపల్లి తండా దగ్గర శుక్రవారం అర్ధరాత్రి ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. రిపేర్ కారణంగా రోడ్డు మధ్యలో ఆగి ఉన్న లారీని బైక్ ఢీకొట్టింది. ఈ ఘటనలో బైక్‌పై ఉన్న ఇద్దరు యువకులు అక్కడికక్కడే మరణించారు. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్ట్ మార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతులను బంజరుపల్లె గ్రామానికి చెందిన రాజశేఖర్ (28), బానోత్ సంతోష్(26) గా గుర్తించారు పోలీసులు. మృతుల కుటుంబ సభ్యుల ఫిర్యాదు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తోన్నట్లు పోలీసులు తెలిపారు.

## రైతు కుటుంబం ఆత్మహత్య బాధాకరం: కలెక్టర్

కడప :

సింహాద్రిపురం మండలం దిద్దికుంట్ల గ్రామానికి చెందిన రైతు నాగేంద్ర తన భార్య పిల్లలను హతమార్చి ఆత్మహత్య చేసుకున్నారు. కుటుంబ సభ్యులు నలుగురు ఆత్మహత్య చేసుకోవడం చాలా బాధాకరమని జిల్లా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ అన్నారు. ఈ సంఘటనపై శనివారం పట్టణంలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో ఆత్మహత్య చేసుకొని మృతి చెందిన మృతదేహాలను పరిశీలించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సంఘటన గల కారణాలను పులివెందుల డిఎస్పి మురళి నాయక్ ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వ్యవసాయంలో నష్టం రావడం, గత నాలుగు సంవత్సరాలుగా విపరీతంగా అప్పులు చేయడం వలన నాగేంద్ర అనే రైతు తాను ఆత్మహత్య చేసుకోవడంతోపాటు.. భార్యను, పిల్లలను హతమార్చాడు. కారణం ఏదైనా ఒకే కుటుంబంలో నలుగురు కుటుంబ సభ్యులు బలవన్మరణం చెందడం చాలా బాధాకరమైన విషయం అని ఆయన అన్నారు. ఈ ఘటనపై పోలీసులు విచారణ చేస్తున్నారని, విచారణ అనంతరం పూర్తి వివరాలు తెలుస్తాయని ఆయన తెలిపారు. వారి కుటుంబాన్ని కి ఆర్థిక సహాయం చేసే విషయమై నిర్ణయం తీసుకుంటామని కలెక్టర్ వెల్లడిరచారు.

# ఇక సెలవు..

**మొదటిపేజీ తరువాయి**

త్రివిధ దళాల అధిపతులు మన్మోహన్‌కు నివాళులర్పించారు. అంత్యక్రియలకు ఢిల్లీ ముఖ్యమంత్రి ఆతిశీ, తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి, కర్ణాటక సీఎం సిద్ధరామయ్య, భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ హాజరయ్యారు. భూటాన్ రాజు జిగ్మే ఖేసర్ నాంగ్యల్ వాంగ్‌చుక్, విదేశీ ప్రతినిధులు పాల్గొన్నారు. మన్మోహన్ పార్థివదేహాన్ని పార్టీ నేతలు, కార్యకర్తల సందర్శనార్థం శనివారం ఉదయం ఏఐసీసీ ప్రధాన కార్యాలయానికి తీసుకువచ్చారు. కాంగ్రెస్ నేతలు రాహుల్, సోనియా, ప్రియాంక గాంధీ, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఎంపీ మల్లు రవి తదితరులు నివాళులర్పించారు. తర్వాత అక్కడినుంచి నిగమ్‌బోధ్ ఘాట్ వరకు అంతిమయాత్ర కొనసాగింది. ఈ సమయంలో రాహుల్.. మన్మోహన్ కుటుంబం వెన్నంటే ఉన్నారు.92 ఏళ్ల మన్మోహన్ సింగ్ వయసురీత్యా తలెత్తిన అనారోగ్య సమస్యలతో గురువారం రాత్రి ఇంటివద్ద అకస్మాత్తుగా స్పృహ కోల్పోయారు. దీంతో కుటుంబసభ్యులు ఆసుపత్రిలో చేర్చగా చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. మన్మోహన్ పదేళ్ల పాటు దేశానికి ప్రధానిగా పని చేశారు. అంతకుముందు ఆర్‌బీఐ గవర్నర్‌గా వ్యవహరించారు. ప్రధానిగా పీవీ నరసింహారావు హయాంలో ఆర్థిక మంత్రిగానూ బాధ్యతలు నిర్వర్తించారు. అంతకుముందు మన్మోహన్ సింగ్ మృతికి అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ సంతాపం తెలిపారు. మాజీ ప్రధాని సతీమణి గురుశరణ్ సింగ్, కుటుంబసభ్యులకు బైడెన్ దంపతులు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈమేరకు వైట్‌హౌస్ ఓ ప్రకటన విడుదల చేసింది.



# అంత్యక్రియల విషయంలో వివాదం

రాజ్‌ఘాట్‌లో అంత్యక్రియలు జరగని మాజీ ప్రధానుల అంశం తెరపైకి వచ్చింది. దేశ రాజకీయాల్లో ఓ ప్రధాని అంత్యక్రియల విషయం వార్తల్లో నిలవడం ఇదే తొలిసారి కాదు. గతంలో ముగ్గురు ప్రధానుల అంత్యక్రియలు దేశం బయటే జరిగాయి. ఢిల్లీలో అంత్యక్రియలు జరగని ముగ్గురు ప్రధానుల్లో తెలుగువాడు పివి నరసింహారావు కూడా ఉన్నారు. ఆయనపట్ల అప్పట్లో కాంగ్రెస్ అధికారంలో ఉన్నా దారుణంగా వ్యవహరించింది. భారతదేశానికి 1991 నుండి 1996 వరకు భారత ప్రధానిగా పని చేసిన పీవీ నరసింహారావు 2004 డిసెంబర్ 23న తుదిశ్వాస విడిచారు. ఆ సమయంలో ఢల్లీలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉండగా ప్రధాన మంత్రిగా మన్మోహన్ సింగ్ ఉన్నారు. పీవీ నరసింహారావు అంత్యక్రియలు ఢల్లిలోనే నిర్వహించాలని ఆయన కుటుంబ సభ్యులు తొలుత భావించారు. కానీ, కాంగ్రెస్‌లోని కొందరు సీనియర్ నేతలు పీవీ అంతిమ సంస్కారాలు హస్తినలో కాకుండా హైదరాబాద్‌లో నిర్వహించేలా అధిష్ఠానంపై ఒత్తిడి తీసుకువచ్చారు. ఈ అంశంపై ఢల్లీలో ఎన్నో చర్చలు జరిగాయి. అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్ సైతం పీవీ అంత్యక్రియలు ఢల్లీలో నిర్వహించేందుకు సానుకూలంగా ఉన్నప్పటికీ పార్టీలో సీనియర్ల నుంచి వచ్చిన ఒత్తిడితో ఏమి చేయలేకపోయారని అప్పట్లో మన్మోహన్ సింగ్ మీడియా సలహాదారుగా ఉన్న సంజయ్ బారు గతంలో చెప్పిన విషయం తెలిసిందే. చివరకు పీవీ అంత్యక్రియలు హైదరాబాద్‌లో నిర్వహించారు. కాంగ్రెస్ హయాంలో ఢల్లీలో పీవీ నరసింహారావు స్మారకం నిర్మించాలనే చర్చ జరిగినప్పటికీ నిర్మాణం కాలేదు. తెలంగాణాకు చెందిన పీవీ నరసింహారావు దేశ ప్రధానిగా సేవలు అందించినప్పటికీ ఆయన అంత్యక్రియలు ఢిల్లీ జరగలేదు.1989 నుంచి 1990 వరకు భారత ప్రధానిగా పనిచేసిన వీపీ సింగ్ 2008లో మరణించారు. ఆయన అంత్యక్రియలు నిర్వహిస్తారనే చర్చ జరిగింది. చివరికి ఆయనను అలహాబాద్‌కు తీసుకెళ్లారు. ఆ సమయంలో కుటుంబ సభ్యుల కోరిక మేరకు అంత్యక్రియలు ప్రయాగ్‌రాజ్‌లోని సంగం ఒడ్డున నిర్వహించారు. ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించగా.. ప్రభుత్వ ప్రతినిధిగా అప్పటి కేంద్రమంత్రి సుభోధ్కాంత్ సహాయ్ సింగ్ వీపీ సింగ్ అంత్యక్రియలు హాజరయ్యారు. ఆ తర్వాత స్మారక చిహ్నం ఢిల్లీలో నిర్మించాలనే ప్రయత్నం చేసినా నిర్మాణం జరగలేదు. 1977 నుండి 1979 వరకు ప్రధాన మంత్రిగా పనిచేసిన మొరార్జీ దేశాయ్ 1995లో ముంబైలోని జస్లోక్ ఆసుపత్రిలో కన్నుమూశారు. మొరార్జీ కుటుంబ సభ్యుల కోరిక మేరకు సబర్మతి ఒడ్డున ఆయన అంత్యక్రియలు జరిగాయి. మొరార్జీ అంత్యక్రియలకు అప్పటి ప్రధాని పీవీ నరసింహారావు హాజరయ్యారు. అంత్యక్రియల అనంతరం మొరార్జీ చితాభస్మాన్ని ఢల్లీకి తరలించారు. మాజీ ప్రధానులు జవహర్‌లాల్ నెహ్రూ, లాల్‌బహదూర్ శాస్త్రి, ఇందిరాగాంధీ, చంద్రశేఖర్, చౌదరి చరణ్ సింగ్, రాజీవ్ గాంధీ, ఐకే గుజ్రాల్, అటల్ బిహారీ వాజ్‌పేయి అంత్యక్రియలు ఢల్లీలోనే జరిగాయి. వీరిలో నెహ్రూ, శాస్త్రి, ఇందిరాగాంధీ, చౌదరి చరణ్, చంద్రశేఖర్, రాజీవ్ గాంధీ, అటల్ బిహారీ వాజ్‌పేయి స్మారకాలకు ప్రత్యేక స్థలాన్ని కేటాయించారు. ఈ ప్రధానులతో పాటు సంజయ్ గాంధీ అంత్యక్రియలు రాజ్‌ఘాట్‌లో నిర్వహించారు

## ప్రతి పని విశ్వకర్మలతోనే ముడిపడి ఉంది

**తెలంగాణ సాధనలో విశ్వకర్మల పాత్ర కీలకం**

**అఖిలభారత విశ్వకర్మ మహాసభలో ఈటెల రాజేందర్**

హైదరాబాద్ :

దేశంలో వ్యవసాయం, దుస్తులు ఆఖరికి ఇల్లు కావాలన్నా.. జీవించడానికి కావాల్సిన ప్రతి ప్రధాన పని విశ్వకర్మలతోనే ముడిపడి ఉందని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ పేర్కొన్నారు. అఖిలభారత విశ్వకర్మ మహాసభను అధ్యక్షుడు కౌలె జగన్నాథం అధ్యక్షతన కొత్తపేట బాబుజగ్జీవన్‌రామ్ భవన్‌లో శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఈటల మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధనలో విశ్వకర్మల పాత్ర ఎంతో కీలకమన్నారు.

ఆ సామాజిక వర్గానికి చెందిన తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్, తెలంగాణ సాధన ఉద్యమంలో ప్రాణాలర్పించిన శ్రీకాంతాచారిలే ఇందుకు నిదర్శనమన్నారు. దేశ ప్రధాని నరేంద్రమోదీకి గుజరాత్ రాష్ట్రంలో అత్యంత సన్నిహితంగా ఉన్న వర్గాలు విశ్వకర్మలేనన్నారు. విశ్వకర్మల ఆర్థికాభివృద్ధి కోసం ప్రధాని మోదీ పీఎం విశ్వకర్మ యోజన పథకాన్ని ప్రవేశపెట్టారని ఆయన గుర్తు చేశారు. విశ్వకర్మలు ఎదుర్కొంటున్న సమస్యలను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. రా ష్ట్రంలో 25లక్షల జనాభ కలిగి ఉన్న విశ్వకర్మలు కులవృత్తులపైనే ఆధార పడి జీవనం సాగిస్తున్నారన్నారు. తెలంగాణ వస్తే కుల వృత్తులకు తోడ్పాటు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిస్తారని ఆశపడ్డారని తొమ్మిదేళ్ల కాలంలో పాలకులు విశ్వకర్మల అభివృద్ధి, సంక్షేమం కోసం పని చేయకుండా పూర్తిగా నిర్లక్ష్యం చేశారన్నారు. జగన్నాథం మాట్లాడుతూ విశ్వకర్మ నాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేసి వెయ్యి కోట్ల నిధులు కేటాయించాలని కోరారు. 55 సంవత్సరాలు నిండిన వృత్తి కళాకారులకు రూ.5వేల పింఛన్ ఇవ్వాలని కోరారు. ప్రమాదవశాత్తు మరణించిన వారికి రూ.10లక్షలు ఇవ్వాలన్నారు. రాజకీయంగా నామినేటెడ్ పదవులు ఇవ్వాలన్నారు. బ్యాంకు గ్యారెంటీ లేకుండా రూ.25లక్షల వరకు వ్యక్తిగత రుణం ఇప్పించాలని కోరారు. రాష్ట్ర రాజధానిలో కేటాయించిన 5ఎకరాల స్థలంలో రూ. 200కోట్లతో అన్ని వసతులతో విశ్వకర్మ భవనాన్ని నిర్మించి ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆయన కోరారు. సెప్టెంబర్ 17న విశ్వకర్మ జ యంతి సందర్భంగా ప్రతిభకనబర్చిన విశ్వకర్మ చేతి వృత్తిదారులకు గౌరవ పురస్కారాలు ఇవ్వాలన్నారు. ఈ సందర్భంగా వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన ప్రతినిధులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి, కార్పొరేటర్లు రాధాధీరజ్‌రెడ్డి, పవన్‌కుమార్, విశ్వకర్మ మహాసభ జాతీయ అధ్యక్షుడు చెడ్డిలాల్‌శర్మ, వర్కింగ్ ప్రెసిడెంట్ ఐలేష్‌కుమార్, ప్రధాన కార్యదర్శి దినేష్ బాయ్‌శర్మ, ఉపాధ్యక్షుడు ఎంఎం శర్మ, నాయకులు మనోరంజన్, రాజశేఖర్, కృష్ణగంజ్, సూర్యనారాయణ, గులాబ్‌శర్మ, చెన్నయ్యచారి, లింగాచారి, మురళీధర్‌చారి పాల్గొన్నారు.



## బిసిలపై మొసలి కన్నీరు ఆపండి

**లిక్కర్ కేసు దృష్టి మళ్లించే యత్నం**

**ఎమ్మెల్సీ కవితపై మండిపడ్డ ఆది శ్రీనివాస్**

హైదరాబాద్ : బీసీ రిజర్వేషన్లపై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తెగ హడావిడి చేస్తున్నారని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ విమర్శలు శారు. బీసీల గురించి ఆమె పోరాడాల్సిన అవసరం ఏముందని అడిగారు. సమస్యల పరిష్కారం కోసం పోరాడే శక్తి బీసీలకు ఉందని.. బీసీ నాయకత్వంలో సమస్యలను పరిష్కరించుకుంటామని అన్నారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ.. బీసీలతో అసలు కవితకు ఏం సంబంధమని ప్రశ్నించారు. బీసీలపైన ముసలి కన్నీరు, కపట ప్రేమ కవిత చూపిస్తోందని మండిపడ్డారు. అగ్రకులాల చెప్పు చేతల్లో ఉద్యమాలు చేయాల్సిన కర్మ బీసీలకు లేదన్నారు. లిక్కర్ కేసును జనం దృష్టి మళ్లించడానికి కవిత బీసీ డ్రామాలు ఆడుతున్నారని విమర్శలు గుప్పించారు. లిక్కర్ దందాలో ఆరు నెలలు జైల్లో ఉండొచ్చిన కవిత నాయకత్వం బీసీలకు అవసరం లేదన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బీసీలకు అన్ని రకాలుగా న్యాయం చేస్తున్నారని.. బీసీ రిజర్వేషన్లు పెంచేది కూడా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డే అని ప్రభుత్వ ఆది శ్రీనివాస్ స్పష్టం చేశారు.'కల్వకుంట్ల కవిత నాయకత్వంలో బీసీల సమస్యలను పరిష్కరించుకొనే కర్మ మాకు పట్టలేదు' అంటూ వ్యాఖ్యలు చేశారు. కవిత నాయకత్వం బీసీలకు అవసరం లేదన్నారు. పదేళ్లు అధికారంలో ఉన్నప్పుడు బీసీల గురించి ఏనాడైనా కవిత మాట్లాడారా? అని నిలదీశారు. దేశానికి కులగణనలో తెలంగాణ రోల్ మోడల్‌గా మారిందని తెలిపారు. బీసీలకు స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించడమే ధ్యేయంగా కులగణన జరిగిందన్నారు. రాహుల్ గాంధీ సూచనలతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కులగణన చేపట్టారని తెలిపారు. గిరిజనులు, మైనార్టీలకు12 శాతం రిజర్వేషన్లు ఇస్తామని చెప్పిన కేసీఆర్.. అప్పుడు బీసీల గురించి ఎందుకు మాట్లాడలేదని అన్నారు. పదేళ్లలో బీసీలను ఏనాడు పట్టించుకోలేదని.. ఏ కార్యక్రమాన్ని సరిగా అమలు చేయలేదని మండిపడ్డారు. బీసీ కార్పొరేషన్‌తో పాటు ఇతర కార్పొరేషన్లను నిర్వీర్యం చేశారని విమర్శించారు. బీసీకు రుణాలు ఇవ్వకుండా మొండి చేయి చూపించారన్నారు. ఎంబీసీ కార్పొరేషన్ ఏర్పాటు చేసి ఒక్క పైసా నిధులు ఇవ్వలేదన్నారు. బీసీలపైన బీఆర్ఎస్ పార్టీకి అంత ప్రేమ ఉంటే కులగణనను ఎందుకు ఆహ్వానించలేదని మరో ప్రశ్న వేశారు. కులగణనపైన కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావు ఎందుకు పాల్గొనలేదని అన్నారు. సామాజిక, ఉపాధి, విద్యా, రాజకీయంగా బీసీ వాటా కులగణనతో తేలిపోతుందని... దానికి అనుగుణంగా వాటా దక్కుతుందన్నారు. రిజర్వేషన్లు పెంచకుండా స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్తున్నట్లు కవిత ఆరోపణల్లో అర్థం లేదన్నారు. గందరగోళాన్ని సృష్టించడం కోసం ఆమె డ్రామాలు ఆడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 3 వ తేదీన బహిరంగ సభ నిర్వహిస్తామని కవిత అంటున్నారని.. సభ నిర్వహించడానికి కవిత ఎవరు అంటూ విరుచుకుపడ్డారు. కవిత నాయకత్వంలో జరిగే సభకు బీసీలు ఎవరూ హాజరుకావొద్దని పిలుపునిచ్చారు.

# కొత్త ఏడాదిలో మరింత దూకుడు

**మొదటిపేజీ తరువాయి**

హైడ్రా ఇప్పటికే 200 ఎకరాల భూమిని కాపాడిరదని గుర్తుచేశారు. ఇప్పటివరకు 8 చెరువులు, 12 పార్కులను కాపాడామని అన్నారు. ఈఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లపై ప్రజల్లో అవగాహన పెరిగిందని రంగనాథ్ పేర్కొన్నారు. త్వరలో హైడ్రా పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. కొత్తగా 1025 చెరువుల హద్దులను ఏర్పాటు చేస్తున్నామని రంగనాథ్ చెప్పారు. హైదరాబాద్‌లో హైడ్రా సమాచారం చేరవేయడం కోసం ఓ ఈఓ రేడియో ప్రారంభిస్తామని తెలిపారు. జూలై 19వ తేదీకు ముందు తర్వాత అక్రమ కట్టడాలను శాటిలైట్ ఇమేజ్ ద్వారా గుర్తిస్తున్నామని అన్నారు. అక్రమ నిర్మాణాలు కూల్చివేయడమే హైడ్రా పని కాదని.. 12 చెరువులను పునరుద్ధరణ చేస్తున్నామని చెప్పారు. డీఆర్ఎఫ్‌లో 72 టీమ్స్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. క్షఖీఖీ వరకు డీఆర్ఎఫ్ పని చేస్తుందన్నారు. కొంత మంది హైడ్రాపై అసత్య ప్రచారం చేస్తున్నారు.. దానిని ఖండిస్తున్నామని రంగనాథ్ అన్నారు.'హైడ్రా ఏర్పడి దాదాపు 5 నెలలు దాటింది. ఐదు నెలల అనుభవాలు, వచ్చే ఏడాది రూట్ మ్యాప్ సిద్ధం చేశాం. హెచ్ఎండిఏ వరకు హైడ్రా పరిధి ఉంది. జీహెచ్ఎంసీ చట్టం కింద రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా అధికారులను కేటాయించింది. 200 ఎకరాల ప్రభుత్వ భూమిని రక్షించాం. 12 చెరువులు, 8 పార్కులను అన్యాక్రాంతం కాకుండా హైడ్రా కాపాడిరది. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌పై ప్రజల్లో అవగాహన పెరిగింది.1095 చెరువుల్లో వచ్చే ఏడాది ఎఫ్‌టీఎల్ నిర్ధారణ చేస్తాం. సాంకేతిక పరిజ్ఞానం, డాటాతో ఎఫ్‌టీఎల్ నిర్ధారణ చేస్తాం. ఎఫ్‌టీఎల్‌ను పారదర్శకంగా చేయడం మా బాధ్యత. శాటిలైట్ ఇమేజ్ తో అత్యంత రెజల్యూషన్ ఉన్న డేటా తీసుకుంటున్నాం. 2006 నుంచి 2023 వరకు ఏరియల్ డ్రోన్స్‌తో తీసిన ఫొటోలను కూడా ఎఫ్‌టీఎల్ నిర్ధారణ కోసం తీసుకుంటున్నాం. ఎఫ్‌టీఎల్ మారడానికి గల కారణాలు స్పష్టంగా తెలుస్తుంది. శాస్త్రీయమైన పద్ధతుల్లోనే ఎఫ్‌టీఎల్ నిర్ధారణ జరుగుతుంది. నాలాలపై కిర్లోస్కర్ కంపెనీ చేసిన స్టడీని తీసుకుంటున్నాం. 5800 ఫిర్యాదులు హైడ్రాకు అందాయి. అనధికారిక నిర్మాణాలకు సంబంధించి 27 పురపాలక సంఘాల నుంచి




ఫిర్యాదులు వస్తున్నాయి' అని రంగనాథ్ పేర్కొన్నారు. '27 పురపాలక సంఘాలపై కూడా మాకు అధికారం ఉంది. శాటిలైట్ ఇమేజ్‌ల ద్వారా ఆక్రమణలను గుర్తిస్తున్నాం. భవన నిర్మాణ వ్యర్థాల డంపింగ్‌పై కూడా దృష్టి పెట్టాం. 2025లో జియో ఫెన్సింగ్ సర్వే చేస్తాం. 12 చెరువుల పునరుద్ధరణకు సంబంధించిన ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపాం. త్వరలోనే 72 డీఆర్ఎఫ్ బృందాలు అందుబాటులోకి వస్తాయి. నాగోల్‌లో ఉన్న డీఆర్ఎఫ్ కేంద్రాన్ని బలోపేతం చేస్తాం. నగరంలో మరో డాప్లర్ వెదర్ రాడార్ రాబోతుంది. వెదర్ డాటాను విశ్లేషించేందుకు హైడ్రాలో ఒక టీంను ఏర్పాటు చేస్తున్నాం అని అన్నారు.





# జమిలి జపంలో నిజాలు మరుగు!


సంపాదకీయం

రాజకీయాల్లో ఉత్థానపతనాలు సహజం. ఎన్నికల్లో గెలుపోటములు కూడా అంతే సహజం. ఈ యేడాది జరిగిన ఎన్నికల్లో పలు పార్టీలు అలా లబ్ది పొందాయి. ఎపిలో చంద్రబాబు నాయుడు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగా జగన్..అసమర్థ విధానాలతో ఓటమి చెందారు. కనీసం పోటీ కూడా ఇవ్వలేక పోయారు. అయినా ఆయనలో ఆత్మపరిశీలన జరగడం లేదు. ఎందుకు ఓడామన్నది తర్కించడం లేదు. అయితే జనసేన అనూహ్యంగా ప్రజల్లో దూసుకుని వచ్చింది. ఇప్పుడు ఓ రకంగా ప్రత్యమానాయ నేతగా పవన్ కళ్యాణ్ ఎదిగారు. డిప్యూటి సిఎంగా సమస్యలపై ఆయన స్పందిస్తున్న తీరు కూడా ప్రజల్లో మంచి పేరును తీసుకుని వస్తోంది. అలాగే తెలంగాణలో కెసిఆర్ నేతృత్వంలోని బిఆర్ఎస్ ఒక్కటంటే ఒక్క పార్లమెంట్ సీటు కూడా గెల్చుకోలేక పోయింది. ఇది కూడా ఆ పార్టీ అనుసరించిన మూర్ఖ నిర్ణయాల కారణంగానే అని చెప్పవచ్చు. అసెంబ్లీ ఎన్నికల నుంచి పార్లమెంట్ ఎన్నికలు వచ్చేసరికి బిఆర్ఎస్ ప్రజల్లో పూర్తిగా నిస్తేజం పొందింది. అయితే ఆరుసీట్లతో బిజెపి పంటపండిరది. ఇక దేశ రాజకీయాల్లోకి పరికిస్తే ఓ రకంగా కాంగ్రెస్ మళ్లీ కొంత పుంజుకోగలిగింది. విపక్షస్థాయికి ఎదిగింది. ఈ ఎన్నికల్లో అధికారం తమదే అని భావించినా..రాహుల్ నాయకత్వం పట్ల ప్రజల్లో అప్పుడే నమ్మిక కుదరలేదు. అయితే చెల్లి ప్రియాంక ను మాత్రం ఎంపిగా గెలిపించుకున్నారు. అలాగే ప్రతిపక్షనేత హోదాతో రాహుల్ ఓ పెద్దపదవినే అందుకునే అదృష్టం ఈ యేడాది కలిగింది. ఇకపోతేమరోమారు ప్రధాని పదవి చేపట్టిన మోడీ చావుతప్పి కన్ను లొట్టపోయినట్లుగా గెలిచారు. అధికార పీఠానికి దూరమయినా..ఎన్డీఎ పక్షాల మద్దతుతో ప్రధాని కాగలిగారు. ఆయన అనుసరిస్తున్న ఆర్థిక విధానాలు ప్రజల నడ్డి విరుస్తున్నాయి. అందుకే బిజెపిపై ప్రజల్లో వ్యతిరేకత వస్తోంది. అయినా దీనిని మోడీ కానీ, బిజెపి కానీ గుర్తించడం లేదు. మోడీ ఆర్థిక విధానాలు, జిఎస్టీ దాడులు ఇలాగా సాగితే జమిలి ఎన్నికలు పెడితే బిజెపి ఊడ్చిపెట్టుకుపోవడం ఖాయం. ఇలా రాజకీయ రంగం విషయాని కొస్తే 2024 కొందరికి మధురస్మృతులను మిగిలిస్తే.. మరికొందరికి ఎప్పటికీ మర్చిపోలేని అనుభవాలను నేర్పింది. అహంకారంతో వ్యవహరిస్తే ఎలా ఉంటుందో ప్రజలు నాయకులకు రుచి చూపించారు. ఏదైనా ఏకపక్ష నిర్ణయాలు ప్రజాస్వామ్యంలో మంచిదికాదనే సందేశాన్ని ప్రజలు ఇచ్చిన సంవత్సరంగా 2024 మిగిలిపోతుంది. అయితే ఇదే సందర్భంలో జమిలి ఎన్నికలపై ఈ యేడు కసరత్తు మొదలయ్యింది. జమిలి ఎన్నికల నిర్వహణ మంచిదే అయినా..రాజకీయ సంస్కరణలు లేకుండా జమిలి ఎన్నికలు నిర్వహించినా లాభం ఉండబోదు. ప్రధానంగా రాజకీయ నేరాలకు అడ్డుకట్ట పడాలి. నేరస్థులు రాజకీయంగా లబ్దిపొందుతున్న వేళ..అలాంటి వారు రాజకీయాల్లో అడుగిడకుండా చేయాలి. ఇకపోతే ఏటా ఎన్నికల్లో డబ్బు ప్రమేయం పెరిగిపోయింది. రాజీయాలను నల్లడబ్బు ప్రభావం చేస్తోంది. వ్యాపార వేత్తలు, చీకటి వ్యాపారులు రాజకీయాలను శాసిస్తున్నారు. గూండాలు, రైడీలు ఎంపిలుగా, ఎమ్మెల్యేలుగా గెలుపొందుతున్నారు. సామాన్యుడు ఎన్నికల్లో పోటీ చేసే పరిస్థితి లేకుండా పోయింది. ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్య దేశంగా చెప్పుకుంటున్న భారత్‌లో ప్రజాస్వామ్యం అపహాస్యం అవుతోంది. ఏఎంత ఖర్చుపెట్టయినా ఎన్నికైతే అధికార పార్టీలోకి ఫిరాయించి డబ్బు సంపాదించవచ్చనే ధోరణి కనిపిస్తోంది. పార్టీ ఫిరాయింపులు విచ్చలవిడిగా మారయి. చట్టంతో అడ్డుకట్ట వేయలేకపోతున్నాం. అందుకే ఇక్కడి నుంచే సంస్కరణ మొదలు కావాలి. ఎంపీ అయినా, ఎమ్మెల్యే అయినా పార్టీ మారిన వెంటనే వారి సభ్యత్వం ఎవరి ప్రమేయం లేకుండా తక్షణం రద్దయిపోయేలా చట్టం లో సంస్కరణ రావాలి. దేశంలో జమిలి ఎన్నికలు నిర్వహించడమే సర్వరోగ నివారణి అంటున్న, మోడీ ముందుగా ఇలాంటి సంస్కరణ చేపడితే దేశంతో పాటు ప్రపంచం కూడా హర్షిస్తుంది. అలాగే వరుసగా గెలవడం అన్నది ఓ రికార్డుగా ప్రచారం చేసుకుంటున్నారు. అలా కాకుండా ఒక్కరికి రెండుసార్లు మాత్రమే అవకాశం అన్న చట్టం రావాలి. లేకుంటే గాంధీ కుటుంబం, కెసిఆర్ కటుబం, చంద్రబాబు కటుంబం, లాలూ, ములాయం కుటుంబాలే రాజ్యమేలుతుంటాయి. లోక్‌సభ, శాసనసభలకు ఒకేసారి జమిలి ఎన్నికలు నిర్వహిస్తే ఖర్చు తగ్గుతుందని, అభివృద్ధిపై దృష్టి సారించవచ్చని, శాంత్రిభద్రతల సమస్యలు ఉండదని కేంద్ర ప్రభుత్వం వాదిస్తోంది. కానీ జమిలి ఎన్నికలు జరిగినప్పటికి లోక్‌సభ, శాసనసభలు ముందే రద్దు కావనే గ్యారంటీ ఏమిటని రాజకీయ విశ్లేషకులు ప్రశ్నిస్తున్నారు. సంకీర్ణ ప్రభుత్వాలు ఏర్పడితే ఏదైనా సాధ్యమే. ఎన్నికల్లో ధనబలం నిరోధించేలా, ఒక్కరే పలుమార్లు ఎన్నికయ్యేలా ఉన్న వెసలుబాటును తొలగించాలి. ఇలాంటి ఎన్నికల సంస్కరణలు తక్షణావసరం అని గుర్తించాలి. పారదర్శకమైన పాలనకు బాటలు వెయ్యాలంటే జమిలితో పాటే, ఎన్నికల విధానాన్ని సంస్కరించాల్సి ఉంది. లెక్కకు మించిన కుంభకోణాలతో కోటానుకోట్లు కొల్లగొట్టిన నేతలు చట్టసభల్లో శాసననిర్మాతలుగా మన కళ్లముందే నిలబుడుతున్నారు. చట్టసభల్లో నేరచరితగలవారు, నేరారోపణలు ఎదుర్కొంటున్నవారు 25 నుంచి 50 శాతానికి ఎగబాకారు. నేరస్తులు ఎన్నికల్లో పోటీ చేయకుండా ముందుగా అడ్డుకట్ట పడాలి. అలాగే ఒక్కరే జీవితాంతం ప్రజాప్రతినిధులుగా చట్టసభల్లో తిష్ట వేయకుండా చూడాలి. చట్టసభల్లో నేరస్థులకు తావులేకుండా చేయాలన్న సుప్రీం సూచనలు శిరోధార్యం కావాలి. ఎన్నికల వ్యవస్థని సమూలంగా ప్రక్షాళించాలి. ప్రజాస్వామ్య వ్యవస్థని కంటికి రెప్పలా సర్వ స్వతంత్రంగా, స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహించే బలమైన అధికారం ఉన్న ఎన్నికల కమిషన్ రావాల్సి ఉంది. కఠినమైన ఎన్నికల సంస్కరణలు అమలు చేసి, ప్రజల్లో భారతీయ ఎన్నికల వ్యవస్థపై నమ్మకాన్ని పునరుద్ధరించాలి. అప్పుడే జమిలి ఎన్నికలకు వెళితే అర్థం ఉంటుంది. ఇప్పుడున్న పరిస్థితుల్లో రాజకీయం చేస్తున్న వారంతా నిజాయితీగా ఆలోచన చేయాలి. లేకుంటే ప్రజలు ఏదో ఒక సమయంలో వారికి వాతలు పెట్టడం ఖాయం.

# మా నాన్నను కాంగ్రెస్ అగౌరవపర్చింది

**సిడబ్ల్యూసిలో సంతాపం తెలప నేలేదు**
**దివంగత ప్రణబ్ ముఖర్జీ కూతురు శర్మిష్ఠా ముఖర్జీ**
**ఎక్స్ వేదికగా సూటిగా ప్రశ్నలు**
**పివికి జరిగిన అవమానాన్ని మాత్రం ప్రశ్నించేదెవరు?**





**న్యూఢిల్లీ, నినాదం:**

మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ అంత్యక్రియల సమయంలో కాంగ్రెస్ పార్టీలో వివాదం చెలరేగింది. తన తండ్రి, మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీని కాంగ్రెస్ పార్టీ సరిగ్గా గౌరవించలేదని, ఆయన విషయంలో తీరని అన్యాయం చేశారని శర్మిష్ఠా ముఖర్జీ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ మేరకు ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

**నిజానికి పివిని అధికారంలో ఉండి కాంగ్రెస్ నిరాదరించింది.**

మరణిస్తే మర్యాదలు పాటించలేదు. కాంగ్రెస్ కార్యాలయం ముందునుంచే పివి భౌతిక కాయాన్ని పంపించివేశారు. ఓ రకంగా చెప్పాలంటే అత్యంత నీచంగా అగౌరవపర్చిన తీరుచరిత్ర ఎన్నటికీ మరువదు. కానీ అధికారంలో ఉన్న బిజెపి మాత్రం అటు ప్రణబ్ ముఖర్జీని, ఇప్పుడు మన్మోహన్ సింగ్‌లను సమున్నతస్థాయిలో గౌరవించింది. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ అంత్యక్రియలు శనివారం అధికారిక లాంఛనాలతో నిర్వహించడమే కాదు...రాష్ట్రపతి, ప్రధాని, మంత్రులు, ఉపరాష్ట్రపతి, స్పీకర్ అంతా హాజరౌ గౌరవాన్ని చాటుకున్నాన్నారు. ఏఐసీసీ ఆఫీస్ నుంచి నిగమ్ బోధ్ వరకు మాజీ ప్రధాని అంతిమ యాత్ర జరిగింది. అనంతరం అక్కడే అంత్యక్రియలు నిర్వహించారు. ఆ ప్రదేశంలోనే స్మారకం నిర్మించాలని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రధాని నరేంద్ర మోదీకి లేఖ రాసారు. దీనిపై కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. కానీ తన తండ్రి విషయంలో కాంగ్రెస్ నేతలు ఉదాసీనంగా వ్యవహరించారని ప్రణబ్ ముఖర్జీ కూతురు షర్మిష్ట ఆరోపించారు. మన్మోహన్ విషయంలో చూపిన శ్రద్ధ, ప్రేమ, గౌరవం తన తండ్రి ప్రణబ్ ముఖర్జీ ఎందుకు చూపలేదని శర్మిష్ఠా ముఖర్జీ ప్రశ్నించారు. తన తండ్రి ప్రణబ్ ముఖర్జీ చనిపోతే కనీసం సీడబ్ల్యూసీ (అచిఅ) సమావేశం కూడా నిర్వహించకపోవడాన్ని ఆమె తప్పుపట్టారు. కాంగ్రెస్ పార్టీకి ఎంతో సేవ చేసిన ప్రణబ్ ముఖర్జీ అనంతరం దేశానికి రాష్ట్రపతిగా సేవలు చేసినా ప్రయోజనం లేకపోయిందని మండిపడ్డారు. ప్రణబ్ ముఖర్జీకి నివాళులర్పించేందుకు సీడబ్ల్యూసీ సమావేశం నిర్వహించి అధికారికంగా నివాళులు ఎందుకు అర్పించలేదని ఎక్స్ వేదికగా ప్రశ్నించారు. ప్రణబ్ ముఖర్జీ 2020లో మరణించారు. ఆ సమయంలో సీడబ్ల్యూసీ సమావేశం నిర్వహించకపోవడంపై శర్మిష్ఠా ముఖర్జీ పలు విషయాలు లేవనెత్తారు. నివాళి అర్పించేందుకు సీడబ్ల్యూసీ భేటీ ఎందుకు నిర్వహించలేదని అడిగితే.. రాష్ట్రపతిగా చేసిన వారికి అలా చేయరని చెప్పి తనను తప్పుదోవ పట్టించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రపతులకు సీడబ్ల్యూసీ సమావేశం నిర్వహించి సంతాపం తెలిసేపే ఆ సంప్రదాయం పాటించడం లేదని ఓ సీనియర్ కాంగ్రెస్ నేత తనకు చెప్పారని తెలిపారు. కానీ తన తండ్రి డైరీని చదివితే అది నిజం కాదని తెలిసిందని... గతంలో రాష్ట్రపతి కెఆర్ నారాయణన్‌కు నివాళులర్పించేందుకు సీడబ్ల్యూసీ భేటీ నిర్వహించినట్లు అందులో ఉందన్నారు. కనీసం శర్మిష్ట చిన్న విషయానికే ఆవేదన చెందారు. కానీ పివి విషయంలో కాంగ్రెస్ చేసిన దుర్మార్గానికి చరిత్ర ఎన్నటికీ క్షమించదు. చీమూ నెత్తురు ఉన్న ప్రజలు ఈ విషయం గురించి ఆలోచిస్తూనే ఉంటారు. పివి అంత్యక్రియలు హస్తినలో నిర్వహించకుండా అత్యంత అగౌరవంగా ఆయన భౌతిక కాయాన్ని హైదరాబాద్‌కు పంపించిన వైనం దేశ ప్రజలు నేటికీ మరచి పోలేదు.

# శతక్కొట్టిన నితీశ్‌కుమార్ రెడ్డి

## మెల్‌బోర్న్ టెస్ట్‌లో రికార్డు శతకం

మెల్‌బోర్న్, నినాదం:

తెలుగు కుర్రాడు నితీశ్‌కుమార్ రెడ్డి ఆస్ట్రేలియా పర్యటనలో అదరగొట్టాడు. పేస్ ఆల్‌రౌండర్‌గా జట్టులోకి వచ్చిన అతడు మెల్‌బోర్న్ టెస్టులో జట్టును ఫాల్ ఆన్ గండం నుంచి బయటపడేశాడు. ఈక్రమంలో టెస్టు కెరీర్‌లో 171 బంతుల్లో తొలి శతకం సాధించాడు. ఎనిమిదో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చిన నితీశ్ తొలి బంతి నుంచి నిలకడైన ఆటతీరును ప్రదర్శించాడు. ప్రత్యర్థి బౌలర్లకు ఏమాత్రం అవకాశం ఇవ్వలేదు. ఆస్ట్రేలియా గడ్డపై 8వ స్థానంలో వచ్చి అత్యధిక పరుగులు చేసిన భారత బ్యాటర్‌గా నిలిచాడు. ఇంతకుముందు స్పిన్ దిగ్గజం అనిల్ కుంబ్లే (87) పేరిట ఈ రికార్డు ఉండేది. ఇప్పుడు దానిని అధిగమించాడు. సుందర్‌తో కలిసి భారత ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించిన నితీశ్ సెంచరీ సమయంలో టెన్షన్ వాతావరణం నెలకొంది. స్వల్ప వ్యవధిలో రెండు వికెట్లను భారత్ కోల్పోయింది. చివరి వికెట్‌గా సిరాజ్ మాత్రమే ఉన్నాడు. అప్పుడు నాన్‌స్ట్రైకింగ్ ఎండ్‌లో నితీశ్ 99 పరుగుల మీద ఉండటం.. కమిన్స్, బోలాండ్ కట్టుదిట్టంగా బంతులేయడంతో అభిమానుల్లో ఆందోళన రేగింది. అయితే, సిరాజ్ చక్కటి డిఫెన్స్‌తో ఆడి నితీశ్‌కు స్ట్రైకింగ్ ఇచ్చాడు. బోలాండ్ బౌలింగ్‌లో బౌండరీతో సెంచరీని పూర్తి చేశాడు. దీంతో ప్రేక్షకుల్లో ఉన్న నితీశ్ తండ్రి ముత్యాలరెడ్డిని అభినందిస్తూ ఫ్యాన్స్ సంబరాలు చేసుకున్నారు. నితీశ్‌తోపాటు సుందర్ (50) కూడా కీలక ఇన్నింగ్స్ ఆడాడు. తొమ్మిదో స్థానంలో వచ్చిన అతడు హాఫ్ సెంచరీ సాధించాడు. క్రీజ్‌లో పాతుకుపోయిన సుందర్ 146 బంతుల్లో అర్ధశతకం పూర్తి చేశాడు. అతడి కెరీర్‌లో ఇది నాలుగో హాఫ్ సెంచరీ. సెంచరీ హీరో నితీశ్‌తో కలిసి ఎనిమిదో వికెట్‌కు శతకం (127 పరుగులు) భాగస్వామ్యం నిర్మించాడు. నాథన్ లైయన్ బౌలింగ్‌లో స్లిప్‌లో క్యాచ్ ఇచ్చి 8వ వికెట్ రూపంలో పెవిలియన్‌కు చేరాడు. నితీశ్ సెంచరీ పూర్తయ్యాక బ్యాడ్‌లైటింగ్ కారణంగా ఆట నిలిచిపోయింది. అప్పటికి భారత్ స్కోరు 358/9. క్రీజ్‌లో నితీశ్ (105?), సిరాజ్ (2) ఉన్నారు. ఇంకా భారత్ 116 పరుగులు వెనకబడి ఉంది. అయితే, వర్షం వచ్చేయడంతో పిచ్‌ను కవర్లతో సిబ్బంది కప్పేశారు. ఎంతకీ తగ్గకపోవడంతో ఆటను నిలిపేస్తున్నట్లు అంపైర్లు ప్రకటించారు. దీంతో మూడో రోజు ఆట ముగిసింది. ఇవాళ భారత్ నాలుగు వికెట్లను కోల్పోయి 193 పరుగులు రాబట్టింది. తొలి ఇన్నింగ్స్‌లో ఆసీస్ 474 పరుగులు చేసిన సంగతి తెలిసిందే.

# మన్మోహన్‌కు నివాళి కోసం అసెంబ్లీ భేటీ

**30న ప్రత్యేక సమావేశం ఏర్పాటు**

హైదరాబాద్ : దివంగత మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు నివాళి అర్పించేందుకు తెలంగాణ అసెంబ్లీ ప్రత్యేక సమావేశం ఈ నెల 30వ తేదీన జరగనుంది. సోమవారం ఉదయం 10 గంటలకు సభ ప్రారంభం కానుంది. సంతాప దినాల్లో భాగంగా మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు శాసన సభ నివాళులర్పించనుంది. భారత మాజీ ప్రధాని, ఆర్థికవేత్త మన్మోహన్ సింగ్(92) గురువారం రాత్రి కన్నుమూశారు. గత కొన్నాళ్లుగా వృద్ధాప్య సంబంధ సమస్యలతో బాధపడుతున్న ఆయన గురువారం రాత్రి స్పృహ కోల్పోవడంతో కుటుంబసభ్యులు దవాఖానకు తరలించారు. దాదాపు గంటన్నర పాటు ఆయనకు చికిత్స అందించేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించలేదని, 9.51 గంటలకు ఆయన తుదిశ్వాస విడిచారని ఎయిమ్స్ ప్రకటించింది. మన్మోహన్ మృతికి సంతాప సూచకంగా కేంద్ర ప్రభుత్వం 7 రోజుల సంతాప దినాలను కూడా ప్రకటించింది.



# సోమవారమే సోమవతి అమావాస్య

**పూజలు, వ్రతాలకు ప్రత్యేకం**

హిందూ మతంలో అమావాస్య తిథికి చాలా ప్రత్యేక ప్రాముఖ్యత ఉంది. అమావాస్య తిథి రోజున స్నానం చేయడం, దానం చేయడం వల్ల పుణ్యఫలం లభిస్తుంది. ప్రతి నెలలో వచ్చే అమావాస్యకు ప్రత్యేక ప్రాముఖ్యత ఉంది. అమావాస్య తిథి రోజున పూర్వీకులకు తర్పణం విడవడం, పిండ ప్రదానం చేయడం ద్వారా వ్యక్తి విశేష ఫలితాలను పొందుతాడు. వేద క్యాలెండర్ ప్రకారం మార్గశిర అమావాస్య రోజున శివుడు , విష్ణువులను పూజించడంతో పాటు స్నానం చేయడం, దానం చేయడం శుభప్రదంగా పరిగణించబడుతుంది. ఇలా చేయడం వల్ల ఇంటిలో సుఖ, శాంతి, ఐశ్వర్యం మొదలైనవి లభిస్తాయని నమ్మకం. అంతేకాదు ఎవరైనా తెలిసి తెలియక చేసిన పాపాల నుంచి ఉపశమనం లభిస్తుందని విశ్వాసం. తమిళనాట అమావాస్యను మంచిరోజుగా భావిస్తారు. పుణ్యకార్యాలు చేస్తారు. పెళ్లిళ్లు ఇతర శుభకార్యాలకు అమావాస్యను ఎంచుకుంటారు. అమావాస్య ఆంగ్ల సంవత్సరంలో చివరి అమావాస్య కూడా అవుతుంది. ఈసారి మార్గశిర అమావాస్య సోమవారం వస్తుంది. కనుక ఈ రోజున సోమవతి అమావాస్య అని కూడా పిలుస్తారు. అయితే మార్గశిర అమావాస్య తిథి విషయంలో గందరగోళం నెలకొంది. ఈ అమావాస్య డిసెంబర్ 30న జరుపుకోవాలని కొందరు, 31న అమావాస్య జరుపుకోవాలని మరికొందరు అంటున్నారు. వైదిక క్యాలెండర్ ప్రకారం ఈసారి మార్గశిర మాస కృష్ణ పక్ష అమావాస్య తిథి డిసెంబర్ 30 తెల్లవారుజామున 4.01 గంటలకు ప్రారంభమవుతుంది. అదే సమయంలో ఈ అమావాస్య తిథి మర్నాడు రోజు డిసెంబర్ 31వ తేదీ తెల్లవారుజామున 3.56 గంటలకు ముగుస్తుంది. దీంతో రెండు రోజుల్లో ఏది అన్నదానిపై కొంత వివాదం ఉంది. అయితే సోమవారమే పూర్తిగా ఉంటున్నదున అదే మేలని పండితులు సూచిస్తున్నారు.



# తిరుగులేని నేతగా జనసేనాని

**2024 ఎన్నికలతో సమర్థనాయకుడిగా అవతరణ**
**సమస్యల పరిష్కరంలో చొరవతో ప్రజలకు చేరువ**
**అద్భుత విజయంతో ప్రజానాయకుడిగా పవన్**

అమరావతి :

ఈ యేడాది ఎన్నికల్లో అసలుసిసలు హీరోగా పవన్ కళ్యాణ్ అవతరించయారు. గత ఎన్నికల్లో ఒక్కటంటే ఒక్కసీటు గెలిచిన జనసేన..ఈ యేడాది సార్వత్రిక ఎన్నికల్లో విజృంభించింది. దీంతో పవన్ కళ్యాణ్ తిరుగులేని నేతగా ఎదిగారు. ఓ రకంగా చెప్పాలంటే ఎపిలో బలమైన నేతగా పవన్ అవతరించారు. అలాగే ఆయన డిప్యూటి సిఎంగా ప్రజాసమస్యలపై స్పందిస్తూనే, పరిష్కిరం కోసం చేస్తున్న కృషి ప్రజల్లో నిజమైన నేతగా నిలుపుతోంది. తిరుమల లడ్డూ వ్యవహారంతో హిందువుల్లో బలమైన ప్రశ్నించే నేతగా ఎదిగారు. దీంతో దేశ ప్రజల దృష్టిని కూడా పవన్ కళ్యాణ్ ఆకర్షించారు. పవన్ కళ్యాణ్ మాత్రం సనాతన ధర్మాన్ని రక్షించుకోవల్సిన అవసరం ఉందని, తమ పార్టీ సనాతన ధర్మ పరిరక్షణకు కృషిచేస్తుందని బహిరంగంగా ప్రకటించడంతో పాటు తిరుపతిలో ఓ సభ ఏర్పాటుచేసి డిక్లరేషన్ ప్రకటించారు. దీంతో ఏపీలో సనాతన ధర్మ పరిరక్షణ బ్రాండ్ అంబాసిడర్‌గా పవన్ కళ్యాణ్ గుర్తింపు పొందారు. ఇతర మతాలను గౌరవిస్తూనే సనాతన ధర్మాన్ని పరిరక్షించుకోవల్సిన అవసరాన్ని ధైర్యంగా చెప్పారు. దేశ స్థాయిలో సనాతన ధర్మ పరిరక్షణకు అవసరమైతే తాను నాయకత్వం వహిస్తాననే రీతిలో సందేశం ఇచ్చారు. 2024 సంవత్సరం పవన్‌కు లక్కీ ఇయర్‌గా చెప్పుకోవచ్చు. 2014లో పార్టీ పెట్టినప్పటి నుంచి 2023 వరకు పవన్ కళ్యాణ్ రాజకీయంగా ఎలాంటి విజయాలను చూడలేదు. కానీ 2024లో తాను ఊహించదానికంటే ఎక్కువ విజయాలను అందుకున్నారు. తనతో పాటు జనసేన పార్టీకి 2014 కలిసొచ్చిందనే చెప్పుకోవాలి.మహారాష్ట్ర ఎన్నికలు దేశం దృష్టిని ఆకర్షించాయి. ఇండియా (మహా వికాస్ అఘాడీ), ఎన్డీయే(మహాయుతి) కూటమి మధ్య హోరాహోరీ పోరు నడిచింది. సార్వత్రిక ఎన్నికల్లో ఇండియా కూటమి ఎక్కువ లోక్‌సభ స్థానాలు గెలుచుకోవడంతో శాసనసభ ఎన్నికల్లో ఎవరు గెలుస్తారనే ఉత్కంఠ నెలకొంది. రెండు కూటములు అధికారంపై ధీమా వ్యక్తం చేశాయి. చివరకు ఎన్డీయే కూటమి భారీ విజయం సాధించింది. ముఖ్యంగా గతంలో తెలుగు ఓటర్లు ఎక్కువుగా ఉండే నియోజకవర్గాల్లో కాంగ్రెస్ లేదా ఆ పార్టీ మద్దతు దారులు ఎక్కువుగా గెలుపొందేవారు. ఈసారి పవన్ కళ్యాణ్ తెలుగు ఓటర్లు ఎక్కువ ప్రభావం చూపించే నియోజకవర్గాల్లో మహాయుతి కూటమి అభ్యర్థుల తరపున ప్రచారం నిర్వహించారు. పవన్ కళ్యాణ్ ప్రచారం చేసిన అన్ని నియోజకవర్గాల్లో మహాయుతి కూటమి మంచి ప్రదర్శన కనబర్చింది. దీంతో పవన్ కళ్యాణ్ ఇమేజ్ తెలుగు రాష్ట్రాలను దాటి జాతీయస్థాయికి వెళ్లింది. బిజెపిలో కూడా పవన్ కళ్యాణ్ పట్ల కొంత ఆరాధ్యభావం పెరిగింది. మరోవైపు ఎన్డీయే సమావేశాల్లో పవన్ కళ్యాణ్‌ను ప్రధాని మోదీ ప్రశంసలతో ముంచెత్తడం ఆయన ఇమేజ్‌ను దేశ స్థాయిలో మరింత పెంచింది. మొన్నిటి సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసిన 21 శాసనసభ, రెండు పార్లమెంట్ స్థానాల్లో గెలుపొంది జనసేన వంద శాతం విజయం సాధించింది. ఈ ఎన్నికల తర్వాత జనసేన పార్టీ ఉండదని, పవన్ కళ్యాణ్ రాజకీయాలకు పనికిరారంటూ ఎంతోమంది ఎన్నో విమర్శలు చేసినా ఆయన పట్టించుకోలేదు. మాజీ సిఎం జగన్ అయితే పవన్ కళ్యాణ్ పెళ్లిళ్లపై ఎకసక్కాలు ఆడారు. వరుస విమర్శలు చేశారు. కానీ అవన్నీ వైసిపికే తగిలి ఆ పార్టీ మట్టికొట్టుకు పోయింది. గత దశాబ్ద కాలంలో రాజకీయంగా పవన్ బాగా పరిణతి చెందారు. ఏవిధమైన వ్యూహాలతో ముందుకెళ్లాలో సరిగ్గా అంచనా వేసుకోగలిగారు. అప్పటి అధికారపక్షం వైసీపీ ఎన్ని ఇబ్బందులు పెట్టినా, వ్యక్తిగతంగా టార్గెట్ చేసినా వెనక్కి తగ్గలేదు.. ప్రతి విమర్శకు ధీటైన జవాబుఇస్తూ ముందుకుసాగారు. వారాహి యాత్రతో ప్రజలతో మమేకమయ్యారు. ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలనివ్వబోనన్న మాటపై చివరివరకు నిలబడుతూ.. బీజేపీ, టీడీపీ, జనసేన మధ్య పొత్తు కుదరడంతో పవన్ కళ్యాణ్ కీలక పాత్ర పోషించారు. జనసేనకు సీట్ల కేటాయింపుపై ఎన్నో రకాల విమర్శలు వచ్చినా.. తాను పోటీచేసే అన్ని స్థానాల్లో గెలిచి సత్తా చాటడమే తన ముందున్న కర్తవ్యమంటూ ముందుకెళ్లారు. చివరకు పోటీచేసిన అన్ని స్థానాల్లో గెలిచి చరిత్ర సృష్టించారు. ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఎన్నికల ముందు వరకు జనసేన ఓ రాజకీయపార్టీ.. ఎన్నికల తర్వాత ఆపార్టీ ఓ శక్తిగా మారింది. పవర్ ఉంటే ఏదైనా చేయ్యెచ్చు.. జనసేన లక్ష్యం చేరుకోవాలంటే పవర్ కావాలంటూ పవన్ కళ్యాణ్ పదేపదే వ్యాఖ్యానించే వారు. ఎన్నికల తర్వాత ఏపీ ప్రభుత్వంలో జనసేన భాగస్వామిగా ఉంది. పవన్ కళ్యాణ్ ఉప ముఖ్యమంత్రి బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను పవన్ కళ్యాణ్ మర్చిపోలేదు. అధికారంలో ఉన్నా.. లేకపోయినా తాను ప్రజాసేవకుడినేనంటూ ముందుకు సాగారు. ప్రభుత్వ పరంగా తీసుకునే నిర్ణయాల్లో ఎక్కడా తొందరపాటు చూపించకుండా.. నిదానంగా ముందుకెళ్తూ.. అందుబాటులో ఉన్న వనరులతో ఏ విధంగా అభివృద్ధి చేయగలమో ప్రణాళికలు రచించుకుంటూ ముందుకెళ్తున్నారు. తనకు ఇష్టమైన గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖల బాధ్యతలను నిర్వర్తిస్తూ.. రాష్ట్రంలో తనదైన మార్క్ పాలనను ప్రజలకు చూపించేందుకు పవన్ కళ్యాణ్ ప్రయత్నిస్తున్నారు.



# వైకాపా నేతలకు కళ్లు నెత్తికెక్కాయి

- ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తే గట్టిగా బుద్ధి చెబుతాం
- ఇది వైకాపా రాజ్యం అనుకుంటున్నారా?
- గాలివీడు ఎంపీడీవో జవహర్ బాబుకు పరామర్శ
- దాడి గురించి ఆరా తీసిన డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్





**కడప,డిసెంబర్28(నినాదం న్యూస్):** అహంకారంతో వైకాపా నేతలకు కళ్లు నెత్తికెక్కాయని డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్ ఘాటుగగా హెచ్చరించారు. ఇది కూటమి ప్రభుత్వం.. వైకాపా రాజ్యం అనుకుంటున్నారా.. ఖబడ్దార్. ఇష్టారాజ్యంగా చేయలేరు. మీ అహంకారం ఎలా అణచివేయాలో మాకు తెలుసు. చేసి చూపిస్తాం. అధికారులపై దాడి చేస్తే తోలు తీస్తాం' అని పవన్ కళ్యాణ్ హెచ్చరించారు. కడప రిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గాలివీడు ఎంపీడీవో జవహర్ బాబును డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. బాధితుడికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. అనంతరం పవన్ మీడియాతో మాట్లాడారు. 'గాలివీడు ఎంపీడీవో జవహర్‌బాబును అమానుషంగా కొట్టారు. అధికారులపై దాడి చేయడం వైకాపాకు కొత్త కాదు. ఆధిపత్యం, అహంకారంతో అధికారులపై దాడులు చేస్తే ఎలాంటి శిక్షలు పడతాయో చూపిస్తాం. పులివెందుల నియోజకవర్గంలో ఓ రైతు కుటుంబం ఆత్మహత్యపై పవన్ స్పందించారు. ఆ ఘటన బాధాకరమని.. దీనిపై విచారణ జరుగుతోందని పేర్కొన్నారు. రెండ్రోజుల క్రితం రైతు తన భూమి మ్యుటేషన్ పెట్టుకున్నారని.. ఎలాంటి పరిస్థితుల్లో ఈ ఘటన జరిగిందో నివేదిక వచ్చాక చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.అన్నమయ్య జిల్లా గాలివీడు ఎంపీడీవో జవహర్‌బాబుపై దాడి జరిగిన విషయం తెలిసిందే. ప్రస్తుతం కడప రిమ్స్‌లో చికిత్స పొందుతున్న ఆయన్ని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పరామర్శించి దాడి గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం పవన్ మీడియాతో మాట్లాడుతూ ఈ ఘటనను తీవ్రంగా ఖండించారు. బాధ్యులను వదిలిపెట్టమని హెచ్చరించారు. ఇదిలాఉండగా, పవన్‌ని చూసేందుకు అక్కడికి వచ్చిన పలువురు అభిమానులు అత్యుత్సాహం ప్రదర్శించారు. ఆయన సీరియస్‌గా మీడియాతో మాట్లాడుతున్న సమయంలో 'ఓజీ.. ఓజీ.. ఓజీ' అంటూ స్లోగన్లు చేశారు. దీనిపై ఆయన ఆగ్రహానికి గురయ్యారు. 'ఏంటయ్యా మీరు. ఎప్పుడు ఏ స్లోగన్ ఇవ్వాలో మీకు తెలియదు. పక్కకు రండి' అంటూ తన అసహనాన్ని తెలియజేశారు. పవన్‌కల్యాణ్ ప్రస్తుతం రాజకీయాల్లో ఎంతో బిజీగా ఉన్నారు. వరుస మీటింగ్స్, సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. మరోవైపు, దర్శక - నిర్మాతలకు ఇబ్బందులు కలగకుండా ఇప్పటికే పట్టాలెక్కించిన సినిమాలను పూర్తిచేస్తున్నారు. తన తదుపరి చిత్రాలు 'ఓజీ', 'హరిహర వీరమల్లు' షూట్స్‌లో వీలు కుదిరినప్పుడు పాల్గొంటున్నారు. సుజీత్ దర్శకత్వంలో ఆయన నటిస్తోన్న చిత్రమే 'ఓజీ'. యాక్షన్ థ్రిల్లర్ ఫిల్మ్‌గా ఇది సిద్ధమవుతోంది. ప్రస్తుతం చిత్రీకరణ దశలో ఉంది. డీవీవీ ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై దానయ్య నిర్మిస్తున్నారు.

## టీటీడీ కియోస్క్ మిషన్ల ద్వారా రూ. 55 లక్షలు విరాళం



**తిరుమల, డిసెంబర్28(నినాదం న్యూస్):** టీటీడీ అన్న ప్రసాదం ట్రస్టుకు రూ.1 నుంచి రూ.లక్షలోపు విరాళం ఇవ్వదలచిన భక్తుల కోసం పలు చోట్ల నెలకొల్పిన కియోస్క్ మిషన్ల ద్వారా 50 రోజుల్లో రూ. 55 లక్షల విరాళం వచ్చిందని టీటీడీ అధికారులు తెలిపారు. తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయం, ఒంటిమిట్ట కోదండ రామాలయం, బెంగుళూరులో శ్రీవారి ఆలయాల్లో టీటీడీ ఈ మిషన్లు ఏర్పాటు చేసింది. పేరూరు సమీపంలోని శ్రీ వకుళామాత ఆలయంలో శనివారం ఈ కియోస్క్ మిషన్‌ను టీటీడీ అడిషనల్ ఈవో ప్రారంభించారు. మరో వారం రోజుల్లో విజయవాడ, చెన్నై, హైదరాబాద్ లోని శ్రీవారి ఆలయాల్లో కియోస్క్ మిషన్లను భక్తులకు అందుబాటులో తీసుకురానున్నట్లు వెల్లడించారు. ప్రస్తుతం అన్న ప్రసాదం ట్రస్టుకు మాత్రమే విరాళం ఇచ్చే అవకాశం ఉందని, త్వరలో టీటీడీ ఆలయాల్లోని అన్ని సేవలకు ఈ మిషన్ల ద్వారా నగదు రహిత చెల్లింపు చేసే విధానాన్ని టీటీడీ అందుబాటులోకి తీసుకురానుందని వెల్లడించారు.

## మాజీ మంత్రి పేర్నినాని సంచలన వ్యాఖ్యలు..

- నన్ను, కుమారుడిని అరెస్టు చేయవచ్చని అనుమానం



**అమరావతి, డిసెంబర్28(నినాదం న్యూస్):** గోదాం నుంచి బియ్యం మాయం కేసులో తనను, తన కుమారుడిని జనవరి 2వ తేదీలోగా పోలీసులు అరెస్టు చేయవచ్చని వైసీపీ మాజీ మంత్రి పేర్నినాని సంచలన వ్యాఖ్యలు చేశారు. నా భార్యను అరెస్ట్ చేయడానికి ఓ మంత్రి తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. తాడేపల్లిలోని వైసీపీ కేంద్ర కార్యాలయంలో శనివారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. తన భార్య పేరిట ఉన్న గోదాం నుంచి బియ్యం మాయం కేసులో తనను ఒక్కరోజైనా జైలులో పెట్టాలనే ఆలోచన జిల్లాకు చెందిన మంత్రి ఒకరు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. తన భార్యను కూడా జైలుకు పంపాలని సీఎం చంద్రబాబు దగ్గర ప్రస్తావించినప్పటికీ ఇంట్లోని ఆడవారి జోలికి వెళ్లవద్దని ఆదేశించడం అభినందనీయమని నాని పేర్కొన్నారు. చంద్రబాబు చెప్పినప్పటికీ వారు ప్రయత్నాలు ఆపడం లేదని కొంత మంది ఎమ్మెల్యేలు, అధికారులు ఇందుకు సాక్ష్యమని పేర్కొన్నారు. నా భార్య జయసుధపై కేసు పెట్టిననాటి నుంచి నేటి వరకు తన కుటుంబాన్ని అరెస్టుకు మంత్రి ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. 2వ తేదీన తమ గోదాం మేనేజర్ క్వాష్ పిటిషన్ విచారణ ఉంది. ఆలోగా నన్ను, నా కుమారుడిని పోలీసులు అరెస్టు చేయవచ్చని అనుమానం వ్యక్తం చేశారు. తమ రాజకీయాలు, కక్ష సాధింపు కోసం ఇంట్లోని ఆడవాళ్ల జోలికి రావడం బాధాకరమని ఆయన అన్నారు.

## వైఎస్సార్ జిల్లాలో విషాదం..

- అప్పుల బాధతో రైతు కుటుంబానికి చెందిన నలుగురు ఆత్మహత్య



**అమరావతి, డిసెంబర్28(నినాదం న్యూస్):** వైఎస్సార్ కడప జిల్లాలో విషాదం చోటు చేసుకుంది. జిల్లాలోని సింహాద్రిపురం మండలం దిద్దేకుంట గ్రామంలో ఒకే కుటుంబానికి నలుగురు ఆత్మహత్య చేసుకోవడం కలకలం సృష్టిస్తోంది. అప్పుల బాధతో భార్య, ఇద్దరు పిల్లలతో రైతు నాగేంద్ర ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. మృతుల్లో భర్త నాగేంద్ర, భార్య వాణి, కుమారుడు భార్గవ్, కుమార్తె గాయత్రి ఉన్నారు. గత కొంతకాలంగా నాగేంద్ర సొంత పొలంతో పాటు కౌలుకు భూమి తీసుకుని సాగు చేస్తున్నాడు. రూ. 20 లక్షల అప్పులు తీర్చలేక సొంత పొలంలోనే బలవన్మరణానికి పాల్పడ్డారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## తెలుగు భాషను కాపాడుకుందాం
# ఆత్మాభిమానాన్ని పెంచుకుందాం

- తెలుగు భాష ఔన్నత్యం కోసం కృషి చేద్దాం
- భాషా,సంస్కృతులను పరిరక్షించుకోవాల్సిందే
- ప్రపంచ తెలుగు రచయితల మహాసభలో జస్టిస్ ఎన్వీ రమణ పిలుపు



**విజయవాడ, డిసెంబర్28(నినాదం న్యూస్):** 'తెలుగు భాషను కాపాడుకుందాం. ఆత్మాభిమానాన్ని పెంచుకుందాం అనే నినాదంతో ఐక్యత చాటేందుకు నలుమూలల నుంచి విజయవాడకు తరలివచ్చిన వారందరికీ వందనాలు' అని సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ అన్నారు. విజయవాడలో జరుగుతున్న ప్రపంచ తెలుగు రచయితల ఆరో మహాసభల్లో ఆయన పాల్గొని ప్రసంగించారు.'తెలుగు భాషా, సంస్కృతిని పరిరక్షించుకున్నప్పుడే మనం గొప్పవారమవుతాం. జాతి మనుగడకు, వికాసానికి ధైర్యం కావాలి. భాష లేకపోతే.. ఎన్ని ఉన్నా చరిత్ర లేని అనాథలం, అక్షరం లేని అభాగ్యులం అవుతామన్నారు. విశ్వవ్యాప్తంగా ఉన్న తెలుగువారు మన సంస్కృతి, భాషను మరిచిపోకూడదని.. తెలుగు జాతి కీర్తి ప్రతిష్ఠలు నిత్యం వెలుగొందాలని కోరుకునే వ్యక్తిని నేను. తెలుగు భాషను దేశంలో వంద మిలియన్లకు పైగా మాట్లాడతారు. తెలుగుభాష పలుకుబడి వినసొంపైనది. అది సంగీతంలా ఉంటుంది. సామాన్య ప్రజలు కూడా కవితా ధోరణిలో మాట్లాడగలిగే అందమైన భాష తెలుగు. ఇంత అద్భుతమైన మన తల్లి భాష తెలుగును.. వ్యాపార, రాజకీయ ప్రయోజనాల కోసం వేరే భాష, సంస్కృతి వచ్చి కొల్లగొట్టడాన్ని మనం ఎట్టి పరిస్థితుల్లోనూ సహించరాదన్నారు. మన సంస్కృతి, భాష చిరకాలం నిలిచి ఉండేలా.. శ్రీశ్రీ, ఆరుద్ర, విశ్వనాథ సత్యనారాయణ, సినారెలాంటి గొప్ప కవులు, రచయితలు.. భానుమతి, సూర్యకాంతం, జమున, సావిత్రి, గుమ్మడి, జగ్గయ్య, అక్కినేని, ఎన్టీఆర్, రేలంగి, ఎస్వీఆర్, ఘంటసాల, మంగళంపల్లి బాలమురళీకృష్ణ, ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం ఇలా ఎందరెందరో దిగ్గజాల ఘనమైన వారసత్వం మనది. ఈ వారసత్వం మరవకండి. మీరు గుర్తుంచుకోండి.. మీ పిల్లలకు గుర్తు చేయండి. 'భాష అనేది భావ వ్యక్తీకరణకు ఒక సాధనం. ప్రస్తుత కర్తవ్యం అభివృద్ధితోపాటు.. భాషా సంస్కృతులను మనం రక్షించుకోవాలన్నారు. 'ఎన్టీఆర్ వల్ల తెలుగు భాషకు.. ప్రజలకు గౌరవం పెరిగింది. ప్రభుత్వ అవార్డులకన్నా.. సమాజాన్ని మేల్కొలిపే రచనలే మిన్న. తెలుగును పరిపుష్టం చేసేలా ప్రభుత్వాలు ఆలోచించాలి. పత్రికలు, ఛానళ్లు తెలుగు అభివృద్ధికి పాటుపడాలి. తమిళనాడు తరహాలో మన పాలకులూ భాషాభివృద్ధికి కృషి చేయాలి. తెలుగుకు మద్దతిచ్చేవారికే ఓటు అని ప్రజలతో చెప్పించాలి. అలా చెప్పిస్తేనే.. మాతృభాష అభివృద్ధి, వైభవం దక్కుతుంది' అని జస్టిస్ ఎన్వీ రమణ అన్నారు. 'తెలుగు తల్లి ముద్దుబిడ్డ, మహోన్నత వ్యక్తి, తుది శ్వాస వరకూ తెలుగు భాష, సంప్రదాయాల పరిరక్షణ కోసం పోరాడిన యోధుడు రామోజీరావు సభా వేదిక నుంచి మిమ్మల్నందర్నీ చూస్తుంటే.. యావత్ తెలుగు ప్రపంచం నా ముందు సాక్షాత్కరిస్తోందని అన్నారు. తెలుగు భాష కీర్తి పతాకను ఎగుర వేసేలా సభలు నిర్వహిస్తున్న అందరికీ తెలుగు బిడ్డగా కృతజ్ఞతలు తెలియజేశారు. తెలుగు సాహిత్యం, వైభవం గురించి అనర్గళంగా ఇక్కడ మాట్లాడారన్నారు. తెలుగు జాతి అంటే మదరాసీలు కాదని తెలుగు రాష్ట్రం కోసం పొట్టి శ్రీరాములు ప్రాణాలు విడిచారన్నారు. పురాణాలు, ఇతిహాసాలు దాటి ప్రజల భాషగా తెలుగు భాష మారిందన్నారు. ఒక సంగీతం తరహాలో అందమైన భాష తెలుగు భాష అని కొనియాడారు. వ్యాపార, రాజకీయ ప్రయోజనాలతో తెలుగు భాషను అణగదొక్కారని విమర్శించారు. తగినంత గుర్తింపు కూడా భాషకు దక్కలేదన్నారు. వాడుక భాషలో మనం ఇంకా ప్రజలకు దగ్గర కాలేదని.. తెలుగు భాష వృద్ధిపై మన ప్రభుత్వాలు దృష్టి పెట్టింది లేదన్నారు. కొన్ని దేశాల్లో వారి మాతృభాషలో విద్యాబోధన చేసి అద్భుతాలు సాధించారని వెల్లడించారు. వారి సాంకేతికతను, విజయాలను వారి భాషలోనే రాసుకున్నాయన్నారు. భవిష్యత్తుతరాలకు మాతృభాషపై ఒక గౌరవం కలిగించాయన్నారు. ఆ తరహాలో మన తెలుగు భాషకు ప్రాధాన్యత ఇవ్వలేదన్నారు. 'పర భాషను నేర్చుకోండి... వ్యామోహం పెంచుకోకండి. నా సంస్కృతి నాశనం కాకుండా చూడాలని గాంధీజీ చెప్పేవారు. మాతృభాషలో విద్యను అభ్యసించి చాలా మంది ఉన్నత స్థితికి చేరారు. పెట్టుబడిదారులు ఇంగ్లీషు భాష ఉంటేనే ఉద్యోగాలు అనే పరిస్థితి కల్పించారు. తెలుగు భాషలోచదివి... దేశ విదేశాల్లో రాణిస్తున్న వారు ఎందరో. ప్రజా బాహిళ్యంలో మాతృభాషలోనే అన్ని నిర్ణయాలు ఉండాలి. ప్రభుత్వాలు కూడా తెలుగు భాషలోనే ఆదేశాల కాపీలు ఇచ్చే ఆలోచన చేయాలి. తెలుగు భాష వైభవం వల్లే తెలుగు రాష్ట్రాలకు కీర్తి ఉంటుంది. మన ఆచార, వ్యవహారాలు సక్రమంగా అమలు చేయాలి. అభివృద్ధితో పాటు భాషా సంస్కృతిని అలవాటు చేసుకోవాలి' అని జస్టిస్ ఎన్వీ రమణ వెల్లడించారు. మాతృభాషపై మమకారం ఉన్న వారి వల్లే మన భాషకు గౌరవం దక్కుతుందన్నారు. ఎన్టీఆర్ వంటి వారి వల్ల మన భాషకు, మన తెలుగు వాళ్లకు గౌరవం పెరిగిందన్నారు. మానవ బంధాలతో కూడిన రచనలే కలకాలం ప్రజల్లో నిలుస్తాయని.. కన్యాశుల్కం వంటి రచనలే ఇందుకు ఉదాహరణ అని తెలిపారు. ప్రభుత్వం ఇచ్చే అవార్డులు కన్నా... సమాజాన్ని మేల్కొలిపే రచనలే మిన్న అని తెలిపారు. తెలుగు భాషను పరిపుష్టం చేయాలనే ఆలోచనపై ప్రభుత్వం సానుకులంగా స్పందించాలని కోరారు. పత్రికలు, టీవీ ఛానళ్లు కూడా తెలుగు భాష అభివృద్ధి కోసం పాటుపడాలని.. లేదంటే భవిష్యత్తులో తెలుగు పేపర్లు, ఛానళ్లు చూసే పరిస్థితి ఉండదన్నారు. 'తెలుగువారి శక్తి... తెలుగువాడి నాడి వ్యాపించాలి.. నేను కోరుకునేది అదేనంటూ ముగించారు.

## తెలంగాణ నేతల సిఫార్సులకు నో

- ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదన్న ఇవో



**తిరుమల, డిసెంబర్28(నినాదం న్యూస్):** తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) తెలంగాణ ప్రజాప్రతినిధుల సిఫారసు లేఖలను స్వీకరిస్తున్నట్లు పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతోంది. తెలంగాణ లీడర్ల విజ్ఞప్తి మేరకు సానుకూలంగా స్పందించి వారంలో రెండు రోజులు సిఫారసు లేఖలు స్వీకరించేందుకు టీటీడీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు వార్తలు గుప్పుమన్నాయి. ఈ క్రమంలో తెలంగాణ రాజకీయ నాయకుల సిఫారసు లేఖల స్వీకరణపై టీటీడీ ఈవో శ్యామల రావు కుండబద్దలు కొట్టారు. తెలంగాణ ప్రజా ప్రతినిధుల సిఫారసు లేఖలు స్వీకరిస్తున్నట్లు జరుగుతోన్న ప్రచారాన్ని ఆయన ఖండించారు. తెలంగాణ ప్రజాప్రతినిధుల సిఫారసు లేఖలను స్వీకరిస్తున్నట్లు వస్తున్న వార్తలు నిజం కాదని తెలిపారు. మీడియాలో అలా ప్రచారం జరుగుతోందని.. కానీ తెలంగాణ ప్రజా ప్రతినిధుల సిఫారసు లేఖల స్వీకరణపై ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని ఈవో శ్యామల రావు వివరణ ఇచ్చారు. ప్రముఖ పుణ్యక్షేత్రం తిరుమలలో తెలంగాణ లీడర్ల సిఫారసు లేఖలు స్వీకరించకపోవడంపై రాష్ట్రానికి చెందిన ప్రజాప్రతినిధులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్ టీటీడీ తీరును బహిరంగంగానే తప్పుబట్టారు. తెలంగాణ ప్రజా ప్రతినిధుల సిఫారసు లేఖలు స్వీకరించాలని డిమాండ్ చేశారు. ఈ క్రమంలోనే తెలంగాణ లీడర్ల సిఫారసు లేఖలు స్వీకరించేందుకు టీటీడీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని.. వారంలో రెండు రోజులు సిఫారసు లేఖలపై దర్శనానికి అవకాశం కల్పించినట్లు మీడియాలో పెద్ద ఎత్తున కథనాలు వెలువడ్డాయి. దీంతో అప్రమత్తమైన టీటీడీ ఈవో శ్యామల రావు.. తెలంగాణ ప్రజా ప్రతినిధుల సిఫారసు లేఖల స్వీకరణపై క్లారిటీ ఇచ్చారు. తెలంగాణ లీడర్ల లేఖలపై ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని స్పష్టం చేశారు.

## మెల్‌బోర్న్‌లో విశాఖ కుర్రాడు
# నితీష్‌రెడ్డి సెంచరీ..

- అభినందనలు తెలిపిన మంత్రి నారా లోకేష్



**అమరావతి, డిసెంబర్28(నినాదం న్యూస్):** భారత్, ఆస్ట్రేలియా మధ్య మెల్‌బోర్న్‌లో జరుగుతున్న బాక్సింగ్ డే టెస్ట్ మ్యాచ్‌లో మూడో రోజు సెంచరీ చేసిన విశాఖ కుర్రాడుపై అభినందనలు వ్యక్తమవుతున్నాయి. భారత్ జట్టు మొదటి ఇన్నింగ్‌లో వికెట్లు పడుతున్న సమయంలో ఓపికగా పిచ్‌పై నిలబడి ఫాస్ట్‌బౌలర్లను సైతం ధాటిగా ఎదుర్కొని సెంచరీ చేయడం పట్ల ఏపీ మంత్రి నారా లోకేష్ ట్విటర్ వేదిక ద్వారా అభినందనలు తెలిపారు. మెల్‌బోర్న్‌లో వైజాగ్ అబ్బాయి నితీష్ కుమార్ రెడ్డి సెంచరీ చేయడం గర్వంగా ఉందని అన్నారు. ఆసీస్‌పై ఒత్తిడిలో అద్భుతమైన ధైర్యం, పట్టుదల, సంకల్ప శక్తిని ప్రదర్శించి తొలి సెంచరీని సాధించినందుకు మిమ్మల్ని చూసి గర్విస్తున్నామని పేర్కొన్నారు. తన పోరాటాన్ని ఇలానే కొనసాగించాలని సూచించారు. మీరు చేసే ప్రతి పరుగును చూసి ఆనందిస్తామని 2024 సంవత్సరం ముగింపులో తన బ్యాట్‌తో ఆంధ్రప్రదేశ్ గొప్పతనాన్ని ప్రపంచవ్యాప్తంగా చాటినందుకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. కుమారుడి తొలి సెంచరీని చూసి నితీశ్ తండ్రి భావోద్వేగానికి లోనయ్యారు. సంతోషంతో కన్నీరుపెట్టారు. మూడో రోజు ఆట ముగింపు సమయానికి మొత్తంగా 9 వికెట్లు కోల్పోయి 355 రన్స్ చేసింది. ప్రస్తుతం నితీశ్ (104), సిరాజ్ (2) రన్స్‌తో నాటౌట్‌గా ఉన్నారు. తొలి ఇన్నింగ్స్‌లో భారత్ మరో 116 రన్స్ వెనుకపడి ఉన్నది. పంత్ (28), జడేజా (17) రన్స్ చేశారు. టీమ్ఇండియా తరఫున నితీశ్ 104 రన్స్‌తో టాప్ స్కోరర్‌గా నిలిచారు. ఆస్ట్రేలియా బౌలర్లలో కమిన్స్, బోలాండ్ 3 వికెట్ల చొప్పున తీయగా, నాథన్ 2 వికెట్లు పడగొట్టాడు.

## ఏపీ ప్రయాణికులకు గుడ్‌న్యూస్..

- పండుగకు హైదరాబాద్ నుంచి ప్రత్యేక బస్సులు




**అమరావతి, డిసెంబర్28 (నినాదం న్యూస్):** సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రజలకు ఏపీఎస్ఆర్టీసీ గుడ్‌న్యూస్ తెలిపింది. పండుగకు హైదరాబాద్ నుంచి ఏపీలోని సొంత గ్రామాలకు వెళ్లడానికి ప్రత్యేక బస్సులు నడిపేందుకు చర్యలు చేపట్టింది. రెగ్యులర్‌గా నడిచే సర్వీసులతో పాటు 2,400 బస్సులను అదనంగా ఏర్పాటు చేయనున్నట్లు డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజన్ ఎల్. విజయలక్ష్మి తెలిపారు. ప్రత్యేక బస్సులు జనవరి 9 నుంచి 13వ తేదీ వరకు అందుబాటులో ఉంటాయని వెల్లడించారు. నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి సాధారణ చార్జీలతోనే ఈ బస్సులు బయలుదేరుతాయని తెలిపారు. ప్రయాణికులు ఏపీఎస్ఆర్టీసీ వెబ్‌సైట్ నుంచి లేదా అధీకృత టికెట్ బుకింగ్ ఏజెంట్ల నుంచి ముందస్తుగా బుక్ చేసుకోవచ్చని వివరించారు. ఎంజీబీఎస్‌లో ప్రయాణికులు, బస్సుల రద్దీ దృష్ట్యా జనవరి 10 నుంచి 12 వరకు కర్నూలు, చిత్తూరు, నెల్లూరు. అనంతపురం, మాచర్ల, ఒంగోలు వైపు వెళ్లే రెగ్యులర్, ప్రత్యేక బస్సులను గౌలిగూడ సీబీఎస్ నుంచి నడుపుతారని తెలిపారు.

## గోవిందుడి చెంత
## కొనసాగుతున్న భక్తుల రద్దీ



**తిరుమల, డిసెంబర్28(నినాదం న్యూస్):** తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతుంది. వేంకటేశ్వరస్వామిని దర్శించుకునేందుకు వివిధ ప్రాంతాల నుంచి వస్తున్న భక్తులతో 29 కంపార్టుమెంట్లు నిండిపోయాయి. టోకెన్లు లేని భక్తులకు 20 గంటల్లో స్వామివారి సర్వదర్శనం అవుతుందని టీటీడీ అధికారులు వివరించారు. నిన్న స్వామివారిని 66,715, మంది భక్తులు దర్శించుకోగా 24,503 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. భక్తులు సమర్పించుకున్న కానుకల ద్వారా హుండీకి రూ. 4.06 కోట్లు ఆదాయం వచ్చిందని వెల్లడించారు.

**డిసెంబర్ 30 నుంచి అధ్యయనోత్సవాలు**

తిరుమల శ్రీవారికి ఏడాది పూర్తి నిర్వహించే 450 పై చిలుకు ఉత్సవాలలో 25 రోజుల అత్యంత సుదీర్ఘమైన అధ్యయనోత్సవాలు ఈ ఏడాది డిసెంబరు 30 నుంచి జనవరి 23వ తేదీ వరకు తిరుమల ఆలయంలో ఘనంగా నిర్వహించనున్నారు. ధనుర్మాసంలో వైకుంఠ ఏకాదశికి 11 రోజులు ముందుగా శ్రీవారి సన్నిధిలో దివ్యప్రబంధ పాసుర పారాయణంగా పిలిచే ఈ అధ్యయనోత్సవాలు ప్రారంభమవుతాయి.

# పీహెచ్‌సీ సిబ్బంది అందుబాటులో ఉండాలి


- వైద్య ఆరోగ్య సంచాలకులు రవీందర్ నాయక్



**ఖమ్మం, డిసెంబర్28( నినాదం న్యూస్):** జిల్లాలో ఉన్న పీహెచ్ఈ సిబ్బంది అన్నివేళలా ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా చర్యలు చేపట్టాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య సంచాలకులు రవీందర్ నాయక్ అన్నారు.శనివారం ఖమ్మం జిల్లా లో మామిళ్లగూడెం అర్బన్ హెల్త్ సెంటర్ ను సందర్శించారు. మొదటిగా అర్బన్ హెల్త్ సెంటర్ అన్ని గదులను చూసి, ఫార్మసీలో గల బిన్ కార్డ్స్, స్టాక్ రిజిస్టర్లను పరిశీలించి మందుల వివరాలను, రోజు వారి రోగులకు ఇచ్చే మందుల వివరాలను, ఔషది ద్వారా ఇండెంట్ మరియు రోగులకు సరిపడా మందులను, అవుట్ పేషెంట్ రిజిస్టర్ ప్రకారం బ్యాలెన్స్ చెక్ చేశారు స్టోర్ మైంటైన్ సంతృప్తి వ్యక్తం చేసి, ల్యాబ్ ను పరిశీలించి ఏఏ పరీక్షలు చేస్తున్నారు అడిగి రిజిస్టర్ చెక్ చేశారు. అలాగే టీ హబ్ కు శాంపిల్ పంపిస్తున్నారా అని అడిగారు. రిజిస్టర్లను పరిశీలించి సంతకం చేసి, బెడ్ లను పరిశీలించి పేషెంట్ తో మాట్లాడారు. అనంతరం జిల్లా ప్రోగ్రాం అధికారులు, అర్బన్ హెల్త్ సిబ్బంది తో రివ్యూ మీటింగ్ నిర్వహించి మాట్లాడుతూ, వైద్యాధికారి, స్టాఫ్ నర్స్, ఫార్మాసిస్ట్ ల్యాబ్ టెక్నీషియన్ మరియు డి ఈ ఓ ల విధులు,ఏ విధమైన సేవలు అందిస్తున్నారో అడిగి అవుట్ రిచ్ సెషన్స్ నందు జరిగే సేవలను పరిశీలించి తగు సూచనలు చేశారు. తదనంతరం మాతా శిశు సంక్షేమంలో ఎర్లీ రిజిస్ట్రేషన్, ఏ ఎన్ సి చెకప్, అనేమియా గుర్తింపు తగు సేవలు బర్త్ ప్లాన్ గురించి చేసిన సేవలు ఎప్పటికప్పుడు ఆన్ లైన్ లో అప్డేట్ చేసే విధానం ప్రోగ్రాం అధికారి ని అడిగి అన్ని ఇండికేటర్లలో జిల్లా ను ముందుంచాలని చెప్పారు. అలాగే వ్యాధి నిరోధక టీకాలు కార్యక్రమం, అసంక్రమణ వ్యాధుల కార్యక్రమంలో గల (9)కార్యక్రమాలు గ్రామీణ ప్రాంతాల్లో నిబద్ధత తో అమలు జరిపి ఎప్పటికప్పుడు అప్ డేట్ చేయాలని చెప్పారు. సంక్రమణ వ్యాదుల పట్ల నిబద్ధతతో సేవలు అందించాలని, టీ బి ని అరికట్టడంలో సిబ్బంది నివారణ కార్యక్రమాలు జరిపి, ప్రతి ఇంటికి వెళ్లి అన్ని కార్యక్రమాలపై అవగాహన కల్పించాలని సూచించారు. ప్రతి కార్యక్రమం విజయవంతం కావాలంటే ఇన్ఫర్మేషన్, ఎడ్యుకేషన్, కమ్యూనికేషన్ (ఐ ఈ సి) ఎంతో ముఖ్యమని దీని ద్వారా ప్రజలలోకి ప్రతి కార్యక్రమాన్ని తీసుకొని వెళ్లి అమలు చేస్తే మంచి ఫలితాలు వస్తాయని అభిప్రాయపడ్డారు. అలాగే ప్రతి PHCలో బయో మెడికల్ వేస్టేజ్, శానిటేషన్ కార్యక్రమాలు అమలు చేయాలని,ఆసుపత్రి కాన్పులు పెంచాలని, ఆలోపటికి యాక్ట్ నిబంధనలు పాటించే విదంగా ప్రైవేట్ ఆసుపత్రులు నడపాలని, పేద ప్రజలకు వైద్యం అందేవిదంగా ప్రైవేట్ ఆసుపత్రులు నిబంధనలు ప్రకారం నడపాలని చెప్పారు. ముక్యంగా ఫైర్ సేఫ్టీ విధానాలను అమర్చాలని చెప్పారు. వైద్య ఆరోగ్య శాఖ లో ప్రతి ఉద్యోగి తమకు నిర్దేశించిన పనిని చేయటంలో అలసత్వం ప్రదర్శించారాదనీ వైద్యులు, సిబ్బంది మంచిగా పని చేసి జిల్లాకు, శాఖకు మంచి పేరు తెచ్చి పేద ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బి కళావతి బాయి, ప్రోగ్రాం అధికారులు డాక్టర్ సైదులు, డాక్టర్ చందునాయక్, డాక్టర్ రామారావు, డాక్టర్ వెంకటరమణ, డెమో సాంబశివరెడ్డి, యూపీహెచ్ వైద్యులు డాక్టర్ చైతన్య మరియు సిబ్బంది పాల్గిన్నారు.

## నమ్మిన సిద్ధాంతాల కోసం ప్రాణ త్యాగాలు చేసింది కమ్యూనిస్టు పార్టీలే..

- దేశంలో భూ సంస్కరణలు తెచ్చింది కమ్యూనిస్టులే
- మణుగూరు శతాబ్ది ఉత్సవాల్లో సిపిఐ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు



**మణుగూరు, డిసెంబర్ 28(నినాదం న్యూస్) :** భూమి ఆకాశం మనిషి ఉన్నంతవరకు, నమ్మిన సిద్ధాంతాలకు కట్టుబడిన పార్టీ కమ్యూనిస్టు పార్టీ అని భారత కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు స్పష్టం చేశారు. శనివారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు లో సిపిఐ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ సర్ రెడ్డి పుల్లారెడ్డి అధ్యక్షతన జరిగిన సిపిఐ పార్టీ శతాబ్ది ఉత్సవాల్లో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వంద సంవత్సరాలు పూర్తి చేసుకున్న కమ్యూనిస్టు పార్టీకి పార్టీ కార్యకర్తలకు నాయకులకు ఆయన అభినందనలుతెలియజేశారు. పేదవాడి కోసం భూమి భుక్తి కోసం వందల పోరాటం చేసిన చరిత్ర కమ్యూనిస్టు పార్టీని ఆయన స్పష్టం చేశారు. పేదవాడి కోసం వందేళ్ల చరిత్రలో పోరాటాలు చేసి ఐదు వేల మంది ప్రాణ త్యాగాలు చేసిన పార్టీ కమ్యూనిస్టుదన్నారు. ఈ సమావేశంలో సిపిఐ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు భాగం హేమంతరావు, అయోధ్య చారి, సిపిఐ జిల్లా కార్యదర్శి షాబిల్ పాషా సీనియర్ కమ్యూనిస్టు నాయకులు వృద్ధులు పాకాల పాటి వెంకటేశ్వరరావు దంపతులు ప్రసంగించారు. సమావేశంలో జిల్లా వ్యాప్తంగా నియోజకవర్గ వ్యాప్తంగా కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలు నాయకులు అభిమానులు పెద్ద ఎత్తులో పాల్గొన్నారు.

## రూ.95 లక్షల టాటా ఏఐయూ బీమా చెక్కు పంపిణీ




**ఖమ్మం: డిసెంబర్2( నినాదం న్యూస్):** వైరాకు చెందిన చెరుకుపల్లి సీతయ్య అనే ఓ ప్రైవేటు చిరుద్యోగి అక్టోబర్ నెలలో తన ఇంటి వద్ద ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై.. చనిపోగా అతడి కుటుంబానికి టాటా ఏఐయూ లైఫ్ ఇన్సూరెన్స్ ద్వారా మంజూరైన బీమా చెక్కును ఖమ్మం ఎంపీ రామ సహాయం రఘురాం రెడ్డి అందజేశారు. జెడ్పీ సెంటర్లో గల టాటా ఏఐయూ కార్యాలయానికి ఎంపీ రఘురాం రెడ్డి శనివారం వెళ్లి.. కంపెనీ ఉద్యోగులు, కాంగ్రెస్ జిల్లా నాయకులు కొప్పుల చంద్రశేఖర్ తో కలిసి రూ. 95 లక్షల చెక్కును మృతుడి భార్య చెరుకుపల్లి శైలజకు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి మాట్లాడుతూ..టాటా కంపెనీ వారు ఇంత పెద్ద మొత్తంలో బీమా అందించి..బాధిత కుటుంబానికి అండగా నిలవడం అభినందనీయమని అన్నారు.

**రతన్ టాటాకు ఎంపీ నివాళి..**

ప్రముఖ వ్యాపార దిగ్గజం రతన్ టాటా జయంతి సందర్భంగా..టాటా ఏఐయూ ఆఫీసులో టాటా చిత్రపటానికి ఎంపీ రామసహాయం పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రఘురాం రెడ్డి మాట్లాడుతూ.. టాటా సంస్థ అంటే.. ప్రజలకు ఎనలేని నమ్మకం అని అన్నారు. వ్యాపారం, దాతృత్వంలో సాటి లేరని తెలిపారు. ఈ కార్యక్రమంలో టాటా ఏఐయూ ఉన్నతాధికారి సురభి ముకుంద రామ, కాంగ్రెస్ నాయకులు స్ఫూర్తి ఓం రాధాకృష్ణ, ఇతర అధికారులు, ఉద్యోగులు శ్వేత, వి.వినోద్ కుమార్, దేవరపు రమేష్, ఉప్పలయ్య, వరప్రసాద్, నాగేందర్ రెడ్డి, కే. శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## పోడు భూముల సమస్యలపై ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేత



**ఆళ్లపల్లి, డిసెంబర్ 28, నినాదం న్యూస్ :** ఆళ్లపల్లి మండల కేంద్రంలోని గిరిజన రైతుల పోడు భూముల సమస్యలపై శనివారం మణుగూరు గెస్ట్ హౌస్ నందు పినపాక నియోజకవర్గ శాసనసభ్యులు ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మర్యాదపూర్వకంగా కలిసి పోడు భూముల సమస్య, రైతులు పండించుకునే పంటకు త్రీఫేస్ విద్యుత్ సౌకర్యం కల్పించాలని పలు సమస్యలపై కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు రామ నరసయ్య ఆధ్వర్యంలో వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సుతారి కృష్ణ, నాగేష్, గిరిజన రైతులు తదితరులు పాల్గొన్నారు.

## గుర్తు తెలియని మృతదేహం లభ్యం



**కొల్చారం డిసెంబర్28(నినాదం న్యూస్):** మెదక్ జిల్లా కొల్చారం మండలం పోతాంశెట్టిపల్లి గ్రామ శివారులో గల ఏడుపాయల దేవస్థానం నకు వేళ్ళు దారిలో మొదటి బ్రిడ్జి కింద నీటి మడుగులో ఒక గుర్తు తెలియని మగ వ్యక్తి శవం శనివారం నాడు నీటిపై తేలియాడుతూ కనిపించింది. మృతుడి ఒంటి మీద ఎర్రటి ఆఫ్ బనియన్ ఉండి బ్లు కలర్ ప్యాంట్ కలిగి ఉన్నాడు. అతడి కుడి చేతికి నల్లటి దారం కట్టుకొని ఉన్నాడు. పోతాంశెట్టిపల్లి గ్రామ పంచాయతి సెక్రటరీ అరుంధతి ఫిర్యాదు మేరకు తారసింగ్ కేసు నమోదు చేయనైనది.

# విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించేలా ప్రోత్సహించాలి






- ఎమ్మెల్యే కెపి.వివేకానంద్
- పల్లవి మోడల్ స్కూల్లో ఘనంగా మొదటి వార్షికోత్సవ క్రీడా వేడుకలు

**కుత్బుల్లాపూర్, డిసెంబర్ 28 (నినాదం న్యూస్) :** కుత్బుల్లాపూర్ డివిజన్ పల్లవి మోడల్ స్కూల్ ల్లో నిర్వహించిన మొదటి సంవత్సర వార్షికోత్సవ క్రీడా వేడుకలకు కుత్బుల్లాపూర్ హ్యాట్రిక్ ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులు చదువులో రాణించేందుకు క్రీడలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. క్రీడలతో శరీర దారుఢ్యంతో పాటు మానసిక ధైర్యం పెంపొందుతుందని, విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించే విధంగా పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ప్రోత్సహించాలన్నారు. అంతక ముందు ఎమ్మెల్యే విద్యార్థుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కె.ఎం.గౌరీష్, జగన్, డైరెక్టర్లు విద్యాధర్, గిరిధర్, ప్రిన్సిపల్ ధనలక్ష్మి, నాయకులు కిషోర్ చారి, శ్రీకాంత్, జల్దా లక్ష్మీ నాథ్, సంక్షేమ సంఘం నాయకులు దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

# అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యలు పరిష్కరిస్తా..





- ఎమెల్సీ శంభీపూర్ రాజు

**కుత్బుల్లాపూర్ డిసెంబర్ 28 (నినాదం న్యూస్) :** మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు ను కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని పలువురు ప్రజాప్రతినిధులు, ప్రజలు శంభీపూర్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి సమస్యలు, మౌలిక వసతులు కల్పించాలని కోరారు. వారు సానుకూలంగా స్పందించి సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పరిష్కరించాలని కోరారు. సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ కృషి చేస్తానని ఎమ్మెల్సీ భరోసా ఇచ్చారు.

# లక్షల మందిని ఆత్మ జ్ఞానులుగా మార్చిన పత్రీజీ

- పత్రీజీ ధ్యాన మహాయాగం-3లో బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి
- మనకు శరీరంతో పాటు ఆత్మ కూడా ఉంది
- బ్రహ్మర్షి సుభాష్ పత్రీజీ కూతురు పరిణీత పత్రీ
- మహేశ్వర పిరమిడ్ అభివృద్ధిలో లక్ష్మణరావు ప్రాత గొప్పది
- పిరమిడ్ స్పిరుచ్యువల్ ట్రస్ట్ హైదరాబాద్ చైర్మన్ విజయభాస్కర్ రెడ్డి



**మహేశ్వరం, డిసెంబర్ 28 (నినాదం న్యూస్):** బోధన్ షక్కర్ నగర్ లో పుట్టిన పత్రీజీ అందరిలో ఒకడిగా, మైత్రేయ బుద్ధుడిగా, సామాన్యుడిగా ఉంటూనే లక్షల మందికి ఆత్మ జ్ఞానాన్ని బోధించారని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అన్నారు. ఈ మేరకు కడ్తాల్ కైలాసపురిలో నిర్వహిస్తున్న పత్రీజీ ధ్యాన మహా యాగంలో ఎమ్మెల్యే హాజరై ప్రసంగించారు. యోగా, వేదపఠనం, సంగీత నాధ ధ్యానం కార్యక్రమాలు ధ్యానులను విశేషంగా అలరించాయి. యోగా నిపుణులు వెంకటేశ్ యోగా ఆసనాలు, ప్రాణాయణం, ముద్రలు గురించి వివరించి ధ్యానులకు యోగా, ధ్యానంపై చక్కటి అవగాహన కల్పిస్తున్నారు. అలాగే చైతన్య, మాస్టర్ తేజాలు అధ్భుతంగా వేదపఠనం చేసి ధ్యానులకు చక్కటి వేద జ్ఞానాన్ని అందిస్తున్నారు. మరోవైపు సంగీత నాధ ధ్యానం కార్యక్రమం ధ్యానులను విశేషంగా అలరిస్తుంది. మనకు శరీరంతో పాటు ఆత్మ కూడా ఉందని ధ్యానం చేసి ప్రతి ఒక్కరు అనుభవపూర్వకంగా తెలుసుకోవాలని పత్రీజీ కూతురు పరిణత పత్రీ పేర్కొన్నారు. బ్రహ్మర్షి పత్రీజీ వీడియో సందేశాన్ని అందరికి అర్థమయ్యే విధంగా వివరించారు. పత్రీజీ మధ్యే మార్గం గురించి అనునిత్యం సూచించారని, ఇంట్లోనే గురుకులం ఉండాలని, తల్లిదండ్రులే జ్ఞానవంతులు, సత్యం తెలిసినవారు. అయితే ఆ ఇళ్లు గురుకులంతో సమానమని తెలియజేసారని వివరించారు. సీనియర్ పిరమిడ్ మాస్టర్ లక్ష్మణ్ రావు పాల్గొని తన సందేశాన్ని ఇచ్చారు. ఈ భూమి మీద ఇప్పటివరకు ఏ గురువు కూడా తాను గురువును కాదు అని చెప్పలేదని. ఒక బ్రహ్మర్షి పత్రీజీ మాత్రమే చెప్పారని గుర్తుచేసారు. దైవత్వం, మానవత్వం, రాక్షసత్వం మనలో ఉన్నాయని, హింసాను వీడితే మానవత్వం, ప్రేమతత్వం వల్ల దైవత్వం వస్తుందని చెప్పారు. మనకు ఏదీ ఇస్తే అది తిరుగి వస్తుందని అది ప్రకృతి ధర్మమని తెలియజేసారు. అనంతరం పిరమిడ్ స్పిరుచ్యువల్ ట్రస్ట్ హైదరాబాద్ చైర్మన్ విజయభాస్కర్ రెడ్డి మాట్లాడుతూ కైలాసపురి మహేశ్వర మహా పిరమిడ్ ఇంత అధ్బుతంగా అభివృద్ధి చెందడంలో లక్ష్మణరావుది ముఖ్య ప్రాత వుందని కొనియాడారు. అనంతరం లక్ష్మణ్ రావును ఘనంగా సన్మానించారు. పిఎస్ఎస్ఎం నెల్లూరు జిల్లా ఉపాధ్యక్షులు పెంచలయ్య, నెల్లూరు జిల్లా సీనియర్ పిరమిడ్ మాస్టర్ జేజే.నారాయణ, అనంతపురం జిల్లా సీనియర్ పిరమిడ్ మాస్టర్ రవిశంకర్, పీఎంసీ మేనేజింగ్ డైరెక్టర్ ఆనంద్, ప్రకాశం జిల్లా సీనియర్ పిరమిడ్ మాస్టర్ సునీల్ పాల్గొని తమ సందేశాలు ఇచ్చారు. తమ జిల్లాలో కొనసాగుతున్న ధ్యాన ప్రచారం గురించి, తాము చేస్తున్న కార్యక్రమాలు, చేపట్టబోయే కార్యక్రమాల గురించి వివరించారు. అలాగే తమ ధ్యాన అనుభవాలను తెలియజేసారు. పిఎస్-ఎస్ఎం జిల్లా అధ్యక్షుల కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతోంది. ఈ కార్యక్రమంలో ఆసిపాబాద్ జిల్లా, ములుగు జిల్లా, రంగారెడ్డి జిల్లా, సూర్యాపేట జిల్లాల పిరమిడ్ మాస్టర్లు రాజలింగ్, రఘుపతి, నర్సింగ్ రాజు, సిద్ధపూర్యప్రకాశ్ రావు, వెంకటేశ్వర్లు, పాల్గొని తమ సందేశాలను ఇచ్చారు. తమ జిల్లాలో కొనసాగుతున్న ధ్యాన, జ్ఞాన కార్యక్రమాల గురించి, భవిష్యత్తులో తాము చేపట్టబోయే ప్రాజెక్టుల గురించి తెలియజేసారు. అనంతరం ఈ జిల్లాల పిరమిడ్ మాస్టర్లను నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. ట్రూత్ ఫర్ యూత్ అనే కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతోంది. ఇందులో సీనియర్ పిరమిడ్ మాస్టర్లు, మోటివేషనల్ స్పీకర్లు పాల్గొని తమ సందేశాల ద్వారా యువతలో మంచి స్ఫూర్తిని కలిగిస్తున్నారు. సీనియర్ పిరమిడ్ మాస్టర్ వేణుగోపాల్ రెడ్డి పాల్గొని ప్రసంగించారు. యువకులు మూస పద్ధతిలో వెళుతున్నారని అన్నారు. ధ్యానం ద్వారా మనకు దేంట్లో టాలెంట్ ఉందో, ఎందులో ఇష్టం ఉందో తెలుస్తుందని తెలిపారు. అనంతరం సృజన వేణుగోపాల్ రెడ్డి తన ధ్యాన అనుభవాలను వివరించారు. అ తర్వాత మోటివేషనల్ స్పీకర్ వివేక్ చంద్ర, మ్యానిఫెస్టేషన్, ఆలోచనలు, కొత్త సంవత్సరంలో పెట్టుకోవాల్సిన లక్ష్యాల గురించి అధ్బుతంగా వివరించి ధ్యానులు, యువకుల్లో చక్కని స్ఫూర్తిని నింపారు. సీనియర్ మాస్టర్స్, గ్లోబల్ మాస్టర్స్ పాల్గొని అధ్బుతమైన సందేశాలను ఇస్తున్నారు. పిఎస్ఎస్ఎస్ఎ అకాడమీకి చెందిన శివరామప్ప పాల్గొని ప్రసంగించారు. బ్రహ్మర్షి పత్రీజీ చిన్న చిన్న మాటలతో అధ్బుతమైన సందేశాన్ని అందించారని తెలిపారు. మనమంత దివ్వస్వరూపాలమని, ఆత్మ స్వరూపాలమని తెలియజేసారు. ఇప్పుడు మానవులకు కావాల్సింది భౌతిక సంపద కాదని ఆధ్యాత్మిక సంపద కావాలని సూచించారు. విద్యావ్యవస్థను సంస్కరించాల్సిన అవసరం ఉందని తెలిపారు. అనంతరం పిఎస్ఎస్ఎస్ఎ అకాడమీ ద్వారా వెలుబడిన ఆధ్మాత్మిక పుస్తకాలను పరిణిత పత్రీ, శివరామప్ప ఆవిష్కరించారు.


## కాలానుగుణంగా క్రికెట్ క్రీడల్లో నైపుణ్యం సాధించాలి

- వివిఎం బాక్స్ క్రికెట్ ప్రారంభించిన మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్



**కుత్బుల్లాపూర్, డిసెంబర్ 28 (నినాదం న్యూస్):** కుత్బుల్లాపూర్ నియోజవర్గం కూన కృష్ణా మహాలక్ష్మి నగర్, మెట్కాన్ గూడలో వివిఎం బాక్స్ క్రికెట్ మైదానం ను మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం అక్కడున్న యువకులతో మాట్లాడుతూ క్రీడల వల్ల యువకుల శరీరానికి వ్యాయామం, శారీరక దారుఢ్యం మానసికోలాసం కలుగుతుందన్నారు. ప్రతి ఒక్కరు ఇలాంటి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన వివరించారు.ఈ కార్యక్రమంలో యువజన నాయకుడు బుచ్చిరెడ్డి, నిర్వాహకులు వెంకటేష్, యాదయ్య, ఆంజనేయులు, శ్రీనివాస్,నాగరాజు, శ్రీధర్,రఘుపతి రెడ్డి, రాధాకృష్ణ, ధనిష్, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

## క్రిస్మస్ విందుకు హాజరుకావాలని ప్రతాప్‌కు ఆహ్వానం



**కుత్బుల్లాపూర్, డిసెంబర్ 28 (నినాదం న్యూస్):** కుత్బుల్లాపూర్ నియోజక వర్గం, 132 జీడిమెట్ల డివిజన్ చర్చి పాస్టర్లు క్రిస్మస్ పండుగ సందర్భంగా, రంగారెడ్డి జిల్లా మాజీ డిసిసి అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కె.యం.ప్రతాప్‌ను తన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. క్రిస్మస్ విందుకు ముఖ్యఅతిథిగా హాజరుకావాలని కేఎం ప్రతాప్ ను ప్రత్యేకంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం క్రిస్టియన్ సోదర సోదరీమణులందరు కలిసి ఐక్యంగా ఒకే చోట కలయికగా ఉండాలనే ఆకాంక్షతో, వారికి విందును ఏర్పాటు చేసుకోవడానికి సహాయ సహకారాలను అందిస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ సంకల్పానికి అనుగుణంగా క్రిస్టియన్ సోదర సోదరీమణులందరూ కుత్బుల్లాపూర్ గ్రామంలోని యెహోవా నిస్సి చర్చ్ కు, శనివారం రాత్రి 7 గంటలకు విచ్చేసి, క్రిస్మస్ విందులో పాల్గొనాలన్నారు. ఈ కార్యక్రమంలో 132 జీడిమెట్ల డివిజన్ పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షులు స్వీత్ బాబు,ఉపాధ్యక్షులు మార్క్, ప్రధాన కార్యదర్శి సత్యానందం, సంయుక్త కార్యదర్శి పాల్,కోశాధికారి జాన్, ఎగ్జిక్యూటివ్ నెంబర్లు రాంబాబు, చార్లెస్ తదితరులు పాల్గొన్నారు.

## కొత్తకొండ జాతర పనులను పరిశీలించిన ఆర్‌జేసీ



**భీమదేవరపల్లి, డిసెంబర్ 28 (నినాదం న్యూస్):** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం లోని కొత్తకొండ.శ్రీ వీరభద్ర స్వామి దేవస్థానం లో శనివారం దేవాదాయ ధర్మాదాయ శాఖ రీజినల్ జాయింట్ కమిషనర్ రామకృష్ణారావు వీరభద్ర స్వామి సమేత భద్రకాళి దేవి దర్శన అనంతరం దేవాలయం చుట్టూ జాతర పనులు పరిశీలించారు. జాతర పనులను గురించి ఈవోను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ తండ్రి జ్ఞాపకార్థం స్వంత నిధులతో నిర్మిస్తున్న ధ్యాన మండప నిర్మాణాన్ని చూసి కొనియాడడం జరిగినది. రీజినల్ జాయింట్ కమిషన్ వెంట ఆలయ అర్చకులు సిబ్బంది శ్రీ వీరభద్ర స్వామి కార్యనిర్వానాధికారి పి కిషన్ రావు దగ్గరఉండి దేవాలయ చుట్టూ అభివృద్ధి పనులు గుట్ట పైకి మెట్ల పనులను మంత్రి చేపట్టడం జరిగినదని రీజినల్ జాయింట్ కమిషనర్ రామకృష్ణారావుకి ఈఓ చెప్పారు.

## సావిత్రీబాయిపూలే జయంతి వేడుకలకు ఆహ్వానం



**ములుగు ప్రతినిధి,(నినాదం న్యూస్):** సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా జనవరి 03న పరకాల పట్టణంలోని ఎంఎన్ రావు ఫంక్షన్ హాల్‌లో నిర్వహిస్తున్నసావిత్రిబాయి జయంతి వేడుకలకు హాజరు కావాలంటూ ప్రజా సంఘాల జేఏసీ చైర్మన్ ముంజల బిక్షపతి గౌడ్‌కు స్వేరో ఉమెన్స్ స్టేట్ వైస్ ప్రెసిడెంట్ అమ్మ ఒడి సుభద్ర శ్యామల, అమ్మ ఒడి ఫౌండర్ చైర్మన్ శ్రీనివాస్, జంపన్నచారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఫౌండర్ భూక్య జంపన్నలు ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల జేఏసీ చైర్మన్ ముంజల బిక్షపతి గౌడ్ మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే విగ్రహాన్ని ములుగు జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేస్తామని తెలిపారు. జనవరి 06న సావిత్రిబాయి విగ్రహ ప్రతిష్టాపన కమిటీని జిల్లా కేంద్రంలోని రిటైర్డ్ ఉద్యోగుల భవనంలో ఏర్పాటు చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు.

## విద్యార్థినులకు సైకిళ్ళు పంపిణీ



**నూతనకల్ డిసెంబర్ 28(నినాదం న్యూస్):** సుదూర ప్రాంతాల నుంచి నడుచుకుంటూ వచ్చి విద్యా నభ్య సిస్తున్న బాలికా విద్యను ప్రోత్సహించేందుకు విశేష కృషి చేస్తున్నట్లు రోటరీ క్లబ్ గవర్నర్ శ్రీరామ్ ప్రసాద్ ఆధ్వర్యంలో 60 మంది విద్యార్థులకు నూత నకల్ హై స్కూల్లో మూడు లక్ష ల విలువగల ఉచితంగా సైకిల్ పంపిణీ చేశారు. తుంగతుర్తి మార్కెట్ కమిటీ చైర్మన్ గిరిధర్ రెడ్డి మాట్లాడుతూ సైకిళ్లు తీసుకున్న విద్యార్దినిలు సకాలంలో స్కూలుకు వచ్చి బాగా విద్యానభ్యసించి ఉత్తమ ఫలితాలతో ఉత్తీర్ణత సాధించి చదువుకున్న పాఠశాలకు తల్లిదండ్రులకు పేరు ప్రఖ్యాతులు తేవాలన్నారు. ఈనాటి కార్యక్రమంలో మండల విద్యాధికారి రాములు నాయక్, పవన్ రెడ్డి, రోటరీ క్లబ్ చైర్మన్ కోటిరెడ్డి ,సంజీవరెడ్డి, క్లబ్ సభ్యులు, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు, ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## జయశంకర్ పార్కులో మెరుగైన సౌకర్యాలు కల్పించాలి

### -పాడైన పాత వస్తువుల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలి

### -జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ




**భూపాలపల్లి, డిసెంబర్ 28 (నినాదం న్యూస్):** జయశంకర్ ఉద్యానవనం (పార్కు)లో మెరుగైన సౌక ర్యాలు కల్పించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. శనివారం భూపాలపల్లి మున్సి పాలిటీ పరిధి సుభాష్ కాలనీ లోని ఆచార్య జయశంకర్ ఉద్యాన వనాన్ని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ పరిశీలించారు. ఉద్యానవనంలోని ఓపెన్ జిమ్, పిల్లలు ఆటలు ఆడుకోవడానికి ఏర్పాటు చేసిన ఆట వస్తువులను పరిశీలించారు. పిల్లల ఆటవస్తువులు శిధిలావస్థకు చేరుకున్నాయని వాటి స్థానంలో కొత్త ఆటవస్తువులు ఏర్పాటు చేయాలని అధికారులను సూచించారు. ఓపెన్ జిమ్ ప్రాంగణంలో వేసిన రబ్బరు టైల్స్ పాడైపోయాయని వాటిని మార్చాలని, ఓపెన్ జిమ్ పరికరాలను మరమ్మత్తులు చేయించాలని మున్సిపల్ అధికారులకు సూచించారు. ఉద్యానవనంలో మొక్కల పెంపకాన్ని పరిశీలించిన కలెక్టర్ నిర్వహణ బావుందని సంతృప్తి వ్యక్తం చేశారు. జయశంకర్ ఉద్యానవనం అభివృద్ధికి కావలసిన ప్రతిపాదనలు రూపొందించాలని మున్సిపల్ అధికారులను అదేశించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయ లక్ష్మి, మున్సిపల్ కమిషనర్ రాజేశ్వర్, పట్టణ ప్లానింగ్ అధికారి సునీల్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాపాలనపై కళాకారుల ప్రదర్శన



**ములుగు ప్రతినిధి, (నినాదం న్యూస్):** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఆరు గ్యారంటీ పథకాలపై ప్రజల్లో చైతన్యం కల్పిస్తూ నిర్వహిస్తున్న ప్రజా పాలనలో భాగంగా జిల్లా కలెక్టర్ ఆదేశాలు మేరకు ములుగు సమాచార పౌర సంబంధాల శాఖ అధికారి పర్యవేక్షణలో తెలంగాణ సాంస్కృతిక సారధి బోడ కిషన్ కళా బృందం శనివారం ములుగు మండలం జాకారం, గ్రామంలో కళాయాత్ర నిర్వహించారు. ఒక్కొక్క పథకాన్ని వివరిస్తూ ఆటపాటలతో చైతన్యం కల్పించారు. ప్రజలు మూఢ నమ్మకాలను నమ్మొద్దని పరిసరాల పరిశుభ్రత వ్యక్తిగత పరిశుభ్రత పాటించి ఆరోగ్యం కాపాడుకోవాలని పాటల ద్వారా వివరించారు. ప్రభుత్వ పథకాలపై అవగాహన కలిగి సద్వినియోగపరుచుకోవాలనే ఉద్దేశంతో ప్రజాపాలన కళాజాత నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాకారులు రహీమొద్దీన్, మార్త రవి, రాగుల శంకర్ రేలా విజయ్, రెల కుమార్, అమ్మ పాట తిరుపతి, గోల్కొండ బుచ్చయ్య, నరేష్, రామంచి సురేష్, ఈర్ల సాగర్ కనకం రాజేందర్, భాస్కర్, దీపక్, రాము శ్రీలత, శోభ తదితరులు పాల్గొన్నారు.

## గోల్డ్ మెడల్ సాధించిన స్థంభంపల్లి విద్యార్థి



**మహాముత్తారం, డిసెంబర్ 28(నినాదం న్యూస్):** జయశంకర్ భూపాలపల్లి జీల్లా మహాముత్తారం మండలం స్థంభంపల్లి(పీ.పీ) గ్రామానికి చెందిన పసుల శ్రీకాంత్ డిసెంబర్ 16, 17న జరిగిన అథ్లెటిక్స్ లాంగ్ జంప్ మెన్ -విభాగంలో గోల్డ్ మెడల్ సాధించి కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్ చేతుల మీదుగా మెమంటో అందుకు న్నారు. పల్లెల నుంచి ప్రపంచ స్థాయి విజేతల కోసం సీఎం కప్ ను టోర్నమెంట్‌లో బాగంగా డిసెంబర్ 30 నుండీ జనవరి01 వరకు వరంగల్ జిల్లా జేఎస్ఎస్ క్రీడా మైదానంలో జరిగే రాష్ట్రస్థాయి క్రీడాల్లో శ్రీకాంత్ పాల్గొంటున్నట్లు జిల్లా క్రీడల అధికారి చిర్ర రఘు తెలిపారు. కోచ్ నాగరాజు, పీఈటీ ప్రభాకర్, స్థంభంపల్లి కార్యదర్శి బంటు సమ్మరాజు, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు రవి నాయక్ శ్రీకాంత్‌ను అభినందిస్తూ రాష్టస్థాయిలో మెడల్స్ సాధించాలని ఆకాంక్షించారు.

## పని ప్రదేశాలలో మహిళా కార్మికులకు మెరుగైన వసతులు కల్పించాలి

### -భూపాలపల్లి సింగరేణి ఏరియా జిఎం రాజేశ్వర్ రెడ్డి



**భూపాలపల్లి, డిసెంబర్ 28 (నినాదం న్యూస్):** సింగరేణిలో విధులు నిర్వహించే మహిళా కార్మికులకు ఆయా గనుల పని ప్రదేశాల వద్ద మెరుగైన వసతులు కల్పించాలని భూపాలపల్లి ఏరియా సింగరేణి జనరల్ మేనేజర్ ఏనుగు రాజేశ్వర్ రెడ్డి అన్నారు. శనివారం ఏరియాలోని గనులలో జిఎం కమిటీ పర్యటించి పని ప్రదేశాలలో మహిళలకు కల్పించబడ్డ సదుపాయాలు, సౌకర్యాల గూర్చి అడిగి తెలుసుకున్నారు. మహిళా ఉద్యోగులకు కల్పించబడ్డ టాయిలెట్లు, రెస్ట్ షెల్టర్ మొదలగు సదుపాయాల గూర్చి ఆరా తీశారు. ప్రస్తుతం కేటికే 5వ గనిలో 30 మంది మహిళా ఉద్యోగులు పనిచేస్తున్నారని, అందులో ఆరుగురు మహిళలు మేనేజ్మెంట్ ట్రైనీ ఆధికారులుగా సేవలు అందించటం జరుతుందని అన్నారు. మున్ముందు కూడా ఇంకా మహిళల సంఖ్య పెరిగే అవకాశం ఉన్న దృష్ట్యా మహిళల కోసం పెర్మనెంట్ గా చేపట్టాల్సిన రెస్ట్ షెల్టర్, వాష్ రూమ్స్ తదితర సదుపాయాల గూర్చి ఏరియా జనరల్ మేనేజర్ కు రిపోర్ట్ రూపం లో అందచేయాలని అధికారులను ఆదేశించారు.

# వాణిజ్య పంటల ఎగుమతికి ప్రణాళికలు రూపొందించాలి



**భూపాలపల్లి, డిసెంబర్ 28 (నినాదం న్యూస్):** టస్సార్, పత్తి, మిర్చి వంటి వాణిజ్య పంటలను ఎగుమతి చేసేందుకు జిల్లా స్థాయి కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. శనివారం ఐడిఓసి కార్యాలయంలో జిల్లా పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి ఎగుమతి ప్రోత్సాహక కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా నుండి టస్సార్, పత్తి, మిర్చిలకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఎగుమతి చేసేందుకు జిల్లా స్థాయి వెబ్సైట్ రూపొందించాలని తెలిపారు. రైతుల పారిశ్రామికాభివృద్ధికి, ఉపాధి, గ్రామీణ వ్యవసాయ ఉత్పత్తులను గుర్తించడానికి, వ్యాపారాలు నిర్వహణకు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించాలని ఆయన తెలిపారు. ఉత్పత్తులను ఎగుమతి చేయడానికి గల అడ్డంకులను గుర్తించి అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. జిల్లానుండి ఉత్పత్తుల ఎగుమతుల అభివృద్ధికి అవసరమైన కార్యాచరణ చర్యలు చేపట్టాలని సూచించారు. అటువంటి ఉత్పత్తుల యొక్క బేస్ లైన్ డేటాను రూపొందించాలని స్పష్టం చేశారు. ఉత్పత్తి నాణ్యత, నైపుణ్యాభివృద్ధిని మెరుగుపరచడానికి ఉత్పత్తిదారులను ప్రోత్సహించడానికి ఈ కార్యక్రమం ఎంతగానో దోహద పడుతుందని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలను అనుసంధానం చేస్తూ రైతులు సద్వినియోగం చేసుకునే విదంగా అవగహన కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. ఈ సమావేశానికి వర్చువల్ ద్వారా హైదరాబాద్ నుండి డైరెక్టర్ జనరల్ ఫారెన్ ట్రేడ్ ప్రతినిధి శైలజ, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, పరిశ్రమల శాఖ జిఎం సిద్దార్థ, నాబార్డు డీడీఎం రవి కుమార్, వ్యవసాయ అధికారి విజయ భాస్కర్, ఉద్యానవన శాఖాధికారి వెంకటేశం, సెరికల్చర్ అధికారి సమ్మయ్య, ఖాదీ గ్రామీణాభివృద్ధి శాఖ ఏడి రాఘవరావు, జిన్నింగ్ మిల్లు, రైస్ మిల్లర్ల, టస్సార్ కో ఆపరేటివ్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు. అంగన్వాడి కేంద్రాల మరమ్మతు పనులు త్వరగా పూర్తి చేయాలి అంగన్వాడీ కేంద్రాల మరమ్మతులు, రంగులు, మంచినీరు, మరుగుదొడ్డి సౌకర్యాలు కల్పన పనులను త్వరిత గతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ పంచాయతి రాజ్, టిజిఈడబ్ల్యూఐడిసి ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. శనివారం ఐడిఓసి కార్యాలయంలో మహిళా శిశు సంక్షేమ, పంచా యతి రాజ్, టిజి ఈడబ్ల్యూఐడిసి ఇంజినీరింగ్ అధికారులతో పనుల పురోగతిపై సమీక్ష సమా వేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ 10 కేంద్రాలు అప్ గ్రేడ్, 50 కేంద్రాల్లో మంచినీరు, 64 కేంద్రాల్లో మరుగుదొడ్లు, 64 కేంద్రాలకు రంగులు వేయు పనులు చేపట్టినట్లు తెలిపారు. అట్టి పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, సంక్షేమ అధికారి చిన్నయ్య, పీఆర్, టిజిఈడబ్ల్యూ ఐడిసి ఇంజినీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## 2022-23 రబీ ధాన్యం వేలం ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలి

- 2023-24 రవి రైస్ కష్టమ్ మిల్లింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలి
- జిల్లా అడిషనల్ కలెక్టర్ అశోక్ కుమార్



**భూపాలపల్లి, డిసెంబర్ 28 (నినాదం న్యూస్):** 2022-23 రవి ధాన్యం వేలం పనులను త్వరగా పూర్తిచేసి, 2023-24 రబీ రైస్ కష్టమ్ మిల్లింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా అడిషనల్ కలెక్టర్ అశోక్ కుమార్ అధికారులను ఆదేశించారు రబీ ధాన్యం వేలం, రబీ కస్టమ్ మిల్లింగ్ రైస్ పై అదనపు కలెక్టర్ అశోక్ కుమార్ శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రబీ 2022-23లో వేలం వేసిన ధాన్యాన్ని 2024 డిసెంబర్ 31లోగా పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే, రబీ 2023-24 కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) ప్రక్రియను వేగవంతం చేయాలని మిల్లర్లకు సూచించారు. ప్రభుత్వ నిబంధనలు, సమయ పరిమితులను పాటిస్తూ అన్ని ప్రక్రియలను సకాలంలో పూర్తి చేయాలని ఆయన స్పష్టం చేశారు. రైస్ మిల్లర్లు తగిన చర్యలు తీసుకోవాలని, నిబంధనలను కచ్చితంగా పాటించాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా పౌర సరఫరాల అధికారి శ్రీనాథ్, డిఎం రాములు, రైస్ మిల్లర్లు తదితరులు పాల్గొన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించిన అడిషనల్ కలెక్టర్‌లి వెలిషాలపల్లి, భాస్కర్‌గడ్డ దాన్యం కొనుగోలు కేంద్రాలను శనివారం అడిషనల్ కలెక్టర్ అశోక్ కుమార్ పరిశీలించారు. కేంద్రాల్లో రైతుల నుంచి ధాన్యం కొనుగోలు ప్రక్రియను సమీక్షించి, సౌకర్యాలను పరిశీలించిరైతులతో ముఖాముఖి అయ్యారు. రైతుల సమస్యలను తెలుసుకొని వాటి పరిష్కారానికి తగిన సూచనలు చేశారు. ధాన్యం. మిల్లులకు రవాణా చేయడానికి తక్షణ చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో తూకం, ప్యాకింగ్ వంటి కార్యకలాపాలు సజావుగా జరుగుతున్నాయా లేదా అని రైతులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. రైతులకు మరింత సులభతరంగా, పారదర్శకంగా సేవలందించడానికి అధికారులు కృషి చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల అధికారి శ్రీనాథ్, సహకార అధికారి వాలియా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి



**చింతపల్లి, డిసెంబర్ 28 (నినాదం న్యూస్) :** మండలంలోని మదనాపురం స్టేజి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్సై బీనమోని యాదయ్య తెలిపిన వివరాలు ప్రకారం, కర్మన్ ఘాటు ప్రాంతానికి చెందిన నీలకంటి చరణ్ వృత్తిరీత్యా కారు డ్రైవర్ గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అతను నడుపుతున్న కారు యజమాని నక్క రాజు స్నేహితులైన వనం కార్తికేయ, నల్ల వినయ్ కుమార్, ఏ. చరణ్, సమడం దీపక్ లనుకారులో ఎక్కించుకొని హైదరాబాదు నుండి వైజాగ్ కాలనీ టూర్కు తీసుకొని పోయి తిరిగి వైజాగ్ కాలనీ నుండి హైదరాబాద్ కు వస్తుండగా, శుక్రవారం రాత్రి 11.00 గంటల ప్రాంతంలో హైదరాబాద్ - నాగార్జున సాగర్ రాష్ట్ర రహదారి పైన మదనాపురం గ్రామ సమీపం చేరుకోగానే కారులో పెట్రోల్ అయిపోవడాన్ని గమనించి, కారును రోడ్డుకు దూరంగా పార్కింగ్ చేయాలన్న ఉద్దేశంతో అతడు కారు ఇండికేటర్స్ వేసుకొని కారును నియంత్రిస్తుండగా కారు వెనుక భాగం నుంచి కార్తికేయ, చరణ్, దీపక్ లు కారును నెట్టుతుండగా , అదే సమయంలో కొండమల్లేపల్లి మండలం , బాపూజీ నగర్ కు చెందిన దుంప రాములు అశోక్ లీలాండ్ వాహనంతో కారు వెనుక భాగం నుంచి ఢీకొట్టడంతో కారును నెట్టుతున్న వనం కార్తికేయ (17) అక్కడికక్కడే మృతి చెందాడు. చరణ్ , దీపక్ లకు కూడా బలమైన గాయాలు కావడంతో వారిని చికిత్స కోసం మాల్ లోని లైఫ్ స్టార్ ఆస్పత్రి లో చేర్పించారు. కారు డ్రైవర్ నీలకంటి చరణ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## ఏకో సెన్సిటివ్ జోన్ ప్రకటనపై చర్యలు తెలుపాలే



**ములుగు ప్రతినిధి, (నినాదం న్యూస్):** కేంద్ర ప్రభుత్వం 27 జూలై 2015న ములుగు జిల్లాలోని ఏటూరునాగారం అభయారణ్యంను 'సున్నిత జీవావరణ ప్రాంతంగా ప్రకటించడానికి డ్రాఫ్ట్ నోటిఫికేషన్ జారీచేస్తే ఇప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వ అధికారులు తీసుకున్న చర్యలను వెంటనే తెలుపాలని వృక్షశాస్త్రవేత్త, కేన్ మ్యాన్ అఫ్ తెలంగాణ డా. సుతారి సతీష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 806.15 చ.కి.మీ. విస్తీర్ణంలో ఉన్న అభయారణ్యంలోని జీవవైవిధ్యాన్ని పరిరక్షించడానికి 10 కి.మీ. ల విస్తీర్ణంలో సుమారు 1282 చ.కి.మీటర్ల విస్తీర్ణంలో 7 మండలాలు ఉన్నాయన్నారు. ఏటూరునాగారం, తాడ్వాయి, మంగపేట, గోవిందరావుపేట, మహాముత్తారం, భూపాలపల్లి, చింతకానిలోని సుమారు 80 గ్రామాల కల ఈ ప్రాంతాన్నిసున్నిత జీవావరణ ప్రాంతం గా ప్రకటించడానికి ప్రతిపాదనలు పంపించిందని వివరించారు. అయితే ప్రతిపాదనలు పంపి దశాబ్ద కాలం దాటినా ఇప్పటికీ కేంద్ర ప్రభుత్వ ప్రతిపాదనలకు అధికారులు చర్యలు చేపట్టకపోవడానికి కారణమేమిటని ఆయన ప్రశ్నించారు. ఏటూరునాగారం అభయారణ్యంలో లభించే అతి అరుదైన 16 జాతుల మొక్కలు, 18 జాతుల జంతువులతో పాటు ఇతరత్రా జీవవైవిధ్యాన్నిపరిరక్షించడమే ధ్యేయంగా 'సున్నిత జీవావరణ ప్రాంతం' గా ప్రకటించడానికి కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదనలు పంపిస్తే అధికారులు పది సంవత్సరాలు ఎలాంటి చర్యలు విచారకరం అన్నారు. ఏటూరునాగారం వన్యప్రాణి అభయారణ్యం పరిసర ప్రాంతాల్లో ఉన్న విశిష్టమైన జీవవైవిధ్యాన్ని కాపాడేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని కేంద్ర ప్రభుత్వ పర్యావరణ మంత్రిత్వ శాఖ 2015 లోనే నోటిఫికేషన్ జారిచేసిందని తెలిపారు. ప్రమాదంలో ఉన్న పలు వన్యప్రాణులను, వృక్షజాతులను కాపాడేందుకు గట్టిచర్యలను సూచించిందని, అయినా పది సంవత్సరాలు ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వ అధికారులు నిమ్మకు నీరెత్తనట్టు స్పందించకపోవడం శోచనీయమని, రాష్ట్ర ఎకో టూరిజం రంగంలో ప్రకృతి పర్యాటకంలో ములుగు అగ్రస్థానంలో ఉందనే విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ఈ ప్రాంతంలోని సహజ సంపద, జీవవైవిధ్య జాతులుతో పాటు మానవ నిర్మిత హెరిటేజ్ సంపదను సమగ్రంగా పరిశీలించి, వాటిని గుర్తించటంతో పాటు వాటి రక్షణకు తగిన చర్యలను సూచిస్తూ 'జోనల్ మాస్టర్ ప్లాన్' రూపొందించాలని కేంద్ర ప్రభుత్వ పర్యావరణ అటవీ క్లైమెట్ చేంజ్ శాఖ సూచించినట్లు ఆయన తెలిపారు. ఈ జోనల్ ప్లాన్ జాప్యం చేయకుండా తయారు చేసి ఉంటే ఈ ప్రాంతంలో సహజ సంపద ఎంతగానో కాపాడ గలిగేవారిమన్నారు, వాటి పైన అధారపడిన ప్రజలకు జీవనోపాది ఏర్పడేదన్నారు. జిల్లా కలెక్టర్ చైర్మన్ గా ఏడుగురితో కూడిన మానిటరింగ్ కమిటీని ఏర్పాటు చేసి, పూర్తి అధ్యయనం చేసి 'జోనల్ మాస్టర్ ప్లాన్ కి కార్యాచరణ పంపాలని తెలిపినా అధికారులు, ప్రభుత్వం పెడచెవిన పెడుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన సున్నిత జీవావరణ ప్రాంతంలో మైనింగ్, క్వారీలు, ఇసుక తవ్వకాలు, పరిశ్రమల ఏర్పాటు, కలప వ్యాపారం మొదలైనవి పూర్తిగా నిషేదమని, అంతేగాక ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలైనా రోడ్ల వెడల్పు, కరెంటు మిగతా వైర్ల ఏర్పాటు, అటవీ ఉత్పత్తుల సేకరణ, ప్రకటన బోర్డుల ఏర్పాటు కూడా ఉన్నతాధికారుల పర్యవేక్షణలో పకడ్బందీగా జరగాలని నిబంధనలు ఉన్నా ఎలాంటి చర్యలు, ప్రతిపాదనలు లేకపోవడంతో పది సంవత్సరాల నుండి సున్నిత జీవావరణ ప్రాంతం ఏర్పాటు ఎక్కడవేసిన గొంగడి అక్కడే అనే చందంగా మారిందని విచారం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఉన్నత అధికారులు సంబంధిత డ్రాఫ్ట్ నోటిఫికేషన్ పై శాస్త్రీయ బద్దంగా క్షేత్రస్థాయిలో అధ్యయనం చేసి, జీవవైవిధ్య పరిరక్షణకు కావాల్సిన నిర్ణయాలు త్వరగా కేంద్రప్రభుత్వానికి పంపాలని, ఈ ప్రాంతంలో ఉన్న అరుదైన జీవవైవిధ్య సంపదను మరింత నష్టం జరగక ముండే కాపాడాలని ఆయన ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల సర్వే వేగవంతం చేయండి

### -మున్సిపల్ కమిషనర్ మొహమ్మద్ అయాజ్



**జమ్మికుంట, డిసెంబర్ 28 (నినాదం న్యూస్):** జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలో నిర్వహిస్తున్న ఇందిరమ్మ ఇండ్ల సర్వే వేగవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ మొహమ్మద్ అయాజ్ అన్నారు. శనివారం మున్సిపాలిటీ పరిధిలోని 26, 28, 29 వార్డులలో స్వయంగా కమిషనర్ మొహమ్మద్ ఆయాజ్ పర్యటించారు. జిల్లా కలెక్టర్ ఆదేశానుసరం వార్డు లలో ర్యాండం సర్వే చేసినారు. వార్డు అధికారులు సర్వే చేస్తున్న తీరును ఆయన పరిశీలించారు. వార్డు ఆఫీసర్లు విధిగా ప్రతి ఇంటికి వెళ్లి సర్వే పనులు ఒన్ లైన్ లో పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ జి రాజిరెడ్డి తో పాటు పలువురు వార్డు ఆఫీసర్లు పాల్గొన్నారు.

## రైతులు పంటలలో మెలకువలు పాటిస్తే అధిక లాభాలు

### -వరంగల్ జిల్లా కలెక్టర్ శారదాదేవి వెల్లడి



**నర్సంపేట, డిసెంబర్ 28(నినాదం న్యూస్):** రైతులు పండించిన పంటపై మెళకువలు పాటిస్తే ఉత్పత్తులకు మార్కెట్లో మంచి ధర దక్కి, సాగు లాభసాటిగా వుంటుందని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా పేర్కొన్నారు. శనివారం వ్యవసాయ, మార్కెటింగ్, ఉద్యానవనాల శాఖల సంయుక్త ఆధ్వర్యంలో వరంగల్ జిల్లా నర్సంపేట మండలం మాదన్నపేట గ్రామ రైతు వేదిక వద్ద మిరప కోత అనంతరం తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఏర్పాటుచేసిన రైతు అవగాహన మరియు శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ డాక్టర్ సత్య శారద ముఖ్యఅతిథిగా హాజరై పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నో వ్యయప్రయాసలకోర్చి, పంట పండించిన రైతన్నలు, కోతల సమయంలో కూడా తప్పనిసరిగా కొన్ని మెళకువలు పాటించాలని, లేనిచో తాలు అధికంగా వచ్చి, నిల్వలో అఫ్లోటాక్సిన్స్ వల్ల నాణ్యత దెబ్బతినే ప్రమాదం వుందని. ఈ సమస్యలను అధిగమించి, నాణ్యమైన దిగుబడులు, అధిక ధర పొందాలంటే కోతలు, అనంతరం కాయలు ఆరబెట్టే సమయంలో కూడా శాస్త్రీయ విధానాలను పాటించాల్సిన అవసరం ఉందన్నారు. మిరప పంట సాగు చేసిన రైతులు పంట కోత తరువాత ఎండలో ఆరబెట్టి నాన తాప రవాణా ప్రకారం కాల పరిమాణం రంగు ఆధారంగా గ్రీటింగ్ చేసుకొని వేరువేరుగా మార్కెట్లకు తీసుకెళ్లడం ద్వారా అధిక ధరలు పొందే అవకాశం ఉంటుందని, రైతులు వాడి క్రిమిసంహారక మందుల విషయంలో వ్యవసాయ మరియు ఉద్యానవన శాఖ అధికారుల సూచనలు పాటించడం ద్వారా ఇతర దేశాలకు ఎగుమతి ప్రమాణాలు గల మిరప వంటను పండించవచ్చుని, ఉద్యాన శాఖ అధికారులు ఈ ఉద్యాన పంటలు సాగు చేయు రైతులకు ఎప్పటికపుడు సూచనలు మరియు సలహాలు ఎలక్ట్రానిక్ మీడియా ద్వారా గాని లేదా యూట్యూబ్ల ద్వారా గాని నేరుగా రైతులు మొబైల్ కి పంపించాలని అన్నారు. నర్సంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పాలాయి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతి గ్రామంలో మిరప పంట సాగు సీజన్ కంటి ముందు జూన్ జూలై మాసాలలో ఏర్పాటు చేయడం వలన రైతులకు పెట్టుబడి భారం తగ్గించడంతోపాటు నాణ్యతమైన దిగుబడులు సాధించి అధిక మార్కెట్ ధరలు పొందే అవకాశం ఉందన్నారు. ఉద్యానవన శాస్త్రవేత్తలు నాగరాజు, వీరన్న పాల్గొని మిరప పంటలో పీడల నివారణ చేపట్టాల్సిన చర్యల పైకూలంకషంగా వివరించారు. అనంతరం క్షేత్రస్థాయిలో అధికారులు రైతులతో కలిసి కలెక్టర్ మిర్చి పంటను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అనురాధ, జెడ్పి సీఈఓ రామిరెడ్డి, ఆర్డిఓ రమాదేవి, మార్కెటింగ్ శాఖ జాయింట్ డైరెక్టర్ శ్రీనివాస్ డిప్యూటీ డైరెక్టర్ పద్మావతి, ఏనుమాముల మార్కెట్ కార్యదర్శి నిర్మల, మార్కెటింగ్ ఆధికారి సురేఖ, ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు రవీందర్ రెడ్డి, సంబంధిత శాఖల అధికారులు సిబ్బంది రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రిని పరిశీలించిన ఎంపీ ఈటెల



**అల్వాల్, డిసెంబర్ 28 (నినాదం న్యూస్):** ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణము పూర్తయి 8 నెలలు కావస్తున్న పారంభానికి నోచుకోవడం శోచనీయమని ఈటెల రాజేందర్ ఎంపీ అన్నారు. శనివారం ఓల్డ్ లోని ప్రభుత్వ ఆసుపత్రి భవనం పరిశీలించిన ఎంపీ ఈటల రాజేందర్. నిర్మాణం పూర్తి చేసి ఏడెనిమిది కావస్తున్న భవనము ప్రారంభానికి నోచుక పోవడంతో పేద ప్రజలకు చాలా ఇబ్బందిగా ఉంది అన్నారు. వైద్య ఆరోగ్యశాఖ మంత్రితో మాట్లాడి త్వరలో ప్రారంభించేలా చూస్తానని స్థానికులకు హామీ ఇచ్చిన ఎంపీ ఈటల రాజేందర్. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఇక్కడ ఉన్న ప్రైమరీ హెల్త్ సెంటర్ పేదలకు మంచి వైద్యం అందించేది. కానీ కొండ నాలుకకు మందు వేస్తే ఉన్న నాలుక పోయినట్టుగా.పాత బిల్డింగ్ స్థానంలో కొత్త బిల్డింగ్ కడితే మెరుగైన వైద్య సేవలు అందించవచ్చు అని భావిస్తే బిల్డింగ్ పూర్తి చేసిన కాంట్రాక్టర్ కి డబ్బులు చెల్లించక పోవడంతో తాళాలు వేసుకోవడంతో అనేక నెలలుగా వైద్య సేవలు నిలిచిపోయాయి.రాజకీయ పట్టింపులు, కాంట్రాక్టు బిల్లులు రాకపోవడం, పెద ప్రజల వైద్యంపట్ల పట్టింపు లేకపోవడం బాధ బాధ కలిగిస్తుంది అన్నారు.ఈరోజే వైద్య ఆరోగ్యశాఖ మంత్రి గారితో మాట్లాడి దీనిని వెంటనే ప్రారంభోత్సవం చేసే ఏర్పాటు చేస్తాను. స్టాఫ్ ను సంపూర్ణంగా నియమించి, వైద్య పరికరాలు తెప్పించి, పేద ప్రజానీకానికి వైద్యం అందేలా చూస్తానన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు కోఆర్డినేటర్ మల్లికార్జున్ గౌడ్, కార్తీక్ గౌడ్, తూప్రాన్ లక్ష్మణ్, అనిల్ రాజు, రాజిరెడ్డి, అరవింద్ రెడ్డి రవి, రామ్ సింగ్, నాగ స్వామి, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

## బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి పీజేఆర్

- మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్



**కుత్బుల్లాపూర్, డిసెంబర్ 28 (నినాదం న్యూస్):** కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ నివాసం వద్ద పి జనార్దన్ రెడ్డి వర్ధంతి సందర్భంగా పి జె ఆర్ చిత్రపటానికి కూన శ్రీశైలం గౌడ్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిజెఆర్ కార్మిక నాయకుడు, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మంత్రి వర్గంలో పనిచేశారని ఆయన సేవలను కొనియాడారు. ఖైరతాబాద్ నియోజకవర్గం నుండి ఐదు సార్లు ఎమ్మెల్యేగా గెలిచి అనునిత్యం ప్రజల కోసం పరితపించే నాయకుడు పిజిఆర్ అని మాజీ కూన శ్రీశైలం గౌడ్ పి జె ఆర్ పేద ప్రజలకు కోసం అందించిన సహకారము, సేవలను గుర్తు చేసుకున్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బొంగు నూరి శ్రీనివాస్ రెడ్డి, జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ బొంగు నూరి ప్రభాకర్ రెడ్డి, కౌన్సిలర్ ఎం రాము గౌడ్, మాజీ సర్పంచ్ యాదిరెడ్డి, మాజీ సర్పంచ్ యాదగిరి, ముత్యం రెడ్డి, పరశు రాముల గౌడ్, కుమార్ యాదవ్, మల్లేష్ యాదవ్, కోటీశ్వరరావు, సదానంద్, రాహుల్, విజయ్ గౌడ్, సురేష్, వెంకట్ రెడ్డి, మురళి, నియోజకవర్గం ప్రజలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మంగళవారం నుండి 252 భూసర్వే

- రైతులు సహకరించాలి
- తహసీల్దార్లు కిషన్‌నాయక్, విజయ్ కుమార్



**కొడంగల్, డిసెంబర్ 28 (నినాదం న్యూస్):** దుద్యాల మండలంలోని హకీంపేట్ రైతులతో దుద్యాల తహసీల్దార్ కిషన్ నాయక్, కొడంగల్ తహసీల్దార్ విజయ్ కుమార్ లు సమావేశం ఏర్పాటు చేశారు.హకీంపేట్ గ్రామంలోని లావునిపట్టా సర్వేనంబర్ 252లో మంగళవారం నుండి భూసర్వే జరుగుతుందనీ, రైతులు ఆరోజు అందుబాటులో ఉండి తమ హద్దులు చూపించాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో దుద్యాల డిప్యూటి తహసీల్దార్ వీరేష్ బాబు, గిర్ధావరి, సర్వేయర్ తదితరులు పాల్గొన్నారు

## పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి విగ్రహం ఆవిష్కరణ



**మహేశ్వరం, డిసెంబర్ 28 (నినాదం న్యూస్):** మహేశ్వరం నియోజకవర్గంలోని మీర్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ చందనం చెరువు సమీపంలో శ్రీ మద్విరాట్ శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారి విగ్రహం ఆవిష్కరించిన మాజీ మంత్రివర్యులు మహేశ్వరం ఎమ్మెల్యే శ్రీమతి సబితా ఇంద్రారెడ్డి మధుసూదనాచారి ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాలజ్ఞానాన్ని బోధించిన మహా యోగి, ఆత్మజ్ఞాన ప్రబోధకులు, ప్రపంచానికి తత్త్వబోధ చేసిన జగద్గురువు . వైఎస్ఆర్ జిల్లా లోని కందిమల్లయ్యపల్లెలో చాలాకాలం నివసించి కాలజ్ఞానం రచించి 1693లో సజీవ సమాధి నిష్ఠనొందినారు. శ్రీమద్విరాట్ వీరబ్రహ్మేంద్రస్వామివారి వలన ప్రసిద్ధి పొందుట చేత కందిమల్లయ్యపల్లె తర్వాతి కాలములో బ్రహ్మంగారిమఠంగా ప్రసిద్ధి చెందింది. ప్రపంచంలో ఏ వింత జరిగిన ఇది వీరబ్రహ్మేంద్రస్వామివారు తన కాలజ్ఞానంలో ఆనాడే చెప్పారు అంటూ ప్రజలు గుర్తుకు తెచ్చుకుంటూ ఉంటారు. కాలజ్ఞానంలో చెప్పినవన్నీ జరిగాయి, జరుగుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మేయర్, డిప్యూటీ మేయర్, కమిషనర్, కార్పొరేటర్లు, కోఆప్షన్ సభ్యులు మరియు అనుబంధ సంఘాల అధ్యక్షులు టిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# చెత్త దుర్గంధంతో ఇబ్బందులు ఉండొద్దు







- ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలి
- అధికారులను ఆదేశించిన ఎమ్మెల్యే వివేకానంద్

**కుత్బుల్లాపూర్, డిసెంబర్ 28 (నినాదం న్యూస్):** కుత్బుల్లాపూర్ నియోజక వర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ బాచుపల్లి డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల సముదాయం వద్ద రాత్రి వేళల్లో చెత్తను అక్రమంగా డంపింగ్ చేయడం వల్ల దుర్గంధంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్న విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ అధికారులతో కలిసి అక్రమ డంపింగ్ జరుగుతున్న ప్రాంతాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా హిల్ కౌంటింగ్ వాసులు రాత్రి వేళల్లో వేస్తున్న అక్రమ చెత్త డంపింగ్‌తో దుర్గంధం వస్తుందని ఈ విషయాన్ని ఎన్నిసార్లు అధికారులకు చెప్పినా పట్టించుకోవడంలేదని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు.అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రాత్రి వేళల్లో అక్రమంగా చెత్త డంపింగ్ చేస్తున్న వారిపట్ల కఠినంగా వ్యవహరించి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్, కమిషనర్ సాబేర్ అలీ, డిప్యూటీ ఎమ్మార్వో ప్రభుదాస్, బిఆర్ఎస్ పార్టీ ఎన్ఎంసి అధ్యక్షులు రంగరాయ ప్రసాద్, కార్పొరేటర్లు బాలాజీ నాయక్, రవికిరణ్, ఆగం రాజు, బౌర్ర దేవి చందు ముదిరాజ్, ఏఈ ప్రవీణ్, వాటర్ వర్క్స్ డీజీఎం చంద్రమౌళి, మేనేజర్ సౌమ్య, ఎన్విరాన్మెంటల్ ఏఈ సూకృతా రెడ్డి, సర్వేయర్ లక్ష్మి, వివిధ శాఖల అధికారులు , పలు డివిజన్ల అధ్యక్షులు, స్థానిక నాయకులు, హిల్ కౌంటీ వాసులు పాల్గొన్నారు.

## విశ్వనగర అభివృద్ధికి కృషి

- మర్రి రాజశేఖర్ రెడ్డి



**అల్వాల్, డిసెంబర్ 28 (నినాదం న్యూస్):** హైదరాబాద్ నగరాన్ని స్థిరమైన శుద్ధమైన హరిత పట్టణముగా తీర్చిదిద్దే ఉద్దేశంతో విశ్వ స్వచ్ఛంద సంస్థవారు విశ్వ వ్యర్ధరహిత హైదరాబాద్ 2027 అనే కార్యక్రమాన్ని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. ఈ సంస్థ ఎటువంటి లాభాలను అపేక్షించకుండా స్వచ్ఛందంగా సామాజిక మార్పు తీసుకురావడానికి ప్రభావశీలమైన కార్యక్రమములు నిర్వహిస్తూ .వ్యర్ధ ఉత్పత్తులను ఉత్పన్నమయ్యే చోటనే నిర్మూలించి వాటిని భూమిలోనికి చేరే ప్రక్రియను నిరోధించి పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తుందన్నారు. ఇందిరానగర్ కమ్యూనిటీ హాలు ఇందిరా నగర్ కాలనీ లోతుకుంట నందు సమావేశము ఏర్పాటు చేయడమైనది ముఖ్య అతిథిగా మల్కాజ్గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి పాల్గొన్నారు. మన ప్రాంతాన్ని కాలుష్య రహిత వ్యర్ధ రహిత ప్రాంతముగా ఏర్పాటు చేయుటకు తమ వంతు పాత్ర నిర్వహించవలసిందిగా అవగాహన ఈ సంస్థతోపాటు విశ్వ సస్టైనబుల్ ఫౌండేషన్ అనే పర్యావరణ సేవకులు సహజ సమాజము, ఆరోగ్యకరమైన సమాజం కోసం వీరి ముఖ్య ఉద్దేశము ప్లాస్టిక్ రహిత సమాజం ఎంతో కృషి చేస్తున్న యువకుడు వినయ్ అతని సహచరుల నో అభినందించిన ఎమ్మెల్యే రాజశేఖర్ రెడ్డి ఈ కార్యక్రమంలో ఇందిరా నగర్ కాలనీ ప్రెసిడెంట్ లక్ష్మణరావు పెద్ది రమేష్ అరుణ్ కుమార్ వెంకటనారాయణ విశ్వ సస్టేబుల్ ఫౌండేషన్ నిర్వాహకులు సూర్యనారాయణ వినయ్ మంచాల బ్రహ్మచారి కాలనీ వాసులు పాల్గొన్నారు.

## పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు కేటాయించాలి

- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



**కూకట్ పల్లి, డిసెంబర్ 28 (నినాదం న్యూస్) :** నిరుపేదలకు కేటాయించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను అన్ని మరమ్మతులు చేసి వెంటనే అందజేయాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు విజ్ఞప్తి చేశారు. కూకట్ పల్లి నియోజకవర్గంలోని డబుల్ బెడ్ రూములు అందుకున్న లబ్ధిదారులు వారి ఇండ్ల వద్ద వర్షపు నీరు సెల్లార్లోకి రావడంతోనే ఇబ్బందులకు గురవుతుందని అదేవిధంగా మంచినీటి సమస్య కరెంటు సమస్యలు ఉన్నాయని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుకి ఫిర్యాదు చేశారు. లబ్ధిదారుల ఆహ్వానం మేరకు నిజాంపేట్ లోని డబుల్ బెడ్ రూములను నిజాంపేట్ కమిషనర్ మరియు అధికారులతో కలిసి నీళ్లలో మునిగిన సెల్లార్ ప్రాంతాన్ని డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ నిరుపేదలకు డబుల్ బెడ్ రూములు అందించిన ప్రాంతాలలో నీటి సమస్యలు కరెంటు సమస్యలు డ్రైనేజీ సమస్యలు అన్ని పరిష్కరించి వీలైనంత త్వరగా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించి సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఇప్పటికే డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను అందించడంలో ప్రభుత్వం జాప్యం చేస్తుందని, పేదలు నివసిస్తున్న ఇండ్ల అద్దెలు కట్టుకోలేకపోతున్నారని ఇకనైనా అధికారులు త్వరితగతిన సమస్యలను పరిష్కరించి నిరుపేదలకు ఇండ్లను అందించే విధంగా అడుగులు వేయాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కోరారు. ఈ కార్యక్రమంలో కూకట్పల్లి కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ, నిజాంపేట్ కమిషనర్,ఎలక్ట్రికల్ అధికారులు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

## నిజాంపేట్‌ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతాం






- ఎమ్మెల్యే కెపి.వివేకానంద్

**కుత్బుల్లాపూర్, డిసెంబర్ 28 (నినాదం న్యూస్):** కుత్బుల్లాపూర్ నియోజక వర్గం నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ 15వ డివిజన్ లో ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ గాజుల సుజాత పత్తి కుంట చెరువు వద్ద దోబీ ఘాట్ నిర్మాణము, క్రిస్టియన్ గ్రేవ్ యార్డ్ లో ప్రహరీ గోడ, బోర్ వెల్ వసతి, ఎస్ ఆర్ జూనియర్ కాలేజ్ నుంచి సాయిబాబా దేవాలయం వరకు సీసీ రోడ్డు నిర్మాణము, చిల్డ్రన్స్ పార్క్ ఏర్పాటు వంటి వసతులను కల్పించాలని ఎమ్మెల్యేను కోరారు. అనంతరం ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ మాట్లాడుతూ గత పదేళ్ల కాలంలో కోట్లాది రూపాయల నిధులతో ఎంతో అభివృద్ధి పరిచామని, రానున్న రోజుల్లో కూడా నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ లో మౌలిక వసతుల కల్పనకు అధిక నిధులు కేటాయించి కుత్బుల్లాపూర్ నియోజక వర్గాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామన్నారు. క్రిస్టియన్ గ్రేవియార్డ్ ప్రహరీ గోడ నిర్మాణానికి ప్రణాళికలు రూపొందించి వెంటనే పనులను చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్, కమిషనర్ షాప్ ఇవ్వాలి, డిప్యూటీ ఎమ్మార్వో ప్రభుదాస్, బిఆర్ఎస్ పార్టీ ఎన్ఎంసి అధ్యక్షులు రంగరాయ ప్రసాద్, కార్పొరేటర్లు బాలాజీ నాయక్, రవికిరణ్, ఆగం రాజు, బౌర్ర దేవి చందు ముదిరాజ్, ఏఈ ప్రవీణ్, వాటర్ వర్క్స్ డీజీఎం చంద్రమౌళి, మేనేజర్ సౌమ్య, ఎన్విరాన్మెంటల్ ఏఈ సూకృతా రెడ్డి, సర్వేయర్ లక్ష్మి, వివిధ శాఖల అధికారులు , పలు డివిజన్ల అధ్యక్షులు, స్థానిక నాయకులు, స్థానిక బస్తి వాసులు తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా వీరబ్రహ్మేంద్రస్వామి పూజలు



**మహేశ్వరం, డిసెంబర్ 28 ( నినాదం న్యూస్) :** మహేశ్వరం నియోజకవర్గ పరిధిలోని మీర్ పేట్ మున్సిపల్ కార్పోరేషన్ లోని జిల్లెల గూడా చందన చెరువు కట్ట వద్ద ఏర్పాటు చేసిన జగద్గురు శ్రీ మద్విరాట్ పోతులూరి శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి వారి విగ్రహావిష్కరణ వేడుకలో పాల్గొన్న టిపిసిసి ప్రధాన కార్యదర్శి, మేయర్ చిగిరింత పారిజాత నర్సింహ రెడ్డి ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ రాబోయే రోజుల్లో ప్రపంచంలో జరిగే వింతలను సంఘటనలను ముందుగానే ఉహించి కాలజ్ఞానం చెప్పిన స్వామి వారు ఆయన చెప్పిన విధంగా కరోన కాలంలో సొంత మనుషులు సైతం అంతిమ యాత్రలలో పాల్గొనలేని పరిస్థితి ఏర్పడింది అని అన్నారు. అటువంటి మహా జ్ఞాని యొక్క విగ్రహా ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొనడం అదృష్టం అని అన్నారు. ఈ కార్యక్రమంలో టీయూఎఫ్ యు డిసి చైర్మన్ చల్లా నర్సింహ రెడ్డి, కార్పొరేటర్లు పోరెడ్డి పద్మ భాస్కర్ రెడ్డి, చల్లా బాల్ రెడ్డి, నాయకులు సామిడి గోపాల్ రెడ్డి, సోషల్ మీడియా కన్వీనర్ సిద్దేశ్వర చారి తదితరులు పాల్గొన్నారు.

## పేదల పెన్నిధి మాజీ మంత్రి జనార్ధన్ రెడ్డి



**అల్వాల్, డిసెంబర్ 28 (నినాదం న్యూస్):** పేదల పెన్నిధి ఆపద్బాంధవుడు కార్మిక నాయకుడు మాజీ సిఎల్పీ నాయకుడు పి జనార్దన్ రెడ్డి వర్ధంతి నీ ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు అనంతరం ఆయన మాట్లాడుతూ పేద ప్రజల కూడు గుడ్డ ఉండాలనే ఉద్దేశంతో కృషిచేసిన వ్యక్తి పి జనార్దన్ రెడ్డి అని అన్నారు. కాంగ్రెస్ నాయకులు అశోక్ రెడ్డి, చంద్రశేఖర్, కృష్ణ గౌడ్, నల్ల బలవంత రెడ్డి, శివ కుమార్, కేబుల్ శేఖర్, నాగేశ్వరరావు కిట్టు, సంజీవ్ కుమార్ ,సంతోష్ రెడ్డి, సంతోష్ సాగర్, ఓంకార్, శకుంతల నాయుడు, పద్మ నిర్మల, లక్ష్మి, కార్యకర్తలు పాల్గొన్నారు

## ధ్యానంతో సంపూర్ణ ఆరోగ్యం



**మహేశ్వరం, డిసెంబర్ 28( నినాదం న్యూస్):** మహేశ్వరా మహా పిరమిడ్ ధ్యాన వేడుకలలో ఈ రోజు సర్పంచుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీ నర్సింహ్మా రెడ్డి,ప్రవాస భారతీయుడు డాక్టర్ రాకేష్ రెడ్డి లట్టుపల్లి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ధ్యానంతో సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందొచ్చని అన్నారు. అదేవిధంగా అమెరికాలో స్థిరపడిన డాక్టర్ రాకేష్ రెడ్డి మాట్లాడుతూ వైద్యంతో నయంకాని మానసిక రుగ్మతలు ధ్యానం వలన పరిష్కరింపబడతాయని అన్నారు. వివిధ ప్రాంతాల నుండి మహేశ్వర మహా పిరమిడ్ కి విచ్చేసిన ధ్యాన ప్రియులకు వసతుల ఏర్పాటులో చైర్మన్ విజయభాస్కర్ రెడ్డి మరియు ట్రస్ట్ సభ్యులు చూపుతున్న చొరవ వెలకట్టలేనిదని అన్నారు.పత్రీజీ కారణజన్ముడని, శాఖాహార జగత్ కొరకు వారు తలపెట్టిన ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాలుపంచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగి మధుసూదన్ రెడ్డి, రామకృష్ణ,నరసింహ, సురేష్ పాల్గొన్నారు.

## వామపక్ష లౌకిక ప్రజాస్వామ్య శక్తులు ఏకం కావాలి

- సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య



**మహేశ్వరం, డిసెంబర్ 28 (నినాదం న్యూస్):** భారత కమ్యూనిస్టు పార్టీ 100 వసంతాల ఉత్సవాల సందర్భంగా మహేశ్వరం మండలం నాగారం గ్రామంలో పార్టీ మండల కార్యదర్శి పల్నాటి యాదయ్య ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణ, సభ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సిపిఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య హాజరై మాట్లాడుతూ భారతదేశంలోని వామపక్ష లౌకిక ప్రజాస్వామ్య శక్తులను ఐక్యం చేసి కేంద్రంలో నరేంద్ర మోడీ బిజెపి నాయకత్వంలోని ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా, కార్మిక, రైతాంగ వ్యతిరేక, మతోన్మాద విధానాలపై ఐక్య ఉద్యమాలు చేపట్టాల్సిన తక్షణ కర్తవ్యం ఉన్నది అని ఆయన ప్రజానీకానికి పిలుపునిచ్చారు. నేడు దేశంలో మత, జాతి, కుల, వైరుధ్యాల, కార్పోటు సంస్థలు అంతులేని దూపిడి నేపథ్యంలో సమగ్రత సమైక్యత, సౌభ్రతత్వం సమానత్వంతో కూడిన లౌకిక ప్రజాస్వామ్య భారత కొరకు నిలకడగా ఉద్యమిస్తుందని అన్నారు. ప్రజల ఉజ్వల చరిత్ర కలిగిన పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ అని అన్నారు. వివిధ సంస్కృతులు భాషలు, మతాలు కలిగి భిన్నత్వంలో ఏకత్వం, ఏకత్వంలో భిన్నత్వం కలిగిన వసుదైక కుటుంబం. భారత్ మహోజ్వాల చరిత్ర కలిగిన భారత్ ను కాపాడుకోవడంలో అహర్నిశలు కృషి చేస్తున్న పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ అని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మహేశ్వరం నియోజకవర్గ కార్యదర్శి బి దత్తు నాయక్, మండల నాయకులు పి దేవేంద్ర గౌడ్, రాములు, రాజు, కలమ్మ, పుష్పమ్మ, రాణి, యాదమ్మ నరసింహ కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఏసీబీ వలలో అవినీతి చేప

### -లంచం తీసుకుంటూ పట్టుబడ్డ డిప్యూటీ తహసీల్దార్



**జమ్మికుంట, డిసెంబర్ 28,(నినాదం న్యూస్):** శంకరపట్నం మండలంలోని తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ మల్లేశం ఏసీబీకి పట్టు పడడం తో మండలం లో కలకలం రేకెత్తింది. వివరాల్లోకి వెళితే.... శంకరపట్నం మండలంలోని ఎరడపల్లి గ్రామానికి చెందిన కలకుంట్ల నవీన్ రావు సర్వేనెంబర్ 352 లో విస్తీర్ణము 2.31 గుంటల భూమి లో నుండి డైరీ ఫార్మ్ కోసం 0.02.5 గుంటల భూమిని నాలా కన్వర్షన్ చేసుకోవడం కోసం డిసెంబర్ 10వ తేదీన మండల కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపాడు. తదుపరి ఆర్ఐ క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదికను డిసెంబర్ 23న సమర్పించగా 24వ తేదీన డిప్యూటీ తహసీల్దార్ మల్లేశం ని కలవగా కన్వర్షన్ చేయాలంటే ఖర్చవుతుందని చెప్పి ముందుగా పదివేల రూపాయలు డిమాండ్ చేయగా రూ.ఆరు వేలు ముందగా చెల్లిస్తానని ఒప్పందం చేసుకొని బాధితుడు ఏసీబీని ఆశ్రయించినట్లు తెలిపాడు. దీంతో ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి ఆధ్వర్యంలో డిప్యూటీ తహసీల్దార్ నగదును తీసుకుంటుండగా శని వారం వలపన్ని పట్టుకున్నట్లు తెలిపారు. మండల కార్యాలయంలో ప్రతి పనికి డబ్బులు వసూలు చేస్తున్నారని నాలాంటి వారి ద్వారానైనా అధికారులు తీరు మార్చుకోవాలని బాధితుడు తెలిపాడు.

**రెవెన్యూ శాఖలో మితిమీరుతున్న అవినీతి....**

లక్షల్లో ప్రభుత్వ జీతాలు తీసుకుంటున్నప్పటికీ రెవెన్యూ శాఖలో మాత్రం అవినీతి ఆగడం లేదు. ఇటీవల కాలంలో యూత్ ఫర్ యాంటీ కరప్షన్ అనే ఒక స్వచ్ఛంద సంస్థ రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన సర్వేలో అత్యధికంగా మామూళ్లకు అలవాటు పడ్డ శాఖ రెవెన్యూ శాఖగా వారు గుర్తించారు అంటే రెవెన్యూ శాఖలో అవినీతి తిమింగలాలు ఏ విధంగా ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు. డబ్బులు ఇస్తే చాలు ఇంతటి దారుణానికైనా అధికారులు బరి తెగిస్తున్నారు. ఏసీబీ దాడులు జరిగిన వారిలో భయం మాత్రం లేదు అవినీతి ఆగడం లేదు. ఒకే రోజు కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలంలో డిప్యూటీ తహసిల్దార్ లంచం తీసుకుంటూ పట్టుబడగా ఖమ్మం జిల్లాలో ఒక సర్వేయర్ 50 వేలు లంచం తీసుకుంటూ దొరకడం చర్చనీయాంశంగా మారింది. దొరికితే దొంగలు లేకపోతే దొరలు అన్నచందంగా రెవెన్యూ అధికారుల పనితీరు కనబడుతుంది. ఇప్పటికైనా ఈ శాఖపై ప్రత్యేక దృష్టి సారిస్తే మరిన్ని అవినీతి చాపలు బయటకు వస్తాయని ప్రజలు అంటున్నారు.

## పేదవిద్యార్థుల అభ్యున్నతికి కట్టుబడి ఉంటా

- గ్రంథాలయంలో స్టడీ మెటీరియల్ పంపిణీ
- కామారెడ్డిలో అల్ఫోర్స్ నరేందర్ రెడ్డి విస్తృత ప్రచారం



**కరీంనగర్, డిసెంబర్ 28 (నినాదం న్యూస్):** పేద విద్యార్థుల విద్యాభివృద్ధి కోసం తాను కట్టుబడి ఉంటానని ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ వి. నరేందర్ రెడ్డి అన్నారు. శనివారం కామారెడ్డి జిల్లా కేంద్రంలో పలువురు పట్టబద్రులను కలిసి రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనకు మద్దతు తెలపాలని కోరారు....అనంతరం జిల్లా గ్రంథాలయంలో నిరుద్యోగ యువతకు ప వీఎన్ఆర్ ఫౌండేషన్ ఆధవర్యంలో రూపొందించిన ఉచిత స్టడీ మెటీరియల్ ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగ, నిరుద్యోగ, పట్టభద్రుల సమస్యల పై అవగాహన ఉన్న తనను ఆశీర్వదించి అవకాశం ఇస్తే చట్టసభల్లో పట్టభద్రుల గొంతుక వినిపిస్తానని స్పష్టం చేశారు. పట్టభద్రుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని. విద్య రంగంనుండి తాను ఎమ్మెల్సీ గా బరిలోకి దిగుతున్నాని విద్యారంగ సమస్యలపై నిరంతరం పోరాడుతానని వెల్లడించారు. రాష్ట్ర వ్యాప్తంగా చాలా లైబ్రరీ లలో వివిధ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగ యువతి, యువకులకు వీఎన్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన ఉచిత స్టడీ మెటీరియల్ ను అందజేస్తున్నామని వెల్లడించారు .. పట్టభద్రుల ఎమ్మెల్సీ పరిధిలోని నాలుగు ఉమ్మడి జిల్లాలలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నానని రెండు నెలల తన పర్యటనలో పలు గ్రంథాలయాలను సందర్శించి తన వంతుగా చాలాచోట్ల మౌళిక సదుపాయాలు కల్పించారని గుర్తు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా గ్రంథాలయాల బలోపేతానికి కృషి చేస్తున్నారని..వెల్లడించారు.. దూర ప్రాంతాల నుండి జిల్లా కేంద్రం లోకిలైబ్రరీ లకు వచ్చి చదివుకునే నిరుద్యోగుల కోసం చాలా చోట్ల తన సొంత డబ్బులతో మధ్యాహ్న భోజన సౌకర్యం కల్పించినట్టు వెల్లడించారు.. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న యువతి యువకులు వీఎన్ఆర్ ఈ క్లాసెస్ ద్వారా ఉచితంగా అందజేసే స్టడీ మెటీరియల్ సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు... నిరుద్యోగ నిర్మూలనకు కృషి చేస్తున్న తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసిగెలిపించాలని విజ్ఞప్తి చేశారు..పోటీ పరీక్షల ఆశావాహులకు వీఎన్ఆర్ ఫౌండేషన్ చేయూతను ఇస్తుందని గుర్తు చేశారు.. కరీంనగర్ జిల్లా కేంద్రం లోని టీఎన్జిఓ ఫంక్షన్ హాల్ లో నెల రోజుల పాటు పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న బిఈడ్, డీ ఈడ్ అభ్యర్థులకు ఉచిత టెట్ కోచింగ్ తరగతులను నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువత సద్వినియోగం. చేసుకోవాలని కోరారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ పరిధిలోని ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్, మెదక్, ఆదిలాబాద్ జిల్లాలో పర్యటించానని పర్యటనలో భాగంగా చాలా మంది నిరుద్యోగులు వారి సమస్యలను తనకు వారి సమస్యలు తన దృష్టికి తీసుకు వచ్చారని.. వారి అభ్యర్తన మేరకు.. ఉచితంగా అల్ఫోర్స్ ఈ క్లాస్ యాప్ ను అందజేయగా అందులో ఇప్పటికే 50వేల మంది అభ్యర్థులు రిజిస్టర్ చేసుకున్నారని తెలిపారు అందులో 56 పోటీ పరీక్షలకు సంబంధించి స్టడీ మెటీరియల్ ఉంచినట్లు ఆయన వివరించారు.

## ఘనంగా బంగారు స్వామి జన్మదినం

### -కరిముల్లా షా దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు



**కరీంనగర్, డిసెంబర్ 28 (నినాదం న్యూస్ ):** కరీంనగర్: డాక్టర్ బంగారు స్వామి జన్మదిన వేడుకలు ఘనంగా అబ్దుల్ రెహమాన్ ఆధ్వర్యంలో నిర్వహించారు రిషి కాన్వెంట్ స్కూల్ పిల్లలతో కలిసి కేక్ కట్ చేపించడం జరిగింది అనంతం విద్యార్థి విద్యార్థులకు చిన్న పిల్లలకు స్వీట్ మరియు చాక్లెట్లు ఐయ్యడం జరిగింది . హౌసింగ్ బోర్డు కాలనీ లో వీరబ్రహ్మేంద్ర వృదురాశ్రమం లో అన్నదాన కార్యక్రమం చేపట్టడం జరిగింది ఈ కార్యక్రమం కి ముఖ్యఅతిథిగా అరవింద్ గారు పాల్గొనడం జరిగింది అనంతరం బ్లాంకెట్లు పంచడం జరిగింది తరువాత ఆయన అభిమానులు కరీంనగర్‌లోని ప్రఖ్యాత కరిముల్లా షా దర్గాను సందర్శించి, ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అభిమానులు దర్గాలో చాదర్ సమర్పించి, దేశం, రాష్ట్ర అభివృద్ధి, డాక్టర్ బంగారు స్వామి ఆయురారోగ్యాలు, విజయాలు కొనసాగాలని ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో యూతూ కాంగ్రెస్ అధ్యక్షుడు అబ్దుల్ రహ్మాన్ మరియు లయన్ యూత వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు అబ్దుల్ గఫార్ . దర్గా నిర్వాహకులు సులేమాన్ మన్సూర్ తవక్కలి మొహమ్మద్ అమీర్, శ్రీపురం మనోజ్, గోపి, అతీఫ్, అబూద్ విశిష్ట వ్యక్తులు, డాక్టర్ బంగారు స్వామి అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను ప్రత్యేకంగా మార్చారు.

## కేంద్ర మంత్రి సమక్షంలో కమలం గూటికి చేరిన మల్కాపూర్ మాజీ సర్పంచ్

**కరీంనగర్, డిసెంబర్ 28(నినాదం న్యూస్ ):**



కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, బిజెపి జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ కుమార్ సమక్షంలో మల్కాపూర్ తాజామాజీ గ్రామ సర్పంచి గొట్టే పోశయ్య జ్యోతి, గ్రామ ప్రజాప్రతినిధులు శనివారం రోజున కమలం గూటికి చేరారు. మల్కాపూర్ వార్డ్ మెంబర్స్ జాడి అశోక్, కటకం రాజు, సుధగోని రాజేశం గౌడ్, ఆటో యూనియన్ అధ్యక్షుడు, మాజీ వార్డ్ మెంబర్ గంట మోహన్ లతో పాటు కాంగ్రెస్ బీఆర్ఎస్ కు చెందిన 40 కార్యకర్తలు కాషాయతీర్థం పుచ్చుకున్నారు. వీరందరికీ కేంద్రమంత్రి బండి సంజయ్ పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఇట్టి కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, మండల అధ్యక్షులు కడార్ల రతన్ , నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# గ్రంథాలయాల బలోపేతానికి కృషి చేస్తా

- పట్టభద్రుల సమస్యల పరిష్కారానికి కృషి
- కనీస వేతన చట్టం అమలుకు కృషి
- పట్టభద్రుల ఇండిపెండెంట్ అభ్యర్థి యాదగిరి శేఖర్ రావు



**కరీంనగర్, డిసెంబర్ 28(నినాదం న్యూస్ )** తెలంగాణ సమగ్ర శిక్షా ఉద్యోగులకు ఇచ్చిన క్రమబద్ధీకరణ హామీని నిలబెట్టుకోవాలని తెలంగాణ సమగ్ర శిక్ష ఉద్యోగులు రెగ్యులరైజేషన్ చేయాలని నిజామాబాద్ ధర్నా చౌక్ లో 22 రోజులుగా నిర్వహిస్తున్న నిరవధిక సమ్మెకు తన సంపూర్ణ మద్దతును ప్రకటించిన ఎమ్మెల్సీ ఇండిపెండెంట్ అభ్యర్థి యాదగిరి శేఖర్ రావు సంరక్షణ చట్టం కొరకు 2018 లోనే కేంద్రంతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించి సంరక్షణ చట్టానికి ప్రయివేట్ బిల్ పెట్టించమని ఈ బిల్లుకు సపోర్ట్ చేసేవారు లేక అడుగున పడి పోయింది అని అన్నారు. కేంద్ర ప్రభుత్వం విద్యా సుంకం పేరుతో లక్షల కోట్లు కూడా పెట్టి విద్య వ్యవస్థకు ఖర్చు పెట్టకుండా దానిని వేరే పద్దు కు మారుస్తున్నారని అన్నారు. పట్టభద్రుల సమస్యలను అడిగి తెలుసుకుని సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. ఫీజ్ రియంబర్స్మెంట్ విడుదల కాక చాలా కళాశాలలు మూతపడ్డాయని ఫీజు రియంబర్స్మెంట్ విడుదలకు కృషి చేస్తానని అన్నారు. 22 సంవత్సరాలుగా ప్రజాసేవ ప్రజా సమస్యల కొరకు పనిచేస్తున్నానని పట్టభద్రుల తరఫున ప్రశ్నించే గొంతుకనవుతానని ప్రభుత్వానికి పట్టభద్రులకు మధ్య వారధిగా ఉండి పట్టభద్రుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. ప్రైవేట్ పాఠశాలల ద్వారా ఎంతోమంది ఉన్నతులుగా తీర్చిదిద్దుతున్న వారికి సంరక్షణ చట్టం లేక తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారని ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్, మెదక్, నిజామాబాద్ 272 మండలాలను తిరిగి అక్కడి సమస్యలను తెలుసుకున్నానని అన్నారు. ముఖ్యంగా ప్రైవేట్ విద్యాసంస్థల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులకు ఇన్సూరెన్స్ మరి హెల్త్ కార్డులాకై కృషి చేస్తానని అన్నారు. పట్టభద్రుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని వారి అభివృద్ధి ధ్యేయంగా మీ ముందుకు వస్తున్నానని ఎమ్మెల్సీగా కాదు మీకు సేవ చేసే సేవకుడిగా వస్తున్నాను అని అన్నారు పట్టభద్రుల సేవే మార్గం అభివృద్ధి దేంగా వస్తున్నానని అన్నారు కనీస వేతన చట్టం అమలకు కృషి చేస్తానన్నారు. గ్రంథాలయాల బలోపేతం చేస్తాను ఆశీర్వదించండి అభివృద్ధి చేస్తాను పాలకుడిగా కాదు సేవకుడిగా మీ ముందుకు వస్తున్న ఈ కార్యక్రమంలో ట్ర స్మా స్టేట్ స్పోక్స్ పర్సన్ జయసింహ గౌడ్, ట్రస్మా స్టేట్ అడ్వైజర్ మామిడాల మోహన్, జిల్లా ప్రెసి డెంట్ నిత్యానందం, ట్రస్మా నిజామాబాద్ అర్బన్ అధ్యక్షులు ధర్మరాజు, ట్రస్మా నిజాంబాద్ అర్బన్ సెక్రటరీ శ్రీనివాస్, నిజామాబాద్ అర్బన్ వైస్ ప్రెసి డెంట్ నారా గౌడ్ ,నిజాంబాద్ అర్బన్ జాయింట్ సెక్రెటరీ సత్యనారాయణ, ట్రస్మాబాద్యులు కే నాగరా జు ,గడ్డం రమేష్ ,సిహెచ్ కిరణ్ పాల్గొన్నారు.

## టి.బి వ్యాధిపై ఆరోగ్య అవగాహన సదస్సు



**జమ్మికుంట, డిసెంబర్ 28 (నినాదం న్యూస్):** జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలోని ఆబాది జమ్మికుంట మోత్కులగూడెంలో 100 రోజుల టి బి నిక్షయ్ శివిర్ కాంపెయిన్ లో భాగంగా టి బి వ్యాధి పై ఆరోగ్య అవగాహన సదస్సును డాక్టర్ సంధ్యారాణి ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగినది. ఈ సందర్భంగా డాక్టర్ సంధ్యారాణి, హెల్త్ ఎడ్యుకేటర్ మోహన్ రెడ్డి టి బి వ్యాధి లక్షణాలు, వ్యాధి వ్యాపించు విధానం మరియు తీసుకోవలసిన జాగ్రత్తలను గురించి క్లుప్తంగా వివరించి, అవగాహన కల్పించినారు. ప్రజలకు టి బి వ్యాధి పట్ల అవగహన అవసరమని, టి బి వ్యాధి ప్రాణాంతకం కాదని, అలాగని అశ్రద్ధ చేయరాదని ప్రజలకు సూచించారు. రెండు వారాలకు మించి ఎడతెరపిలేని దగ్గు, దగ్గులో తెమడ పడటం, బరువు తగ్గటం, ఆకలి మందగించడం, రాత్రి పూట చెమటలతో జ్వరం రావటం, అలసట, ఆయాసం వంటి లక్షణాలు ఉంటే అశ్రద్ధ చేయకుండా వెంటనే వైద్యుల సలహా తీసుకొని, గవర్నమెంట్ హాస్పిటల్ లో తెమడ పరీక్ష ఎక్స్ రే పరీక్షలు చేయించు కోవాలని సూచించారు. టి బి వ్యాధి అంటువ్యాధి అని, ఇది ఒకరినుండి మరొకరికి గాలి ద్వారా తుంపర్ల ద్వారా వ్యాపిస్తుంది అని అన్నారు. టి బి వ్యాధికి పేద ధనిక, చిన్న పెద్ద తారతమ్యం తేడా లేకుండా అందరికి వ్యాపిస్తుంది అన్నారు,షుగర్ వ్యాధిగ్రస్తులు, మిల్లులలో పనిచేసే కార్మికులు, పొగాకు చుట్ట బీడీ తాగే వారు 60 సంవత్సరాల పై బడినవారు అందరూ ఇటుక బట్టి లలో పనిచేసే కార్మికులు, కరోనా వచ్చిన వారందరూ తప్పకుండా టి బి పరీక్షలు చేహించుకోవాలని ప్రజలకు సూచించారు. టి బి వ్యాధి ఎక్కువగా పోషకహారం లోపం ఉన్న వారికి వస్తుందని, దీనిని అశ్రద్ధ చేయవద్దని ప్రజలకు అవగాహన కల్పించినారు. టి బి వ్యాధి నిర్ధారణ ఐతే, వారికి ఉచితం గా ప్రభుత్వం వారు మూడు నుండి ఆరు నెలల వరకు మందులు పంపిణీ చేస్తుందని, మంచి పోషకహారం తీసుకోవడంకోరకు వ్యాధి గ్రాస్తునికి ప్రభుత్వం వారు నెలకి 1000/- రూపాయలు చొప్పున వారి బ్యాంకు ఖాతాలో మందులు వాడినన్ని నెలలకు జామచేస్తారని చెప్పినారు. ఈ కార్యక్రమములో డాక్టర్ సంధ్యారాణి, హెల్త్ ఎడ్యుకేటర్ మోహన్ రెడ్డి, హెల్త్ సూపర్ వైజర్ అరుణ, టిబి సూపర్వైజర్ దేవేందర్ రెడ్డి ల్యాబ్ సూపర్వైజర్ చదువు కిరణ్, కమ్యూనిటీ కోఆర్డినేటర్ తిరుపతి, ఏఎన్ఎం సరళ, హెల్త్ అసిస్టెంట్ నరేందర్, ఆశా కార్యకర్తలు కాలనీ వాసులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ కవిత నాయకత్వంలోనే బిసి కులాలకు న్యాయం

### -బిసి కులాల సంఘాల నాయకుడు గుంజపడుగు హరిప్రసాద్



**కరీంనగర్, డిసెంబర్ 28(నినాదం న్యూస్):** కరీంనగర్‌లో జరిగిన సమావేశంలో గుంజపడుగు హరిప్రసాద్ మాట్లాడుతూ, హైదరాబాదులో కవిత నివాసంలో నిన్న జరిగిన సమావేశానికి వచ్చిన బీసీ కులాల సంఘాల మద్దతు కవితక్కకు వచ్చిన తర్వాత కాంగ్రెస్ పార్టీ నాయకుల కాళ్ళ కింద భూమి కదులుతుంది. అందుకే వారు అనాలోచితంగా కవితక్క మీద విమర్శకులు చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కవిత పైన చేసిన వ్యాఖ్యలను యావత్తూ బీసీ సమాజం తీవ్రంగా ఖండిస్తుంది. తెలంగాణ రాష్ట్రంలో దాదాపు నూట ముప్పై బిసి కులాలు ఉంటే నిన్నటి రోజున కవితక్క నివాసంలో జరిగిన సమావేశంలో డెబ్బై శాతం బిసి కులాలు హాజరై కవితక్క నాయకత్వంలో బీసీ ఉద్యమానికి సంపూర్ణ మద్దతును ప్రకటించడం జరిగింది. బిసి ల నుండి కవితక్క కు వచ్చిన స్పందన చూసిన తర్వాతనే కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇష్టమొచ్చిన రీతిలో మాట్లాడుతున్నారు. కవిత బీసీ కాదని కవితకు బీసీలకు ఏం సంబంధం అని ఇలా మాట్లాడుతున్నారు. అలా అయితే బీసీల గురించి మాట్లాడే రాహుల్ గాంధీది బీసీ వర్గమా. తెల్లారి నోరు తెరిస్తే బీసీల గురించి అబద్ధపు హామీలు ఇస్తూ బీసీలకు రిజర్వేషన్ గురించి చెప్పి కులగనున చేస్తాం అనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ది కూడ బీసీ వర్గం కాదు వీళ్ళది ఏ వర్గమో ఆది శ్రీనివాస్ చెప్పాలి. బీసీ అయితేనే బీసీల గురించి మాట్లాడాలా. అలా ఎక్కడైనా ఉందా అది కాంగ్రెస్ రాజ్యాంగమా అని బీసీ కులాలు ప్రశ్నిస్తున్నాయి. ఎమ్మెల్సీ కవిత బీసీ సంక్షేమం కోసం, బీసీల ఐక్యత కోసం, బీసీల బాతుకులను బాగు చేయడం కోసమే కవిత ముందుకు వచ్చింది. ఈరాష్ట్రాన్ని ఎక్కువ కాలం పరిపాలించింది కాంగ్రెస్ పార్టీ స్వాతంత్రం వచ్చి 70 సంవత్సరాలకు పైగా అయినా కూడ బిసిలను వారి పార్టీ గాలికి వదిలి బీసీలను కేవలం ఓట్లు వేసే యంత్రాలుగా చూసిందే తప్ప బీసీల బతుకులు బాగు చేయాలని వారేన్నడు ప్రయత్నం చెయ్యలేదు. తెలంగాణ రాష్ట్రంలో బీసీ కులాల సంక్షేమం జరిగిందంటే అది కేవలం తెలంగాణ తోలి ముఖ్యమంత్రి కేసీఆర్ ద్వారానే జరిగింది అది చేనేత రంగం దూసుకున్న, ముదిరాజు లకు చాప పిల్లల పెంపకమైన, గొల్ల కురుమలకు గొర్ల పంపిణీ అయినా, రజక నాయీ బ్రాహ్మణులకు ఉచిత విద్యుత్ అయిన ఇలా అనేక కార్యక్రమాలు కేసీఆర్ నాయకత్వంలోనే జరిగినవి ఆరోజు కూడ కవిత బీసీల పక్షాన పోరాడుతుంది. కవిత చిత్తశుద్ధిని చెంకించాల్సిన అవసరం లేదని హరిప్రసాద్ అన్నారు.

## విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం



**జమ్మికుంట, డిసెంబర్ 28 (నినాదం న్యూస్) :** అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ హుజురాబాద్ నగర శాఖ ఆధ్వర్యంలో ముఖ్య కార్యకర్తల సమావేశం శనివారం నిర్వహించుకున్నారు. అనంతరం విభాగ్ కన్వీనర్ అజయ్ మాట్లాడుతూ గత ప్రభుత్వం రాష్ట్రంలో విద్యవ్యవస్థను నిర్వీర్యం చేస్తే ఇప్పుదున్న కాంగ్రెస్ ప్రభుత్వం దీన్ని అలాగే కొనసాగించి విద్యార్థుల కు తీవ్ర అన్యాయం చేస్తుందని ఏబీవీపీ విభాగ్ కన్వీనర్ అజయ్ ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే ఆర్థిక సామాజిక అభివృద్ధిలో దేశానికి ఆదర్శంగా ఉన్న తెలంగాణ రాష్ట్రం నేడు పాలకుల స్వార్థపూరిత ఆలోచనల వల్ల ఆర్థిక సంక్షోభంతో సతమతమవుతుందన్నారు. పేద, బడుగు, బలహీన వర్గాలకు చెందిన విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన సంక్షేమ హాస్టల్లు సమస్యల కుంపటిలా మారాయని అన్నారు. రాష్ట్రంలో ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా.. ఏబీవీపీ నిర్మాణాత్మక ప్రతిపక్ష పాత్ర పోషిస్తూ విద్యార్థుల పక్షాన పోరాటం చేస్తుందన్నారు. అలాగే సిద్దిపేట పట్టణంలో ఈనెల 23 24, 25వ తేదీలలో జరిగిన రాష్ట్ర మహాసభల్లో విద్యా రంగ సమస్యల పై ఆమోదిం చిన తీర్మానాలను ప్రభుత్వానికి పంపిస్తామన్నారు. ఇతర రాష్ట్రాల్లో విద్య కు 14 శాతం నిధులు కేటాయిస్తే,తెలంగాణలో విద్యకు 7 శాతం నిధులు కేటాయించడం సరికాదన్నారు. గురుకులాల్లో విద్యార్థులు ఫుడ్ పాయిజన్తో చనిపోతున్నా ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుందని మండిపడ్డారు. ప్రయివేటు యూనివర్సిటీలను కాంగ్రెస్ ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని మండిపడ్డారు. ఈ సమావేశంలో కరీంనగర్ విభాగ్ కన్వీనర్ అజయ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గోసుకుల అజయ్,టౌన్ హాస్టల్ కన్వీనర్ అభిలాష్ ,కో కన్వీనర్ జస్వంత్,విజయ్,హరీష్, భరత్,రంజిత్, బిట్టు తదితరులుపాల్గొన్నారు.

## మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతి బాధాకరం





- ఆర్థిక సంస్కరణల రూపకర్తను కోల్పోయిన దేశం

**జమ్మికుంట, డిసెంబర్ 28 (నినాదం న్యూస్) :** భారత మాజీ ప్రధాని ఆర్థిక సంస్కరణల రూపకర్త డాక్టర్ మన్మోహన్ సింగ్ ఆకస్మిక మృతి బాధాకరమని ఆయన మృతి దేశానికి కాంగ్రెస్ పార్టీకి తీరని నష్టమని కాంగ్రెస్ పార్టీ నాయకులు కసుబోజుల వెంకన్న అన్నారు. శనివారం జమ్మికుంట పట్టణంలోని గాంధీ చౌరస్తాలో ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్ అదేశాల మేరకు జమ్మికుంట పట్టణ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు కసుబోజుల వెంకన్న అద్వర్యం లో మన్మోహన్ సింగ్ చిత్రపటానికి పూలమాలవేసి సంతాపాన్ని తెలియజేస్తూ నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ బారతదేశ మాజీ ప్రధానమంత్రి డాక్టర్ మన్మోహన్ సింగ్ అకాల మరణం చెందడం బాధాకరం అని అన్నారు. మన్మోహన్ సింగ్ ఆర్థిక సంస్కరణల రూప కర్త అని అన్నారు. మన దేశం ఆర్థికంగా సంక్షోభంలో ఉన్నప్పుడు ఆర్థిక సంస్కరణలు తీసుకుని వచ్చిన మహా నాయకుడని అన్నారు. మన దేశానికి 2004 నుండి 2014 వరకు పది సంవత్సారాలు ప్రధాన మంత్రిగా మచ్చలేని నాయకుడుగా ప్రజాసేవ చేసిన ఘనత అతనికే దక్కుతుందని అన్నారు. మన్మోహన్ సింగ్ ప్రధాన మంత్రిగా ఉన్న సమయంలో సమాచార హక్కు చట్టం, మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకం ప్రవేశ పెట్టినటువంటి గొప్ప వ్యక్తి అని అన్నారు. అలాగే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియ లో ఆయన పాత్ర ఎంతో ఉంది అని అన్నారు. ఆయన కేంద్ర ఆర్థిక శాఖ మంత్రిగా, రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా గవర్నర్ గా, అధ్యాపకుడు గా, ఆర్థిక సలహాదారునిగా ఆయన సేవలు దేశానికి మార్గదర్శకాలని అన్నారు. బారతదేశ మాజీ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ అకాల మరణం ఈ దేశానికి తీరని లోటని అన్నారు. ఈ సందర్భంగా సంతాపం తెలియజేస్తూ ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతున్ని ప్రార్దిస్తున్నాం అని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కసుబోజుల వెంకన్న, ఎండి సలీం, ఎగ్గని శ్రీనివాస్, ఎండి సలీం పాషా,వాసాల రామస్వామి, బండి మల్లేష్,చిన్నింటి నాగేంద్ర, ఎండి. ఇమ్రాన్, పోతుల శ్రీనివాస్ పాల్గొన్నారు.

## ఫలించిన బాధితుడి పోరాటం

**జమ్మికుంట, డిసెంబర్ 28 (నినాదం న్యూస్) :** హుజురాబాద్ ప్రభుత్వ హాస్పిటల్లో జీతం తీసుకుంటూ జమ్మికుంట లో గల తన ప్రైవేట్ హాస్పటల్లో సేవలు అందిస్తున్న డాక్టర్ చేగొండ శ్రీనివాస్ పై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కరీంనగర్ జిల్లా కలెక్టర్ కు సీఎంఓ కార్యాలయం నుండి ఆదేశాలు జారీ చేసినట్లు తెలంగాణ రైతు సంఘం సభ్యులు చెల్పూరి రాము ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, తనకు ఒక ప్రమాదంలో కాళ్లకు చేతులకు గాయాలయ్యాయని వాటిని పరీక్షించుకోవడానికి హుజురాబాద్ ప్రభుత్వ హాస్పిటల్ లో వైద్యం కొరకు వెళ్లగా డ్యూటీలో ఉండాల్సిన ఆర్థోపెడిక్ డాక్టర్ అక్కడ లేకుండా ఆ సమయంలో జమ్మికుంట లోని తన ప్రైవేట్ హాస్పిటల్లో సేవలు అందిస్తున్నారని ఈ విషయంపై డాక్టర్ శ్రీనివాసు ను వివరణ అడగగా ఆయన తనపై దురుసుగా ప్రవర్తించాడని పైగా నానా బూతులు తిట్టాడని రాము తెలిపారు.

ప్రభుత్వ హాస్పటల్ లో ఆర్థోపెడిక్ సర్జన్ గా పనిచేస్తున్న డాక్టర్ చేగొండ శ్రీనివాస్ ప్రభుత్వ హాస్పిటల్లో పనిచేసే సమయంలో అక్కడ చేయకుండా జమ్మికుంట పట్టణంలోని తన సొంత హాస్పిటల్ వరుణ్ సాయి లో సేవలు అందిస్తున్నాడని ఈ విషయాన్ని గతంలో కరీంనగర్ జిల్లా కేంద్రంలో ప్రజావాణిలో ఫిర్యాదు చేశానని ఫిర్యాదు పై స్పందించిన కలెక్టర్ ఆయనను డిప్యూటేషన్ రద్దుచేసి హుజరాబాద్ నుండి కరీంనగర్ కు పంపించడం జరిగిందని ఆయన తెలిపారు.

## తెలంగాణలో ఏబిసిడి వర్గీకరణ అమలు పరచాలి

### -కరీంనగర్ జిల్లా అధ్యక్షులుగా ప్రభు ప్రధాన కార్యదర్శిగా అమూల్య



**కరీంనగర్, డిసెంబర్ 28 (నినాదం న్యూస్):** ఎస్సి ఏబిసిడి వర్గీకరణ కోసం 30 ఏళ్లుగా సుదీర్ఘ పోరాటం చేసి వర్గీకరణ సాధించిన మహా యోధుడు మందకృష్ణ మాదిగ నేతృత్వంలో మాదిగల సత్తా ఏంటో వర్గీకరణ వ్యతిరేకులకు, వర్గీకరణ విషయంలో నిర్లక్ష్యం చేస్తున్న ప్రభుత్వానికి తెలియజేయడం కోసం లక్ష డప్పులు, వెయ్యి గొంతులు మహా కళా ప్రదర్శన మహా కళా ప్రదర్శన ఫిబ్రవరి మూడున హైదరాబాద్ లో జరుగును. ఈ కార్యక్రమం రాష్ట్ర అధ్యక్షులు కవి ,గాయకులు ఏపూరి సోమన్న సారాధ్యంలో ఆ మహత్తర కార్యక్రమానికి జనవరి 3 నుండి 10 జిల్లాల వ్యాప్తంగా ప్రచార రధాలు ప్రచార రథాలతో గ్రామ గ్రామాన ఉన్నటువంటి చైతన్య పరుస్తూ దేవన ఎస్సి మన దాంతో ఏబిసిడి వర్గీకరణ అందుకనే ఉన్నది తెలంగాణ రాష్ట్రంలో వెంటనే అమలుపరిచే విధంగా కోసం శనివారం రోజున కరీంనగర్ ప్రెస్ భవన్లో లక్ష డప్పులు కార్యక్రమం రాష్ట్ర కోఆర్డినేటర్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇన్చార్జి రామంచ్ భారత్ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నిక చేయడం జరిగింది. కరీంనగర్ జిల్లా అధ్యక్షునిగా అంబాల ప్రభాకర్ (ప్రభు)ఉపాధ్యక్షులుగా పుల్ల వెంకన్న , గసిగంటి కుమార్ కొంద్ర వెంకటస్వామి , నమిండ్ల కర్ణాకర్ ప్రధాన కార్యదర్శిగా కోటి అమూల్య సహాయ కార్యదర్శిలుగా పుల్ల శ్రావణ్, అంబాల శ్రీరాములు, భువనగిరి బాల తిరుపతి, భక్తుల అశోకులు నియమించడం జరిగింది. నియమకానికి కృషి చేసిన లక్ష డబ్బులు వెయ్యి గొంతుల కార్యక్రమంలో రాష్ట్ర కోఆర్డినేటర్ ముక్కెర సంపత్, ఒల్లాల వాని, ఎంఎస్పి రాష్ట్ర కోఆర్డినేటర్ ఇంజం వెంకట స్వామి మాదిగ ఎమ్మార్పీఎస్, ఉమ్మడి జిల్లా ఇన్చార్జ్ రుద్రారపు రామచంద్ర, రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు.

# ఒత్తిడి, ఆందోళన అధికంగా ఉంటున్నాయా.. అయితే ఈ ఆహారాలను తినండి..!



నిత్యం చాలా మంది ప్రస్తుతం ఒత్తిడి, ఆందోళనను ఎదుర్కొంటున్నారు. ఇవి వచ్చేందుకు అనేక కారణాలు ఉంటాయి. పని ఒత్తిడి, ఉద్యోగ, వ్యాపార సమస్యలు, ఆర్థిక సమస్యలు, ఆరోగ్య సమస్యలు.. ఇలా చాలా మందికి అనేక కారణాల వల్ల ఒత్తిడి ఉంటోంది. దీన్నుంచి బయట పడే మార్గం కూడా చాలా మందికి తెలియడం లేదు. అయితే ఒత్తిడి విపరీతంగా ఉన్నప్పుడు పలు రకాల ఆహారాలను తీసుకోవడం వల్ల దీని నుంచి బయట పడవచ్చని వైద్య నిపుణులు చెబుతున్నారు. ఈ ఆహారాలను తింటే మన శరీరంలో హ్యాపీ హార్మోన్లు యాక్టివేట్ అవుతాయి. ఇవి మూడ్‌ను మారుస్తాయి. దీంతో ఒత్తిడి, ఆందోళన నుంచి విముక్తి లభిస్తుంది. మానసిక ప్రశాంతత పొందవచ్చు. మైండ్ రిలాక్స్ అయి నిద్ర కూడా చక్కగా పడుతుంది. ఇక ఒత్తిడిని తగ్గించే ఆ ఆహారాలు ఏమిటో ఇప్పుడు తెలుసుకుందాం.

**ఆకుకూరలు..**

ఒత్తిడి, ఆందోళన అధికంగా ఉన్నవారు ఆకుకూరలను తరచూ ఆహారంలో భాగం చేసుకోవాలి. వారంలో కనీసం 2 నుంచి 3 సార్లు ఆకుకూరలను తింటే ఒత్తిడి నుంచి బయట పడవచ్చు. ముఖ్యంగా పాలకూర వంటి ఆకుకూరల్లో విటమిన్లు, మినరల్స్ సమృద్ధిగా ఉంటాయి. పాలకూరలో మెగ్నిషియం అధికంగా ఉంటుంది. మన శరీరంలో తగినంతగా మెగ్నిషియం లేకపోతే ఆందోళన, కంగారు, ఒత్తిడి వస్తాయని సైంటిస్టులు చెబుతున్నారు. కనుక మెగ్నిషియం అధికంగా ఉండే ఆహారాలను తీసుకుంటే ఈ సమస్యల నుంచి బయట పడవచ్చు. తరచూ పాలకూరను ఆహారంలో భాగం చేసుకుంటే మెగ్నిషియం సమృద్ధిగా లభిస్తుంది. ఇది ఒత్తిడి నుంచి బయట పడేస్తుంది. మనసుకు ప్రశాంతతను ఇస్తుంది.

**బ్రౌన్ రైస్..**

బ్రౌన్ రైస్, క్వినోవా, ఇతర తృణ ధాన్యాల్లో సంక్లిష్టమైన కార్బొహైడ్రేట్లు ఉంటాయి. ఇవి షుగర్ లెవల్స్‌ను తగ్గిస్తాయి. అలాగే మూడ్‌ను మార్చడంలో సహాయ పడతాయి. దీంతో కోపం, విసుగు, ఆందోళన, ఒత్తిడి నుంచి బయట పడవచ్చు. అలాగే తాజా పండ్లను కూడా ఆహారంలో భాగం చేసుకోవచ్చు. ముఖ్యంగా మెగ్నిషియం అధికంగా ఉండే బ్లూబెర్రీలు, స్ట్రాబెర్రీలను తినాల్సి ఉంటుంది. వీటిల్లో యాంటీ ఆక్సిడెంట్లు కూడా అధికంగానే ఉంటాయి. ఇవి ఫ్రీ ర్యాడికల్స్‌ను నాశనం చేస్తాయి. దీంతో వాపులు తగ్గుతాయి. ఒత్తిడి, ఆందోళన నుంచి ఉపశమనం లభిస్తుంది. మానసిక ప్రశాంతత కలుగుతుంది.



**చేపలు..**

అవకాడోలను చాలా మంది చూసే ఉంటారు. ఇవి పండ్ల జాతికి చెందినవి. మనకు ఎక్కువగా సూపర్ మార్కెట్లలో లభిస్తుంటాయి. అవకాడోలలో ఆరోగ్యకరమైన కొవ్వులు ఉంటాయి. ముఖ్యంగా వీటిల్లో ఫైబర్, పలు రకాల బి విటమిన్లు అధికంగా ఉంటాయి. ఇవి మెదడు పనితీరును మెరుగు పరుస్తాయి. దీంతో నాడీ మండల వ్యవస్థ ఆరోగ్యంగా ఉంటుంది. ఒత్తిడి, ఆందోళన తగ్గుతాయి. మైండ్ రిలాక్స్ అవుతుంది. సాల్మన్, సార్డైన్స్, మాకరెల్, ట్యూనా వంటి చేపల్లో ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు అధికంగా ఉంటాయి. ఇవి ఆరోగ్యకరమైన కొవ్వులు. వాపులను తగ్గిస్తాయి. మూడ్‌ను మారుస్తాయి. ఒత్తిడి నుంచి బయట పడేలా చేస్తాయి. కనుక ఈ ఆహారాలను తరచూ తింటుంటే ఒత్తిడి, ఆందోళన నుంచి బయట పడవచ్చు. మానసికంగా దృఢంగా, ఆరోగ్యంగా ఉంటారు.

# బాదాం పప్పును నానబెట్టుకుని తినొచ్చా..

అవని



పిల్లల నుంచి పెద్దల వరకు బాదాం పప్పును ఇష్టపడని వారు ఉండరు. సూపర్ ఫుడ్‌గా పిలువబడే ఈ బాదాంలో న్యూట్రియంట్స్, విటమిన్‌లు, ఫైబర్, మెగ్నీషియం, ఓమేగా-3 ఫ్యాటీ యాసిడ్స్, ప్రొటీన్స్ పుష్కలంగా ఉంటాయి. ఇవి మంచి ఆరోగ్యానికి తోడ్పడుతాయి. అయితే ఈ బాదాంను ఎలా తినాలనే విషయంలో కొందరికి సందేహం ఉంటుంది. నానబెట్టుకుని తినాలా..? లేదంటే నేరుగా తినాలా..? అనే అనుమానాలు మెదులుతుంటాయి. మరి ఎలా తీసుకుంటే ప్రయోజనం ఉంటుందో ఇప్పుడు తెలుసుకుందాం.. బాదాంను క్రమం తప్పకుండా తినడంవల్ల గుండె ఆరోగ్యం మెరుగుపడుతుంది. అలాగే ఇన్సులిన్ స్థాయి అదుపులో ఉంటుంది. ఇవి గ్లూకోజ్‌ను శరీరం బాగా శోషించుకొనేలా చేస్తాయి. తద్వారా మధుమేహం అదుపులో ఉంటుంది. అయితే నానబెట్టిన బాదం తినొచ్చా..? అన్నది చాలా మందిలో ఉండే సందేహం. వాస్తవానికి కొందరు నానబెట్టిన బాదం తింటే. మరికొందరు నేరుగా తింటుంటారు. కానీ నానబెట్టిన బాదాం పప్పులు తినడమే ఆరోగ్యానికి మంచిదని నిపుణులు చెబుతున్నారు. ఎందుకు మంచిదంటే బాదాం పప్పుల మీద ఉండే తొక్కలో టానిన్ అనే పదార్థం ఉంటుంది. అది మన శరీరం పోషకాలను గ్రహించకుండా చేస్తుంది. ఎప్పుడైతే మనం బాదాం పప్పులను నానబెడుతామో అప్పుడు ఆ తొక్క ఊడిపోతుంది. అలా తొక్క తొలగిపోయిన బాదాం మన ఆరోగ్యానికి మేలు చేస్తుంది. అందులోనూ ముఖ్యంగా రాత్రిపూట నీటిలో నానబెట్టి ఉదయాన్నే తినడంవల్ల మరిన్ని ఆరోగ్య ప్రయోజనాలు లభిస్తాయి. ఇలా క్రమం తప్పకుండా బాదాంను తినడం వల్ల జ్ఞాపకశక్తి మెరుగుపడుతుంది. ఇక బరువు తగ్గాలనుకునే వారికి కూడా బాదాం ఎంతగానో సాయపడుతుంది. ఎందుకంటే బాదాంలో ఉండే మోనో సాచురేటెడ్ ఫ్యాట్స్ ఎక్కువ సమయం పొట్టను నిండుగా ఉంచుతాయి. ఈ క్రమంలోనే ఆకలి తగ్గుతుంది. తద్వారా బరువు తగ్గొచ్చు. అదేవిధంగా బాదాంలో ఉండే పోషకాలు క్యాన్సర్ నివారణలో కూడా సాయపడతాయి.

# ఈ ఫాస్ట్ ఫుడ్స్ ఆరోగ్యకరమైనవే.. వీటిని తింటే శరీరానికి హాని కలగదు..



బయటి ఆహారం తినడం అంటే చాలా మందికి ఎంతో ఇష్టంగా ఉంటుంది. ఇండ్లలో చేసే ఆహారాల కన్నా కొందరు బయటి ఆహారాన్నే అమితంగా ఇష్టపడుతుంటారు. ఇప్పుడు నడుస్తున్నది జొమాటో, స్విగ్గీ యుగం కావడంతో చాలా మంది ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ యాప్‌లను ఉపయోగిస్తున్నారు. నచ్చిన ఫుడ్‌ను ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేసి తింటున్నారు. అయితే అంతవరకు బాగానే ఉన్నప్పటికీ కొందరు మాత్రం ఎక్కువగా జంక్ ఫుడ్‌ను తింటున్నారు. ముఖ్యంగా బయట లభించే ఫాస్ట్ ఫుడ్‌ను అధికంగా తింటున్నారు. దీంతో అనారోగ్యాల బారిన పడుతున్నారు. అయితే కొన్ని రకాల ఆహారాలు ఫాస్ట్ ఫుడ్ అయినప్పటికీ అవి మనకు ఆరోగ్యకరమైనవే. ఇక అలాంటి ఆరోగ్యకరమైన ఫాస్ట్ ఫుడ్స్ గురించి ఇప్పుడు తెలుసుకుందాం.

**గ్రిల్డ్ చికెన్ శాండ్ విచ్..**

గ్రిల్డ్ చికెన్ శాండ్‌విచ్ ను ఆరోగ్యకరమైన ఫాస్ట్‌ఫుడ్‌గా చెప్పవచ్చు. అయితే ఇందులో వైట్ బ్రెడ్‌కు బదులుగా బ్రౌన్ బ్రెడ్‌ను వాడాలి. అలాగే చికెన్‌ను వేయించకుండా గ్రిల్ చేయాలి. ఇలా తయారు చేసిన గ్రిల్డ్ చికెన్ శాండ్ విచ్ ఆరోగ్యానికి మంచిదే అని చెప్పవచ్చు. కనుక బయట మీరు ఎప్పుడైనా దీన్ని తింటే ఇలా ఒకసారి ట్రై చేయండి. ఓ వైపు రుచిగా ఉన్న ఆహారం తిన్న ఫీలింగ్ కలుగుతుంది. మరో వైపు శరీరానికి హాని కలగకుండా ఉంటుంది. ఇక బయట మీరు గ్రిల్ చికెన్ లేదా ఫిష్ తింటే అవి మనకు మేలు చేస్తాయి. కానీ వాటిపై అనవసరపు ఆయిల్స్, క్రీములు గట్రా వాడకుండా తినండి. అప్పుడే అవి ఆరోగ్యకరమైన ఫలితాలను ఇస్తాయి. అలాగే ఇలాంటి ఆహారాలను తిన్నప్పుడు ఎక్కువగా పచ్చి కూరగాయలు, ఆకుకూరలను తినడం మరిచిపోకండి. ఇవి మనల్ని ఆరోగ్యంగా ఉంచుతాయి.

**గ్రిల్డ్ చికెన్ రాప్స్..**


బేకరీలు లేదా రెస్టారెంట్లలో చాలా మంది చికెన్ రాప్స్ తింటుంటారు. వాటిల్లో గ్రిల్డ్ చికెన్ రాప్స్ కూడా ఒకటి. అయితే వీటిల్లో సాస్ తక్కువగా వేసి ఉపయోగించాలి. ఇలా తయారు చేసిన గ్రిల్డ్ చికెన్ రాప్స్‌ను తినవచ్చు. ఇవి ఆరోగ్యానికి మంచివే. అలాగే గ్రిల్డ్ ఫిష్ టాకోస్‌ను కూడా తినవచ్చు. ఇవి కూడా ఆరోగ్యకరమైన ఫాస్ట్ ఫుడ్ కిందకు వస్తాయి. అయితే చీజ్, క్రీములు గట్రా వాడకుండా తినాలి. దీంతో ఆరోగ్యానికి హాని కలగకుండా ఉంటుంది. అదేవిధంగా ఎగ్ వైట్ శాండ్ విచ్‌లను కూడా తినవచ్చు. వీటిల్లో కోడిగుడ్డులోని తెల్ల సొన ఉంటుంది. ఇక బ్రెడ్‌ను కూడా బ్రౌన్ బ్రెడ్‌ను ఉపయోగించాలి. ఇలా తయారు చేసిన శాండ్ విచ్‌లు ఆరోగ్యానికి మేలే చేస్తాయి. వీటిని కూడా ఆరోగ్యకరమైన ఫాస్ట్ ఫుడ్‌గా చెప్పవచ్చు.

**గ్రిల్డ్ వెజ్జీ బర్గర్..**

బర్గర్లు అంటే ఇష్టపడని వారు ఉండరు. కానీ వీటిల్లో అధికంగా క్యాలరీలు ఉంటాయి. ఇవి జంక్ ఫుడ్ కిందకు వస్తాయి. అయితే వీటిల్లోనూ ఆరోగ్యకరమైన బర్గర్‌లు ఉంటాయి. ఇకపై మీరు బర్గర్ తినేటప్పుడు గ్రిల్డ్ వెజ్జీ బర్గర్‌ను తినండి. క్రీములను ఉపయోగించకండి. ఇది పూర్తిగా ఆరోగ్యవంతమైన ఆహారంగా పరిగణించబడుతుంది. ఇక బయటకు వెళ్లినప్పుడు ఈ ఆహారాలను కాకుండా చాలా మంది నూనె అధికంగా ఉండే ఆహారాలను, క్రీములు ఉండే ఆహారాలను తింటుంటారు. ఇవన్నీ క్యాలరీలను పెంచుతాయని, బరువు పెరిగేలా చేస్తాయనే విషయాన్ని గుర్తుంచుకోవాలి. కనుక మీకు ఏదైనా ఫాస్ట్ ఫుడ్ తినాలని అనిపిస్తే పైన చెప్పిన ఆరోగ్యకరమైన ఆహారాలను తినవచ్చు. ఇవి ఆరోగ్యానికి ఎలాంటి హాని చేయవు. పైగా ఫాస్ట్ ఫుడ్ తిన్న భావన కూడా కలుగుతుంది. ఆరోగ్యంగా ఉండవచ్చు.




## NINADAM MARKET



# వాట్సాప్‌లో వచ్చిన లింక్.. బీ కేర్ ఫుల్!



ఈ రోజుల్లో రకరకాల మోసాలు జరుగుతున్నాయి. వాట్సాప్‌లకు లింక్‌లను పంపిస్తూ వాటిని క్లిక్ చేయగానే వివరాలన్ని సైబర్ నేరగాళ్లకు వెళ్లిపోతున్నాయి. ఇంకే ముందు క్షణాల్లోనే బ్యాంకు ఖాతాలో ఉన్న డబ్బంతా ఖాళీ అయిపోతుంటుంది. ఇలాంటి మోసాలు దేశంలో రోజురోజుకు పెరిగిపోతున్నాయి. తాజాగా ఓ యువకుడు వాట్సాప్‌లో వచ్చిన లింక్‌ను క్లిక్ చేయగానే సెకనులోనే రూ.6 లక్షలు మాయం అయ్యాయి.. కర్ణాటకలో డిజిటల్ మోసానికి ఓ యువకుడు రూ.6.6 లక్షలు పోగొట్టుకున్న ఘటన కలకలం రేపింది. యువకుడు వాట్సాప్ లింక్‌పై క్లిక్ చేయగా, అతని బ్యాంకు ఖాతాలో ఉన్న రూ.6 లక్షలను మోసం చేసిన ముఠా డ్రా చేసింది. సాంకేతికత విపరీతంగా అభివృద్ధి చెందుతున్నందున, డిజిటల్ మోసం కూడా పెరుగుతోంది. లింక్ ద్వారా రకరకాల మోసాలు జరుగుతున్నాయి. ఓటీపీ నంబర్ చెప్పండి.. పార్శిల్ వచ్చింది అంటూ సైబర్ నేరగాళ్లు మోసాలకు పాల్పడుతున్నారు. ఇలాంటివి అరికట్టేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపడుతున్నాయి. అయినప్పటికీ డిజిటల్ మోసాలు జరుగుతూనే ఉన్నాయి.

**డిజిటల్ మోసంలో రూ.6 లక్షలు పోగొట్టుకున్న యువకుడు:**


ఈ స్థితిలో కర్ణాటక రాష్ట్రంలో ఓ యువకుడు ఆన్‌లైన్ మోసంలో రూ.6 లక్షలు పోగొట్టుకున్నాడు. బాధితుడికి కెనరా బ్యాంక్ అనే వాట్సాప్ గ్రూప్‌లో లింక్ వచ్చింది. ద్వారా ఆధార్, కేవైసీ అప్‌డేట్ చేయకపోతే, కెనరా బ్యాంక్ ఖాతా బ్లాక్ చేయబడుతుందని బాధితుడికి సందేశం వచ్చింది. దానితో పాటు ఒక లింక్ కూడా వచ్చింది. ఆ వార్తను నిజమని నమ్మిన ఆ యువకుడు ఏపీకే డౌన్‌లోడ్ చేశాడు. అందులో నకిలీ కెనరా బ్యాంక్ లింక్ కనిపించింది. ఆధార్ నంబర్, ఏటీఎం పిన్, సీవీవీ నంబర్ తదితర వ్యక్తిగత వివరాలను కోరింది. వెంటనే ఆ యువకుడు వివరాలన్ని ఇచ్చేశాడు. ఆ తర్వాత అతనికి ఓటీపీ వచ్చింది. కానీ అతను ఆ %ూ్యా%ని ఎవరితోనూ పంచుకోలేదు. అతను ఏమీ ఇన్‌పుట్ చేయలేదు. అయితే అతని బ్యాంకు ఖాతా నుంచి రూ.6.6 లక్షల లావాదేవీ జరిగినట్లు తెలిసింది. ఇది మోసమని గ్రహించిన యువకుడు వెంటనే కావూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

**డిజిటల్ మోసం కొనసాగుతోంది:**

ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ నేరాల నుండి మిమ్మల్ని మీరు రక్షించుకోవడానికి ఏదైనా లింక్‌లపై క్లిక్ చేయడం మానుకోండి. ముఖ్యంగా వాట్సాప్ నుంచి ఫైల్స్ డౌన్‌లోడ్ చేయవద్దని నిపుణులు సూచించారు. అలాగే, అందుకున్న %ూ్యా%ని ఎవరితోనూ షేర్ చేయకూడదు. అదే సమయంలో మీ వాట్సాప్‌కు వచ్చే లింక్‌లపై క్లిక్ చేయవద్దు. వ్యక్తిగత వివరాలను నమోదు చేయవద్దని సూచిస్తున్నారు పోలీసులు, టెక్ నిపుణులు. ముఖ్యంగా బ్యాంకు వివరాలను పోస్ట్ చేయడం మానుకోవాలి. మీకు ఏదైనా అనుమానాస్పద నంబర్ నుండి మెసేజ్ లేదా %ూ్యా% వస్తే వెంటనే సైబర్ క్రైమ్ పోలీసులకు తెలియజేయడం ముఖ్యం.

### ఆదాయపు పన్ను చెల్లింపుదారులకు పండగే..

# వచ్చే బడ్జెట్‌లో తగ్గనున్న ట్యాక్స్..?




కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ ను ప్రవేశపెడుతున్నప్పుడల్లా ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకుంటారు. తమకు లభించే పన్ను మినహాయింపుల కోసం ఎదురు చూస్తుంటారు. పెరుగుతున్న జీవన వ్యయం కారణంగా ఆర్థిక ప్రణాళిక సక్రమంగా ఉండటానికి ఇలాంటి వాటిని కోరుకుంటారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వచ్చే ఏడాది ఫిబ్రవరి 1న 2025-26 బడ్జెట్ ను పార్లమెంటులో ప్రవేశపెట్టనున్నారు. దానిలో ఆమె ప్రజలకు గొప్ప శుభవార్త చెబుతారని విశ్వసనీయ సమాచారం. మధ్య తరగతి ప్రజలకు ఉపశమనం కలిగేలా రూ.15 లక్షల వరకూ వార్షిక సంపాదనపై ఆదాయపు పన్ను తగ్గించే అవకాశం ఉందని తెలుస్తోంది. కేంద్ర ప్రభుత్వం 2025-26 బడ్జెట్ లో దేశ ప్రజలందరికీ గొప్ప శుభవార్త చెప్పనుందని తెలుస్తోంది. అభివృద్ధి మందగమనం, ఆర్థిక వ్యవస్థలో వినియోగాన్నిపెంచడమే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకోనున్నారు. పౌరులపై భారాన్ని తగ్గించేందుకు ఆదాయపు పన్ను రేట్లను తగ్గించాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీని పలువురు ఆర్థిక ప్రముఖులు కోరారు. ఇటీవల జరిగిన నీతి ఆయోగ్ సమావేశంలో బడ్జెట్ పై వారి అభిప్రాయాలు, సూచనలు, సలహాలను ప్రధాని విన్నారు. ఆదాయపు పన్నును తగ్గించడంతో పాటు కస్టమ్స్ టారిఫ్ లను హేతుబద్ధీకరించాలని, రాబోయే బడ్జెట్ లో ఎగుమతుకు మద్దతు ఇచ్చే చర్యలను ప్రవేశపెట్టాలని కూడా కోరినట్టు సమాచారం. ఆదాయపు పన్ను మినహాయింపు నిజంగా జరిగితే దేశంలో కోట్ల మంది పన్ను చెల్లింపుదారులకు ప్రయోజనం కలుగుతుంది. దేశంలో ఆదాయపు పన్ను చెల్లింపుదారులకు పాత, కొత్త అనే రెండు రకాల ఎంపికలు అందుబాటులో ఉన్నాయి. పాత పన్ను విధానంలో ఇతర ఖర్చులతో పాటు అద్దె, బీమా మినహాయింపులు ఇస్తారు. కొత్త పన్ను విధానంలో చాలా మినహాయింపులను తొలగిస్తూ, పన్ను రేటును తగ్గిస్తారు. ప్రజలు తమకు అనుకూలంగా ఉండే విధానాన్ని ఎంపిక చేసుకోవచ్చు. ఆదాయపు పన్ను కొత్త విధానాన్ని 2020లో తీసుకువచ్చారు. దీని ప్రకారం.. ఏడాదికి రూ.3 లక్షలు సంపాదించే వ్యక్తులు పన్ను నుంచి మినహాయింపు పొందుతారు. ఇక రూ.మూడు లక్షల నుంచి రూ. ఏడు లక్షలు సంపాదించే వారు 5 శాతం, అలాగే రూ.7 లక్షల నుంచి రూ. 10 లక్షలకు 10 శాతం, ఆ తర్వాత రూ. పది లక్షల నుంచి రూ.12 లక్షలకు 15 శాతం, రూ.12 లక్షల నుంచి రూ.15 లక్షలకు 20 శాతం, రూ.15 లక్షలకు మించితే 30 శాతం పన్ను కట్టాలి. పాత పన్ను విధానంలో ఏడాదికి రూ.2.50 లక్షల ఆదాయాన్ని పన్ను నుంచి మినహాయిస్తారు. ఆ తర్వాత రూ.2.50 లక్షల నుంచి రూ.5 లక్షల వరకూ 5 శాతం, రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకూ 20 శాతం, రూ.పది లక్షలకు మించిన ఆదాయంపై 30 శాతం పన్ను కట్టాలి. దీనిలో ఇంటి అద్దె, బీమా ప్రీమియ వంటి ఖర్చులకు కూడా పన్ను మినహాయింపులను పొందవచ్చు. పన్ను రేటును తగ్గించడం వల్ల చెల్లింపుదారులకు ఊరట కలుగుతుంది. దేశంలో రూ.పది లక్షలు సంపాదించ వ్యక్తుల నుంచి ఎక్కువ పన్నువస్తుందని నివేదికలు చెబుతున్నాయి.

# ఈ చాయ్ ధర రూ.1 లక్షకుపైనే.. ఈ టీ కప్పు రహస్యం ఏంటి..

**- ఈ గోల్డ్ స్ట్రాంగ్ టీ ఎక్కడ దొరుకుతుంది**



చాయ్ అంటే చాలా మందికి అదో ఒక ఎమోషనల్ లా ఫీల్ అవుతూ ఉంటారు. మరెంతో మందికి చాయ్ లేనిదే రోజు స్టార్ట్ కాదు. ఫ్రెండ్స్ తో బయటికెళ్లినా, ఫ్యామిలీతో సరదాగా కబుర్లు చెప్పుకుంటూ కూర్చున్నా చాలా మందికి గుర్తొచ్చేది చాయే. ఇంత ఇంపార్టెన్స్ ఉన్న చాయ్ ధర ఎంతుంటుంది.. భారతదేశంలో టీకి భిన్నమైన క్రేజ్ ఉంది. రోజువారీ జీవితంలో టీ అనేది తప్పనిసరిగ్గా మారింది. టీ లేనిది రోజు గడపని వారు ఎందరో ఉన్నారు. అయితే ఒక కప్పు టీకి ఎంత చెల్లించాలి? భారతదేశంలో టీ తాగుతుంటే టీకి సాధారణ ఛార్జీ రూ. 10, రూ. 20. అదే మీరు ఫైవ్ స్టార్ హోటల్‌లో తాగాలనుకుంటే కాస్త ఖరీదు ఎక్కువగానే ఉంటుంది. అది కూడా రూ. 500-600. కాగా, ఇండియన్ కేఫ్‌లో కప్పు టీ ధర లక్ష రూపాయలు. సోషల్ మీడియాలో కూడా ఈ టీకి క్రేజ్ పెరుగుతూనే ఉంది.

**వెండి కప్పులో టీ అందిస్తారు..**

ఈ కేఫ్ పేరు బోహెూ కేఫ్. దీని యజమాని సుచేతా శర్మ. 5000 అంటే మన కరెన్సీలో సుమారు 1.14 లక్షలన్నమాట. ఈ టీ 24 క్యారెట్ల బంగారంతో తయారు చేసి, స్వచ్ఛమైన వెండి కప్పులో సర్వ్ చేస్తారు. టీ తాగాక కస్టమర్లు ఈ కప్పును తమ వద్ద ఉంచుకోవచ్చుట. ఇదే కాదు ఇక్కడి మెనులోని ఇతర ప్రీమియం ఐటెమ్‌లలో గోల్డ్ సావనీర్ కాఫీ, గోల్డ్ డస్టెడ్ క్రోసెంట్స్, గోల్డ్ డ్రింక్స్, గోల్డ్ ఐస్ క్రీం వంటి వెరైటీ డ్రింక్స్ కూడా ఉన్నాయి. ఈ టీని వెండి కప్పులో పోసి, 24 క్యారట్ల గోల్డ్ రేకుతో అలంకరిస్తారు. ఈ కేఫ్‌కు యజమాని ఒక భారతీయ సంతతికి చెందిన వ్యక్తి కావడం విశేషం. అంతేకాకుండా ఈ మెనులోని ఇతర ప్రీమియం ఐటెమ్‌లలో గోల్డ్ సావనీర్ కాఫీ, గోల్డ్ డస్టెడ్ క్రోసెంట్స్, గోల్డ్ డ్రింక్స్ మరియు గోల్డ్ ఐస్ క్రీం కూడా ఉన్నాయి అని ఖలీజ్ టైమ్స్ నివేదించింది. లగ్జరీని ఇష్టపడే వారి కోసం డిఫరెంట్‌గా క్రియేట్ చేయాలనుకున్నాం" అని సుచేతా శర్మ తెలిపారు. వారి 'రాయల్ మెనూ'లోని ఇతర ఆఫర్‌లలో గోల్డ్ సావనీర్ కాఫీ, వెండి పాత్రలో అందిస్తున్నాం. కస్టమర్లు ఇంటికి కూడా తీసుకెళ్లవచ్చు. దీని ధర 5000 (సుమారు 1.14 లక్షలు). ఈ టీపైనా బంగారం పొడి చల్లుతారు. చివర్లో ఈ కప్పులు, పళ్లేలను వినియోగదారులు తీసుకెళ్లిపోవచ్చు. ఈ రాయల్ మెనూలో 'గోల్డ్ సావరిన్ కాఫీ' కూడా ఉంది. దీని ధర 4,761 దిర్హామ్‌లు (రూ.1,09 లక్షలు). దీన్ని కూడా వెండి కప్పుల్లో ఇస్తారు. ఆ కప్పులను కూడా ఇంటికి తీసుకెళ్లవచ్చు. ఇవి కాకుండా బంగారం ఐస్‌క్రీమ్‌లు, డ్రింకులు కూడా లభిస్తాయి. 'విలాసాలు కోరుకునే వారికి ఏదైనా అసాధారణమైనది చేయాలనుకున్నాం. అందుకే వీటిని అందిస్తున్నాం' అని సుచేత శర్మ చెప్పారు.

## పకడ్బందీగా ఇందిరమ్మ ఇండ్ల సర్వే నిర్వహణ

### -జెడ్పి సీఈవో కె నరేందర్



**సుల్తానాబాద్,డిసెంబర్ 28 (నినాదం న్యూస్):** పకడ్బందీగా ఇందిరమ్మ ఇండ్ల సర్వే నిర్వహించాలని జిల్లా పరిషత్ ముఖ్యకార్యాలయ నిర్వహణ అధికారి కె నరేందర్ సిబ్బందికి ఆదేశించారు. శు క్రవారం సుల్తానాబాద్ మం డలం నీరుకుల్ల గ్రామం లో జరుగుతున్న సర్వేను పరిశీలిం చారు.అనంత రం వారు మాట్లాడుతూ,సుల్తానాబాద్ మండల పరిధిలో మొత్తం 11268 ఇండ్లకుగాను5400 ఇం డ్ల సర్వే పూర్తి అయ్యింది అని అన్నారు. కొన్ని గ్రా మాలలోదరఖాస్తుచేసుకున్నలబ్ధిదారులు అందు బాటులో లేనందున సర్వే పూర్తి కావడము లేదని తెలిపారు.అందుబాటులో లేని దరఖాస్తుదారు ల కు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చి 31వ తేదీ లోప ల సర్వే పూర్తి చేయాలని సీఈఓ ఆదేశించారు.అ నంతరం మండల కేంద్రంలో రూపాయల 17 లక్షల జిల్లా పరిషత్ నిధులతో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్నపాఠశాల మరమ్మత్తు పను లను సీ ఈ వో పరిశీలించారు.పనులు వేగవంతం గా చేయాలని సంబంధిత కాంట్రాక్టర్ కు సూచిం చారు.ఈ కార్యక్రమంలోఎంపీడీవో దివ్యదర్శన్ రా వు తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

## ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

- లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మాటేటి సంజీవ్‌కుమార్
- లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం




**సుల్తానాబాద్, డిసెంబర్ 28 (నినాదం న్యూస్):** లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలోఉచిత కంటి వైద్య శిబి రాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకో వాలని లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మాటేటి సంజీవ్ కు మార్ తెలియజేశారు. కరీంనగర్ రేకు ర్తికంటి ఆస్ప త్రి ఆధ్వర్యంలో సుల్తానాబాద్ మండల కేంద్రం లో ని శ్రీ వాణి జూనియర్ కళా శాలలో జనవరి 2 న ఉచిత శిబిరం నిర్వహిస్తున్నామని లయన్స్ క్లబ్ అధ్యక్షుడుమాటేటి సంజీవ్ కుమార్,పూసల సాం బమూర్తి,పిట్టల వెంకన్న,డిస్టుక్ చీఫ్ కో ఆర్డి నెటర్ వలస నీలయ్య లు అన్నారు. జనవరి 2 న ఉద యం 10 గంటల నుండి మధ్యాహ్నం వరకు ఉచి తంగా కంటి పరీక్షలు నిర్వహించి,మందులు పం పిణీ చేస్తారని వారు అన్నారు.అలాగే కంటి ఆప రే షన్ అవసరం ఉన్నవారికి ఉచితంగా ఆపరేషన్ ని ర్వహిస్తారని,ఆపరేషన్అవసరమైనవారు ఆధార్ కార్డు తెల్లరేషన్ కార్డ్ తీసుకొని రావాలని కోరారు.

## అయ్యప్ప స్వామి దీవెనలతో ప్రజలంతా సుభిక్షంగా ఉండాలి

- పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు
- ఎమ్మెల్యే ఆధ్వర్యంలో అయ్యప్ప స్వాములకు అన్నసంతర్పణ



**సుల్తానాబాద్, డిసెంబర్ 28 (నినాదం న్యూస్):** అయ్యప్ప స్వామి దీవెనలతో నియోజకవర్గ ప్రజ లంతా సుభిక్షంగా ఉండాలని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు ప్రత్యేక పూజ లు నిర్వహించారు.శనివారం సుల్తా నాబాద్ మం డల కేంద్రంలోని శాస్త్రినగర్ లో అయ్యప్ప స్వామి మండపం వద్ద అయ్యప్ప స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి,అయ్యప్పమాలధారులకు ,భక్తులకు అన్నసంతర్పణ చేశారు.ఈ సందర్భంగా అయ్యప్ప గురు స్వాములు,మండపనిర్వాహకు లు ఎమ్మెల్యే ని ఘనం గా సత్కరించారు.అనంత రం అయ్యప్ప స్వామి నూతన సంవత్సరం క్యా లెండర్ లను ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంధాలయ చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్, మున్సిపల్ చైర్ పర్సన్ గాజుల లక్ష్మి రాజమల్లు, ఏఎంసీ చైర్మన్ మినుపాల ప్రకాష్ రావు,మాజి ఏ ఎంసి సాయిరి మహేందర్, సింగిల్ విండో చైర్మన్ శ్రీగిరి శ్రీనివాస్,కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు వే గోళం అబ్బయ్య గౌడ్, మండల కమిటీ అధ్యక్షుడు చిలుక సతీష్, పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకు లు,గురుస్వాములు పాల్గొన్నారు.

## మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు

### -ట్రాఫిక్ ఎస్ఐ రవికాంత్



**సుల్తానాబాద్, డిసెంబర్ 28 (నినాదం న్యూస్):** మద్యం త్రాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసు కొని కేసులు నమోదు చేస్తా మని ట్రాఫిక్ ఎ స్ఐ రవికాంత్ అన్నారు. శనివారం సుల్తానా బాద్ మండల కేంద్రంలోని తెలంగాణ చౌరస్తా వద్ద స్పె షల్ డ్రైవ్ కార్యక్రమాన్ని ట్రాఫిక్ సి ఐ అనిల్ ఆదే శాల మేరకు నిర్వహించారు.ఈ సందర్భంగా పలు వాహనాలను ఆపివాహనాలపత్రాలను క్షుణ్ణంగా పరిశీలించారు.ద్విచక్ర వాహనాలు నడిపేటప్పుడు ప్రతి ఒక్కరు హెల్మెట్ ధరించాలని,రాంగ్ రూట్ లో ప్రయాణం నేరమని,వాహనాలకు తప్పనిసరిగా ఇ న్సూరెన్స్ తో పాటు డ్రైవింగ్ లైసెన్స్ కలిగిఉండా లనిఅన్నారు.మద్యం త్రాగి వాహనాలు నడిపితే ఇటీవల కోర్టులో ప్రవేశపెట్టగా జైలు శిక్ష విధించార ని ఎస్ఐ పేర్కొన్నారు.వాహనాలను నడిపేటప్పు డు నెమ్మదిగా వెళ్లాలని అతి వేగంతోప్రయాణిస్తే ప్రమాదాలబారిన పడి కుటుంబపరంగా,ఆర్థిక ప రంగానష్టపోతారని సూచించారు.వాహనాలను జాగ్రత్తగానడిపి క్షేమంగాగమ్యంచేరాలని వాహన దారులకు ఎస్ఐ సూచించారు.

## మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు నివాళులు



**8ఇంక్లైన్ కాలనీ, డిసెంబర్ 28, నినాదం న్యూస్ :** 8వ,కాలనీ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు గుండేటి రాజేష్ ఆధ్వర్యంలో మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ కు నివాళులు అర్పించిన 8వ, కాలనీ కాంగ్రెస్ నాయకులు.జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు మారెల్లి రాజిరెడ్డి మాట్లా డుతూ భారతదేశ ఆర్థిక సంక్షోభం ఉన్న పరిస్థితుల్లో ఆర్థిక సంస్కరణలను ప్రవేశపెట్టి దేశ ఆర్థిక వృద్ధి రేటును పరుగులు పెట్టించిన మహోన్నత వ్యక్తి మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ అన్నారు, మన్మోహన్ సింగ్ మృతి పట్ల సంతాపం తెలుపుతూ మన్మోహన్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆర్థిక శాస్త్రవేత్తగా తన జీవితాన్ని ప్రారంభించిన మన్మోహన్ సింగ్ అంచలంచెలుగా ఎదుగుతూ దేశ ప్రధానిగా రెండు పర్యాయాలు పనిచేసే భారతదేశాన్ని ప్రపంచ దేశాల్లో అగ్రగాక్గా నిలిపారని అన్నారు ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ సాగంటి శంకర్ ,మార్క రాజు, మల్లారెడ్డి తిరుపతిరెడ్డి, అనుము రాములు, అన్వర్, మెరుగు రాజేష్, సారయ్య నాయక్, కొమ్ము ఓదెలు, నారాయణ, ప్రశాంత్ గౌడ్, మోతుకు అవినాష్, బొల్లం రాజు, మహేష్ ఇరుకు, మధునయ్య, తిరుపతి గౌడ్, మైకల్, ఇరువంటి రవి, తదితరులు పాల్గొని నివాళులు అర్పించారు.

## అప్పులు తీర్చలేక వ్యక్తి ఆత్మహత్య



**జమ్మికుంట, డిసెంబర్ 28 (నినాదం న్యూస్) :** జమ్మికుంట మండలంలోని నాగంపేట గ్రామానికి చెందిన మిర్యాల కుమారస్వామి అనే వ్యక్తి అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాదులో చికిత్స పొందాడు. అనారోగ్యానికి గురైనప్పుడు అప్పుగా తెచ్చుకున్న డబ్బులు తీర్చలేక తీవ్రమనస్థాపం చెంది ఈనెల 9న పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు వరంగల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృతి చెందాడు. మృతుని భార్య మిరియాల వెంకటమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ వరగంటి రవి తెలిపారు.

## ఇద్దరి యువకులను బలి తీసుకున్న లారీ

**ధర్మారం డిసెంబర్ 28 (నినాదం న్యూస్)** మండలంలోని బం జేరుపల్లె తండ గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు ఆయోన్నలారికి గుద్దుకొని ఇరువురి యువకులు చనిపోయిన సంఘటన బంజర పల్లెలో శుక్రవారం చోటుచేసుకుంది, ఎస్సై శీలం లక్ష్మణ్,స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం సొంత పనుల మీద ధర్మారం వెళ్లి తిరిగి వస్తున్న క్రమంలో జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీని వెనుక వైపు నుండి తమ టూ వీలర్ తో ఢీకొనగా బండిని నడుపుతున్న బానోత్ సంతోష్ నాయక్ తలకు తీవ్ర గాయాల అక్కడికక్కడే మృతి చెందగా వెనుక కూర్చున్న నునుసావత్ రాజశేఖర్ తలకు ముఖం పైన గాయాలు కాగా స్థానికులు ఆసుపత్రికి తరలిస్తున్న ఉండగా మార్గమధ్యంలో మృతి చెందాడని, కాగా ఇరువురి భార్యలు రెండవ కాన్పుగా గర్భవతులుగా ఉండడం స్థానికులను కలిచి వేస్తుంది .రాజశేఖర్ భార్య సునీత దరఖాస్తు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.









## ప్రైమరీ విద్యే అత్యంత కీలకం

- గాయత్రి విద్యానికేతన్ లో అలరించిన రైమ్స్ ఫెస్ట్
- గాయత్రి విద్యా సంస్థల అధినేత శ్రీనివాస్



**పెద్దపల్లి,డిసెంబర్ 28(నినాదం న్యూస్):** ప్రతి విద్యార్థి చిన్నతనం నుంచే విద్యను అలవర్చు కావాలని గాయత్రి విద్యా సంస్థల అధినేత అల్లెంకి శ్రీనివాస్ అన్నారు.శనివారం పెద్దపల్లి పట్టణంలోని గాయత్రి విద్యానికేతన్ లో రైమ్స్ ఫెస్ట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా గాయత్రి విద్యా సంస్థల ఛైర్మన్ అల్లెంకి శ్రీనివాస్ పాల్గొని మాట్లాడుతూ,ప్రతి విద్యార్థి జీవితంలో ప్రీ ప్రైమరీ విద్య అనేది అత్యంత కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. ముఖ్యంగా నర్సరీ, ఎల్.కె.జి.మరియు యు.కె.జి. తరగతుల్లో టీచర్లు బోధించిన అంశాలు సరిగ్గా నేర్చుకుంటే ముందు తరగతుల్లో ఇంకా బాగా రాణించే అవకాశం ఉంటుదన్నారు.రోజూ పుస్తకాలతో కుస్తీ పట్టి,చదివి చదివి అలిసిపోయిన మీ, మా చిన్నారుల మానసిక ఆనందం కోసం మా పాఠశాల ఆవరణలో రైమ్స్ ఫెస్ట్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు.అనంతరం గాయత్రి విద్యా సంస్థల కరస్పాండెంట్ రజనీ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రీ ప్రైమరీ స్థాయిలో రైమ్స్ నేర్పడం వలన పిల్లలలో జ్ఞాపక శక్తి, విషయ గ్రహణ శక్తి, హావభావాలు,వివిధ పదాలు, వాటిని పలికే విధానం,సభ్యత,సంస్కారం, పెద్దలతో ప్రవర్తించే విధానం తదితర అంశాలు సులభంగా నేర్చుకునే అవకాశం ఉందనీ అన్నారు.మనం రైమ్స్ ని నేర్పించడం ద్వారా పిల్లలకు సరదాతో పాటు వారికి తెలియకుండానే భాషాపరమైన అంశాల్లో పట్టు సాధించి,వారిలోని భయం తొలగి వారు తమ భవిష్యత్ లో మరింతగా రాణించే అవకాశం ఉందన్నారు.రైమ్స్ ఫెస్ట్ ని విజయవంతంగా నిర్వహించడంలో కృషి చేసిన ప్రీ ప్రైమరీ టీచర్లను ఈ సందర్భంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో చిన్నారులు చిన్న చిన్న పదాలతో,ముద్దు ముద్దు మాటలతో చేసిన ఉపన్యాసాలు అందరినీ ఆకట్టుకున్నాయి.అనంతరం విద్యార్థినీ విద్యార్థులు పఠించిన భగవద్గీత శ్లోకాలు అందరినీ మంత్రముగ్ధులను చేశాయి. రంగురంగుల వేషధారణలో వచ్చిన విద్యార్థినీ విద్యార్థులు తమ బుడి బుడి అడుగులతో ఇంగ్లీష్ , హిందీ మరియు తెలుగు రైమ్స్ కి అనుగుణంగా చక్కని హావభావాలతో నృత్యం చేయడం చూసి ఆహుతులు సంభ్రమాశ్చర్యాలకు లోనయ్యారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విజయ్, ఉపాధ్యాయ బృందం,పోషకులు పాల్గొన్నారు.

## హామీలను విస్మరిస్తే ఊరుకునే ప్రసక్తి లేదు

- సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు తుమ్మల రాజిరెడ్డి
- హామీలను విస్మరిస్తే ఊరుకునే ప్రసక్తి లేదు
- సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు తుమ్మల రాజిరెడ్డి



**8 ఇంక్లైన్ కాలనీ, డిసెంబర్ 28, నినాదం న్యూస్ :** ఈరోజు ఉదయం ఆర్జి–టు ఏరియాలోని వకీల్ పల్లి మైన్ నందు ఉపాధ్యక్షులు వెంకన్న ఆధ్వర్యంలో ద్వార సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది, ఈ సమావేశంలో ఏరియా సెక్రెటరీ కుంట ప్రవీణ్ కుమార్ మైన్ లో జరుగుతున్న సమస్యలపై మాట్లాడుతూ కార్మికులందరూ స్పందించాలని పిలుపునిచ్చారు, అనంతరం సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు రాజిరెడ్డి మాట్లాడుతూ హామీలను విస్మరిస్తే ఊరుకునేది లేదని సొంత ఇల్లు అమలు కొరకు ఎంతటి ఉద్యమాల కైనా సిద్ధంగా ఉన్నామని, లిపెరాక్స్ మీద ఇన్కమ్ టాక్స్ రియంబర్స్మెంట్ గతంలో 2011 వ సంవత్సరంలో గెలిచిన సంఘం ఏఐటీయూసీ ఉన్నప్పుడు కోల్ ఇండియాలో ఒప్పందం జరిగిందని, ఇప్పటికీ 13 సంవత్సరాలు గడిచిన తర్వాత మరల ఏఐటీయూసీ అధికారంలో వచ్చి పెరెక్స్ మీద ఇన్కమ్ టాక్స్ రియంబర్స్మెంట్ మీద మాట్లాడకపోవడం సిగ్గుచేటని స్ట్రక్చర్ సమావేశాల్లో ఇట్టి అంశాన్ని చర్చించకపోవడంపై కార్మికుల పట్ల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారులి, కార్మికులపై చిత్తశు ద్ధి ఉంటే సింగరేణిలో అధికారుల వలె కార్మికులకు వెంటనే ఇన్కమ్ టాక్స్ రియంబర్స్మెంట్ ఇప్పించాలని లేనిచో కార్మికులకు అవగాహన సదస్సు నిర్వహించి కార్మికులను చైతన్య పరుస్తూ గుర్తింపు ప్రాతినిధ్య సంఘాల ఉనికి ప్రశ్నార్థకం చేస్తామని తీవ్ర విమర్శలకు కురిపించారు, అలాగే రాష్ట్ర ప్రభుత్వము అధికారంలో రావడానికి కార్మికులందరూ ఏకతాటిపైకి వచ్చి అధికారం ఇచ్చారని ఇప్పుడు ఎమ్మెల్యేలు, ఎంపీలు ఇట్టి విషయాన్ని మరిచి సంవత్సరం కాలము అయిందని ఇప్పటికీ సంవత్సర కాలంగా అటు రాష్ట్ర ప్రభుత్వానికి ఇటు గుర్తింపు ప్రాతినిధ్య సంఘాలకు సమయం ఇచ్చామని భవిష్యత్తు కార్య చరణలో హామీల పట్ల వైఖరి తెలియజేస్తూ ముందుకు రావాలని హామీలకు సంబంధించిన అంశాలను గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలు పెద్దన్న పాత్ర పోషించి చేస్తే బాగుంటుందని లేనిచో భవిష్యత్తులో కార్మికులు తగిన బుద్ధి చెబుతారని ఘాటుగా విమర్శించారు, ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు నరహరిరావు, వైస్ ప్రెసిడెంట్ నరసింహ,వకీల్ పల్లి ఫిట్ సెక్రటరీ శ్రావణ్, జగదీష్, వినయ్ రాజ్,వినేష్, శివ, కిషోర్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## డబుల్ బెడ్ రూమ్ ఇండ్లలో మౌలిక వసతుల కల్పనకు కృషి



**పెద్దపల్లి,డిసెంబర్ 28(నినాదం న్యూస్):** డబుల్ బెడ్ రూం ఇండ్లలో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుందనీ ఎమ్మెల్యే విజయ రమణారావు అన్నారు. శనివారం పెద్దపల్లి పరిధిలోని చందపల్లి,హనుమంతుని పేట గ్రామ శివారులో నిర్మించిన డబల్ బెడ్ రూమ్ ఇండ్లలో కల్పించే మౌలిక వసతుల పనులను మున్సిపల్ అధికారులు,స్థానిక అధికారులు ప్రజాప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే పరిశీలించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయరమణ రావు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో అసంపూర్తిగా డబుల్ బెడ్ రూమ్ లో నిర్మాణాలు వదిలేశారని ఆరోపించారు.ఇప్పటికే రూ.4 కోట్లు కేటాయించి డ్రైనేజీలు, రోడ్లు, నీటి సంపులు,ఇతరత్రా మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకోవడం జరిగిందని అన్నారు.ఇప్పటికే పనులు ఒక కొలిక్కి వచ్చాయని,త్వరలో అసంపూర్తిగా ఉన్న పనులను పూర్తి చేయాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు.ఈ పనుల విషయంలో ఎలాంటి ప్రయత్నం లోపం గాని లేదని, పనులు నిరంతరం కొనసాగుతున్నాయని స్పష్టం చేశారు. గత ప్రభుత్వం మౌలిక వసతులను పూర్తిగా గాలికి వదిలివేసిందన్నారు. లబ్ధిదారులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు.అలాగే రూ.5 లక్షల చొప్పున చెల్లించే ఇందిరమ్మ ఇండ్ల కేటాయించే కోసం రాష్ట్ర ప్రభుత్వం పారదర్శకంగా వ్యవహరిస్తుందని పేర్కొన్నారు.సర్వే ఇప్పటికే పూర్తి కావోస్తోందని,నిరుపేదలకు మొదటి దశలో ఇండ్ల కేటాయింపు జరుగుతుందని,సంవత్సరానికి నియోజకవర్గానికి 3,500 ల చొప్పున ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లు కేటాయిస్తుందని తెలిపారు. దశలవారీగా అర్హులైన వారందరికీ ఇండ్లు కేటాయిస్తామని ఎమ్మెల్యే విజయరమణ రావు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్, ఎ.ఈ, విద్యుత్ అధికారులు,ఏఎంసీ చైర్ పర్సన్ ఈర్ల స్వరూప,పట్టణ కౌన్సిలర్లు మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు మరియు డబుల్ బెడ్ ఇండ్ల లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## తెలుగు రచయితల మహాసభలు గర్వకారణం

**విజయవాడ,డిసెంబర్28(నినాదం న్యూస్):** ప్రపంచ తెలుగు రచయితల మహాసభలు నిర్వహించుకోవడం తెలుగువారికి గర్వకారణమని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. ఈ మేరకు ఆయన 'ఎక్స' వేదికగా పోస్టు చేశారు. మాతృభాషను భవిష్యత్ తరాలకు పదిలంగా అందించడమే లక్ష్యంగా ఈ మహాసభలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.ఈ కార్యక్రమం జరిగే ప్రాంగణానికి అమరజీవి పొట్టి శ్రీరాములు పేరును పెట్టడం, ఆ మహానుభావుడు తెలుగు జాతి కోసం చేసిన త్యాగాన్ని ప్రతి ఒక్కరికీ గుర్తు చేస్తోందన్నారు. ప్రధాన వేదికకు తెలుగు భాషాభివృద్ధి కోసం గణనీయ కృషి చేసిన రావెరీజీరావు పేరు పెట్టడం అభినందనీయమని చెప్పారు. ఈ మహాసభలకు విచ్చేసిన అతిథులకు, పాల్గొంటున్న తెలుగు భాషాభిమానులకు సీఎం ధన్యవాదాలు తెలిపారు.

## అంతర్ జిల్లా దొంగ అరెస్ట్



**పెద్దపల్లి,డిసెంబర్ 28(నినాదం న్యూస్):** ఒంటరిగా కనిపించే వృద్ధాప్య మహిళలను అనుసరిస్తూ వారికి పెన్షన్ ఇప్పిస్తా అని మాయమాటలతో నమ్మించి, వారి దృష్టిని మళ్లించి వారి వద్ద నుండి బంగారు ఆభరణాలు దొంగలించే అంతర జిల్లా దొంగ అరెస్ట్ చేసినట్లు పెద్దపెల్లి ఎస్ఐ లక్ష్మణరావు తెలిపారు.ఈనెల 25న మధ్యాహ్నం అందాద 12.30 గంటలకు పెద్దపల్లి ఆర్.డి.ఓ.ఆఫీసు ముందు నుండి వెళ్తున్న బొంపెల్లి గ్రామస్తురాలైన గుర్రాల సత్తమ్మ అను వృద్ధురాలు తో ఒక గుర్తు తెలియని వ్యక్తి నీకు పెన్షన్ రావట్లేదు కదా? నేను ఇప్పిస్తానని మాయమాటలు చెప్పి, మెడలో బంగారు వస్తువులు ఉంటే పెన్షన్ రాదు అంటూ ఆమెను నమ్మించి ఆమె మెడలో నుండి బంగారు పుస్తేల తాడును తీపించి ఆమె దృష్టిని హేమరుస్తూ అట్టి రూ. 80వేలు విలువగల 2 తులాల పుస్తెలతాడును దొంగిలించుకొని వెళ్ళినాడని గుర్రాల సత్తమ్మ ఫిర్యాదు ఇవ్వగా,పెద్దపల్లి ఎస్సై 2 మల్లేష్ కేసు నమోదు చేసి, పెద్దపల్లి ఎ.సి.పి.జి.కృష్ణ, సీఐ.ప్రవీణ్ కుమార్ సూచనల మేరకు ఎస్ఐ లక్ష్మన్ రావు సారథ్యం లో వివిద జిల్లాల పోలీస్ అధికారులతో సమాచారాన్ని సేకరించి వివిధ జిల్లాలో ఇదే నేర విధానం ఉండి పలు కేసులలో నిందితుడైన అల్లెపు కృష్ణ ను అనుమానిస్తూ,అతన్ని మంచిర్యాల కు వెళ్తుండగా పెద్దపల్లి బస్ స్టాండ్ వద్ద శనివారం ఉదయం పట్టుకోన్నారు.నేరస్తుడుపై ఇట్టి కేసుతో సహ మొత్తంగా నాలుగు కేసులను చేసినట్లుగా ఒప్పుకోన్నాడని పోలీసులు తెలిపారు.నేరస్థుడిని త్వరితగతిన పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన ఎస్ఐ.లక్ష్మన్ రావు,ఎస్ఐ మల్లేష్ మరియు సిబ్బందిని పెద్దపల్లి ఏ.సి.పి.జి.కృష్ణ అభినందించినారు.

## జీవితంపై విరక్తితో ఆత్మహత్య



**ధర్మారం డిసెంబర్ 28 (నినాదం న్యూస్):** మండలంలోని కమ్మ రీ కాన్ పేట గ్రామానికి చెందిన గుజ్జేటి నరేష్ (32 ) ఆత్మహత్య చేసుకున్న సంఘటన చోటుచేసుకుంది ఎస్సై శీలం లక్ష్మణ్ తెలిపిన వివరాల ప్రకారం, మృతుడు ఆర్థిక సమస్యలతో మానసికంగా కృంగిపోయి జీవితం పై విరక్తితో తన ఇంటిలోని రేకుల షెడ్డు లో తాడుతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడని మృతుడి తండ్రి లచ్చయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## పెద్దపల్లి మున్సిపల్ కమిషనర్ పై తగు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పై ఫిర్యాదు



**పెద్దపల్లి,డిసెంబర్ 28(నినాదం న్యూస్):** మాజీ భారత ప్రధాని మన్మోహన్ సింగ్ గురువారం రాత్రి పరమపదించగా, రాష్ట్ర ప్రభుత్వం సంతాపదినాలు మరి యు శుక్రవారం రోజున సెలవు దీనంగా ప్రకటించిన విషయం త మరికి తెలిసిందే, కాని దాని కి విరుద్ధంగా పెద్దపల్లి మున్సి పాలిటీ లో మాజీ భారత ప్రధా ని మన్మోహన్ సింగ్ సంతాప సభ నిర్వహించక పోగా, పెద్దపల్లి మున్సిపల్ లో నూతన బిల్డింగ్ ను పూజ కార్యక్రమాలతో ప్రారంభించి,భోజనాలు ఏర్పాటు చేసి, స్వీట్లు పంపిణీ సంబరాలు చేసినారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలను బేకాతరు చేస్తూ మున్సిపల్ కమిషనర్ చేసిన ఇట్టి వ్యవహారం పై పెద్దపల్లి పట్టణ ప్రజలు ఆశ్చర్యానికి గురి అయ్యారు. ఇలా మాజీ ప్రధాని పట్ల కమిషనర్ గారు చేసిన పని వల్ల అతనికి ఉన్న నిబద్ధతను తెలియజేస్తుంది. కావున పెద్దపల్లి మున్సిపల్ కమిషనర్ చేసిన దుశ్చర్య పై శాఖా పరంగా తగు చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ నాయకు లు బండారి సునీల్ గౌడ్ కోరారు.

# ట్రెంచ్ కటింగ్ పనులు వెంటనే పూర్తి చేయాలి

- పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష



**మంథని టౌన్, డిసెంబర్ 28 (నినాదం న్యూస్) :** ట్రెంచ్ కటింగ్ పనులు వెంటనే పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ఆదేశించారు.వరంగల్ -మంచిర్యాల జాతీయ రహదారి ఎన్.హెచ్ 163 జీ నిర్మాణానికి సేకరించిన భూములలో ట్రెంచ్ కటింగ్ పనులు పూర్తి చేసి జాతీయ రహదారి ఆథారిటి అప్పగించాలని ఆయన తెలిపారు. శనివారం మంథని మండలంలోని కన్నాల, పందులపెల్లి గ్రామాలలో ట్రెంచ్ కటింగ్ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచిర్యాల- వరంగల్ -ఖమ్మం జిల్లాలను కలిపే 4 లైన్ల గ్రీన్ ఫీల్డ్ హైవే సేకరించిన భూమిని జాతీయ రహదారుల అథారిటీ అప్పగించామని, మంథని మండలం కన్నాల, పందులపెల్లి గ్రామాలలో ట్రెంచ్ కటింగ్ పనులను ప్రారంభించిందని, భూములలో ట్రెంచ్ పనులను సకాలంలో పూర్తి చేసి, జాతీయ రహదారి నిర్మాణ పనులు సజావుగా జరిగేందుకు జిల్లా యంత్రాంగం తరపున పూర్తి సహకారం అందిస్తామని ఆయన పేర్కొన్నారు.జాతీయ రహదారి కింద సేకరించిన భూములలో ఎసంగి పంటలు సాగు చేయరాదని రైతులకు సూచించారు. కలెక్టర్ వెంట మంథని తహసిల్దార్ రాజయ్య, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మణికంఠుని రథోత్సవంలో ప్రభుత్వ విప్



**ధర్మారం డిసెంబర్ 28 ( నినాదం న్యూస్) :** మండల కేంద్రంలో అయ్యప్ప స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న మహా పడిపూజ కార్యక్రమంలో భాగంగా శనివారం రోజు నిర్వహించిన స్వామివారి రథోత్సవ మరియు ఊరేగింపు కార్యక్రమంలో ప్రభుత్వ విప్ ధర్మపురి ఎమ్మెల్యే అల్లూరి లక్ష్మణ్ కుమార్ పాల్గొన్నారు ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ గ్రూప్ ల నాయక్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తిరుపతిరెడ్డి సీనియర్ నాయకులు కాడే సూర్యనారాయణ దేవి జనార్ధన్, మాజీ మండల అధ్యక్షులు కొడాలి హనుమాన్,కొత్త నరసింహులు గుజ్జేటి కనక లక్ష్మి అయ్యప్ప స్వాములు పాల్గొన్నారు

# 31న దావత్‌లు బంద్ చేసుకోండి

- ఆ డబ్బులతో హాస్టళ్లను దత్తత తీసుకోండి
- యువతకు హరీష్‌రావు పిలుపు
- మెజ్ ఛార్జీలు ఆపారంటూ సర్కార్‌పై విమర్శలు



**హైదరాబాద్, డిసెంబర్28 (నినాదం న్యూస్):** యువత ముందుకు వచ్చి హాస్టళ్లను దత్తత తీసుకొని పిల్లలకు సేవ చేయాలని మాజీ మంత్రి హరీశ్‌రావు పిలుపునిచ్చారు. పిల్లలకు సేవ చేస్తే భగవంతునికి సేవ చేసినట్టే.. మానవ సేవయే మాధవ సేవ అని పేర్కొన్నారు. సిద్దిపేట జిల్లా నాసరపుర కేంద్రంలోని అర్బన్ రెసిడెన్సియల్ బ్రిడ్జి స్కూల్‌లోని విద్యార్థులకు స్వెట్లర్లు, దుప్పట్ల పంపిణీ కార్యక్రమంలో హరీశ్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. డిసెంబర్ 31 దావత్‌లను బంద్ చేసి.. ఆ డబ్బుతో హాస్టళ్లను దత్తత తీసుకోవాలని రాష్ట్రంలోని యూత్, యువజన సంఘాలకు పిలుపునిచ్చారు. చలికాలంలో హాస్టల్‌లో వేడి నీళ్లు రాక, ప్రభుత్వం దుప్పట్లు ఇవ్వకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని హరీశ్‌రావు తెలిపారు. గత 4 నెలల నుంచి మెస్ బిల్లులు పెండిరగ్‌లో ఉన్నాయని పేర్కొన్నారు. అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి గ్రీన్ ఛానల్ పెట్టి రాష్ట్రంలో ఒక్క రూపాయి బిల్లు పెండిరగ్ లేదని శాసనసభ సాక్షి గా చెప్పారని ప్రస్తావించారు. ఇదేనా గ్రీన్ ఛాలెంజ్ అని ప్రశ్నించారు. జీతం అగొచ్చు కానీ మెస్ బిల్లులు మాత్రం ఆగవు అన్న సీఎం మాట ఏమైందని నిలదీశారు. ముఖ్యమంత్రి మాటలు కోటలు దాటుతున్నాయి కానీ చేతలు గడప దాటడం లేదని విమర్శించారు. రేవంత్ రెడ్డి మాటల ముఖ్యమంత్రి తప్ప చేతల ముఖ్యమంత్రి కాదని హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. రేవంత్ రెడ్డి పరిపాలన విరీద పట్టు కోల్పోయారని.. ఈ ప్రభుత్వం ఫెయిల్ అనిపిస్తుందని చెప్పారు. అసెంబ్లీలో చెప్పిన మాటలు అమలు కాకపోవడం దారుణమని విమర్శించారు. ప్రభుత్వం ఆరు గ్యారెంటీలు అమలు చేయడం లేదని మండిపడ్డారు. మహాలక్ష్మి, తులం బంగారం ఎటు పోయాయని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి మాటలు అధికారులు వినడం లేదా లేక ముఖ్యమంత్రి ఉత్త మాటలు చెప్పానని అధికారులకు చెబుతున్నారా అని సందేహం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి అంటే అధికారులకు భయం లేదా విలువ లేదా.. గౌరవం లేదా అని నిలదీశారు. తక్షణమే అన్నిచోట్ల మెస్ చార్జీలు విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. అన్ని శాఖలు వీరీ దగ్గర పెట్టుకొని ఎందుకు రివ్యూ చేయడం లేదని నిలదీశారు. ఢిల్లీ పైసలు ఇచ్చినా గల్లీ విడుదల చేయడం లేదని విమర్శించారు. రూ.1300కి పెంచిన మెస్ ఛార్జిలు ఇప్పటికీ అమలు కాలేదని తెలిపారు. అర్బన్ రెసిడెన్షియల్‌లో రూ.1,050 మెస్ ఛార్జిలు మాత్రమే ఇస్తున్నారని పేర్కొన్నారు. 1 నుంచి 7 తరగతి వరకు 1300, ఎనిమిదో తరగతికి రూ.1500 మెస్ ఛార్జిలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాస్మోటిక్ ఛార్జిలు ఇంకా 100 రూపాయలు మాత్రమే ఇస్తున్నారని.. వాటిని150 రూపాయలకు పెంచి ఇవ్వాలన్నారు. తల్లిదండ్రులకు దూరంగా రెసిడెన్షియల్ స్కూళ్లలో ఉన్న విద్యార్థులపై ప్రభుత్వం మరింత బాధ్యతగా ఉండాలని హరీశ్‌రావు సూచించారు. సీఎం రేవంత్ రెడ్డి ఏ విషయంలో కూడా మాట నిలుపుకోలేదని హరీశ్‌రావు విమర్శించారు. ఏ విషయంలోనూ చెప్పిన మాటకు క్షేత్రస్థాయిలో పొంతన లేదని అన్నారు. అసెంబ్లీ లో చెప్పినట్లుగా తక్షణమే మెస్ బిల్లులు, కాస్మోటిక్ బిల్లులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

## బొకేల బదలు.. పుస్తకాలు ఇవ్వండి

- బుక్ఫెయిర్ సందర్శించిన గవర్నర్



**హైదరాబాద్,డిసెంబర్28 (నినాదం న్యూస్) :** శుభకార్యాలకు వెళ్లినప్పుడు బొకేలకు బదులుగా పుస్తకాలు ఇవ్వాలని తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ సూచించారు. శనివారం ఆయన హైదరాబాద్ బుక్ ఫెయిర్‌ను సందర్శించి మాట్లాడారు. 'పుస్తకాల్లో అనంతమైన జ్ఞానం ఉంది. నిరక్షరాస్యుల కోసం ఆడియో బుక్స్ కూడా అందుబాటులోకి వచ్చాయి. పుస్తకాలను నమిలి మింగేయాలనేంత క్షుణ్ణంగా చదవాలి. హైదరాబాద్ బుక్ ఫెయిర్ సంప్రదాయబద్ధంగా పుస్తకాల్ని ప్రమోట్ చేస్తోంది. మానవ నాగరికత వర్ధిల్లినంతకాలం పుస్తకాలు ఉంటాయి. ఈ-బుక్స్ కంటే పుస్తకాల్లోనే మజా ఉంటుంది. రచయితతో డైరెక్ట్‌గా మాట్లాడుతున్నట్టు ఉంటుంది. విశ్వం గురించి తెలియాలంటే పుస్తకాలు చదవాల్సిందే. ఈ-పుస్తకాలు చదివితే ఆ ఫీల్ ఉండదని పలువురు చెబుతున్న మాట. పెద్దలు అందరూ యువతను పుస్తకాల వైపు ప్రోత్సహించాలి' అని గవర్నర్ సూచించారు.

## వేణుగోపాలస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు



**సుల్తానాబాద్, డిసెంబర్ 28 (నినాదం న్యూస్):** ధనుర్మాసాన్నిపురస్కరించుకొని స్థానిక శ్రీ వేణుగో పాల స్వామి ఆలయం లో ప్రత్యేక పూజలు నిర్వ హించారు.శనివారం ఉదయం 5 గంటలకు భక్తు లు గోదా కృష్ణ అష్టోత్తర పారాయణాలు చేశారు అనంతరం హను మాన్ చాలీసా,కృష్ణాష్టకం పం చాయతీ స్తోత్రం తదితర స్తోత్రాలను పారాయణం చేశారు అనంతరం గోదాదేవికి 30 తిరుప్పావై కి చెందిన పాశురాలను భక్తులందరూ అనుసంధా నం చేశారు.వేణుగోపాల స్వామికి పెద్ద ఎత్తున తు లసీదళాలతో అర్చన చేస్తూ మాలలు సమర్పిం చారు.భక్తులు స్వామి వారికి గోదాఅమ్మ వారికి పలు మంగళ హారతులను సమర్పించారు.అనం తరం భక్తులందరికీ తీర్థ ప్రసాదలను పంపిణీ చే శారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు సా విత్రి శ్రావణ్ కుమార్ గోపి వినయ్ తో పాటు వికా స తరంగిణి అధ్యక్షులు సాదుల సుగుణాకర్ సు నీత దంపతులు, పల్లా లలిత సుభాషిని కట్టా ర మా,అరుణ లత గౌరి, దీప సుగుణ ,తదితరులు పాల్గొన్నారు.

# సమగ్ర శిక్షలో పనిచేస్తున్న వారిని రెగ్యులర్ చేయాలి

- జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజు



**నర్సంపేట, డిసెంబర్28 (నినాదం) :** గత కొద్ది రోజులుగా తమ సమస్యలు పరిష్కరించాలని రాష్ట్రవ్యాప్తంగా శాంతియుతంగా నిరసన కార్యక్రమాలు చేస్తున్న సర్వ శిక్షణ అభియాన్ కార్యకర్తలు రాష్ట్ర ప్రభుత్వానికి చీమకుట్టినట్టు కూడా లేదని బిఆర్ టియు జిల్లా అధ్యక్షుడు గొనె యువరాజుఅన్నారు.శనివారం సమ్మె చేస్తున్న శిబిరాన్ని సందర్శించి వారికి బి ఆర్ టి యు మద్దతు ఉంటుందని తెలిపారు.ఈ సందర్భంగా యువరాజు మాట్లాడుతూ విద్యాశాఖ సమగ్ర శిక్షలో కాంట్రాక్టు పద్ధతిలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని అప్పటివరకు పే స్కేల్ ఇచ్చి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. 2023 ఆగస్టు నెలలో ఇప్పటి ముఖ్యమంత్రి టీపీసీసీ అధ్యక్షుని హొదాలో ఉన్నప్పుడు కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రెగ్యులర్ చేస్తామని మాట ఇచ్చి అధికారంలోకి వచ్చి సంవత్సరం గడిచిన ఆ ఊసే లేదు అన్నారు. ప్రభుత్వ టీచర్లతో సమానంగా టెట్టు క్వాలిఫై అయ్యి బీఈడీ పూర్తి చేసి 12 ఏళ్ల నుండి పనిచేస్తున్నారని సమగ్ర శిక్ష ఉద్యోగులందర్నీ విద్యాశాఖలో విలీనం చేయాలని డిమాండ్ చేశారు. ప్రతి ఉద్యోగికి జీవిత బీమా 10 లక్షలు ఆరోగ్య బీమా 10 లక్షలు సౌకర్యం కల్పించాలని, కొత్తగా విద్యా శాఖలో నియామకాలు నిర్వహిస్తే అట్టి నియమాకంలో వెయిటేజీ ఇవ్వాలని కోరారు. గత 23 రోజుల నుండి నిరాహార దీక్ష చేస్తున్న ప్రభుత్వం నుండి ఎలాంటి స్పందన లేకపోవడం బాధాకరమన్నారు.ప్రజా పాలన అని గొప్పలు చెప్పుకునే ప్రభుత్వం వీరు చేస్తున్న ఆందోళన కళ్ళకు అగుపడుతలేదా అని ప్రశ్నించారు.భవిష్యత్తులో వారు నిర్వహించే ఆందోళన పోరాటాలకు పరోక్ష ప్రత్యేక సహకారం బి ఆర్ టి యు సంఘం వైపు నుండి సంపూర్ణ మద్దతు ఉంటుందని వారికి భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా అధ్యక్షుడు శ్రీధర్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు పాషా నాయకులు రమేష్ రాజకుమార్ అన్నపూర్ణ కవిత రజిత తదితరులు పాల్గొన్నారు.

## మహేశ్‌బాబు మూవీలో ప్రియాంక చోప్రా



మహేశ్ బాబు హీరోగా రాజమౌళి దర్శకత్వంలో రానున్న ఓ చిత్రంలో ప్రియాంక చోప్రా ఛాన్స్ కొట్టేసింది. ఎంబి29'గా ఇది ప్రచారంలో ఉంది. ప్రస్తుతం సినీ ప్రియులంతా ఎదురుచూస్తున్న చిత్రాల్లో ఇదీ ఒకటి. తాజాగా దీనికి సంబంధించిన కొన్ని అప్‌డేట్‌లు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఇండోనేషియా నటి చెల్సియా ఎలిజబెత్ ఇస్లాన్ ఈ చిత్రంలో హీరోయిన్‌గా నటించనున్నట్లు గతంలో వార్తలు జోరుగా ప్రచారం అయ్యాయి. ఇప్పుడు మరో నటి పేరు తెరపైకి వచ్చింది. బాలీవుడ్ టాలెంటెడ్ హీరోయిన్ ప్రియాంక చోప్రా ఈ సినిమాలో నటించనున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఆమెతో చర్చలు జరిపినట్లు టాక్ వినిపిస్తుంది. ఇందులో హీరోతోపాటు హీరోయిన్ పాత్రకు ప్రాధాన్యం ఉంటుందని ప్రియాంక అయితే ఆ పాత్రకు న్యాయం చేయగలదని చిత్రబృందం భావిస్తున్నట్లు తెలుస్తోంది. అందుకే ఆమెను తీసుకునే ఆలోచనలో ఉన్నట్లు సమాచారం. ప్రియాంక కూడా ఈ సినిమాలో నటించేందుకు ఆసక్తిగా ఉన్నారట. ఈ పాత్ర కోసం ఇప్పటికే ఆమె ప్రిపరేషన్ కూడా మొదలుపెట్టారట. ఇక ఈ సినిమా షూటింగ్‌కు సంబంధించిన అప్‌డేట్ కూడా సోషల్ మీడియాలో షేర్ అవుతోంది. ఏప్రిల్ నుంచి ఈ చిత్రం రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానున్నట్లు తెలుస్తోంది. దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన కోసం అభిమానులు ఎదురుచూస్తున్నారు.

# సీఎం మీటింగ్‌తో అపోహలు తొలగిపోయాయి


- సమాజానికి ఉపయోగపడే వీడియోలు చేయడంలో తప్పలేదు : తమ్మారెడ్డి



ఇండస్ట్రీకి, ప్రభుత్వానికి మధ్య గ్యాప్ వచ్చిందనే అపోహ సిఎంతో జరిగిమీటింగ్‌తో తొలగిపోయిందని నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ అన్నారు. అది బెస్ట్ మీటింగ్ అని అక్కడికి వెళ్లినవాళ్లు నాతో చెప్పారు. ఫిల్మ్ ఛాంబర్ తరఫున మేము గతంలో ప్రభుత్వాన్ని కలిశాం. గద్దర్ అవార్డుల విషయంలో కొన్ని సలహాలిచ్చాం. గతంలో మేము కూడా కొన్ని సినిమాలకు బెనిఫిట్ షోలు వేశాం. కానీ, ఉచితంగా ప్రదర్శించాం. ప్రస్తుతం ఆ పరిస్థితి మారిపోయింది. దీని గురించి ప్రేక్షకులు, నిర్మాతలు ఆలోచించాలి. తాజాగా విడుదలైన 'పుష్ప2' అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకుంది. అంటే మనం ఇప్పటికే ఇంటర్నేషనల్ స్థాయికి చేరాం. అన్ని భాషల్లో సినిమాలు తీస్తున్నాం. ప్రేక్షకులను అలరిస్తున్నాం అన్నారు. చిత్ర పరిశ్రమలో చోటుచేసుకుంటున్న పరిణామాలపై ఫిల్మ్ ఛాంబర్ మాజీ అధ్యక్షుడు, నిర్మాత, దర్శకుడు తమ్మారెడ్డి భరద్వాజ మీడియాతో మాట్లాడారు. తాజాగా సినీ ప్రముఖులు సీఎంను కలవడం గురించి మాట్లాడారు. ప్రభుత్వం చేపట్టే అవగాహన కార్యక్రమాలపై నటీనటులందరూ వీడియోలు చేయాలని కోరారు. అందరినీ సమన్వయ పరచడానికే ఫిల్మ్ ఛాంబర్ ఉంది. తాజాగా సినీ ప్రముఖులంతా ప్రభుత్వాన్ని కలిశారు. ఎఫ్‌డీసీ ఛైర్మన్ తరఫున వెళ్లారు. తాజాగా జరిగిన మీటింగ్‌లో వాళ్లు సినిమాల గురించి మాట్లాడలేదు. ఇండస్ట్రీ అభివృద్ధికి ప్రభుత్వం నుంచి మరింత సహకారం కోరడానికి వెళ్లారు. ప్రభుత్వం చేపట్టే అవగాహన కార్యక్రమాలకు మన హీరోలందరూ సపోర్ట్ చేస్తూనే ఉన్నారు. అది మన డ్యూటీ. మనం సినిమాతో డబ్బులు సొంతం చేసుకుంటున్నప్పుడు సమాజానికి ఎంతోకొంత ఉపయోగపడే వీడియో చేయడం తప్పులేదు. సినిమాల రిలీజ్ సమయంలోనే కాదు ఎప్పుడూ సమాజానికి ఉపయోగపడే పనులు చేస్తూనే ఉండాలని నా అభిప్రాయం. లంచం తీసుకొని టికెట్ ధరలు పెంచారని వచ్చిన వార్తల గురించి ఇండస్ట్రీ ప్రముఖులతో సీఎం మాట్లాడినట్లు సమాచారం. ఇండస్ట్రీ వాళ్లకు గవర్నమెంట్ దగ్గరకు తరచూ వెళ్లాల్సిన అవసరం లేదు. ఏదైనా సమస్యలు ఉన్నప్పుడే కలుస్తాం. 'గతంలో చెన్నై నుంచి ఇండస్ట్రీ హైదరాబాద్ రావడానికి 40 ఏళ్లు పట్టింది. ఇక్కడి నుంచి మరోచోటకు వెళ్లాలన్నా అంత సమయమే పడుతుంది. చిరంజీవి కుటుంబం నుంచి మీటింగ్‌కు ఎవరూ ఎందుకు వెళ్లలేదో నాకు తెలియదు. బహుశా వారికి ఏమైనా ముఖ్యమైన పనులు ఉన్నాయేమో. ఇండస్ట్రీలో ఉన్న వారందరూ నాకు పిల్లలతో సమానం. అల్లు అర్జున్‌కు నేషనల్ అవార్డు వచ్చినప్పుడు సంతోషించాను. అలానే సంధ్య థియేటర్ ఘటనపై కూడా తాజాగా నా అభిప్రాయాన్ని చెప్పాను. నా ఉద్దేశం ఎవరినీ బాధపెట్టడం కాదు. నా పిల్లలతో సమానం కాబట్టి వాళ్ల గురించి మాట్లాడతాను. కొందరి మాట వింటే భవిష్యత్తు బాగుంటుంది. మరి కొందరికి దూరంగా ఉండండి అని చెప్పడానికి ప్రయత్నం చేస్తుంటాను' అని తమ్మారెడ్డి భరద్వాజ చెప్పారు.

## 'ఆర్‌ఆర్‌ఆర్ : బిహైండ్ అండ్ బియాండ్'

- మేకింగ్ టీమ్‌ను అభినందించిన రాజమౌళి



'ఆర్ఆర్ఆర్: బిహైండ్ అండ్ బియాండ్' కోసం వర్క్ చేసిన టీమ్‌ను ఉద్దేశించి అభినందిస్తూ..దర్శకుడు రాజమౌళి తాజాగా ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టారు. టీమ్ పనితనాన్ని ఆయన మెచ్చుకున్నారు. అందరూ అద్భుతంగా పని చేశారని అన్నారు. 'దాదాపు 13 ఏళ్ల క్రితం ప్రదీప్‌ను కలిశా. ఒక అభిమానిగా అతడు నాకు అప్పుడు తెలుసు. ఈరోజు ప్రదీప్‌తోపాటు వాల్స్ అండ్ ట్రెండ్స్‌లోని అతడి టీమ్ 'ఆర్ఆర్ఆర్: బిహైండ్ అండ్ బియాండ్' కోసం ఎంతో వర్క్ చేశారు. మరో ఫ్యాన్ గర్ల్ శిరీష, వంశీ మంచి టాలెంట్ ఉన్న ఎడిటర్లు. 20టీబీ డేటాలో సరైన ఫుటేజ్‌ను కనుగొనడం అంత సులభమైన విషయం కాదు. సినిమా కంటే డాక్యుమెంటరీ చాలా ఎమోషనల్‌గా ఉందని వస్తోన్న ప్రశంసలే వారి ప్రతిభకు నిదర్శనం. టీమ్ విషయంలో చాలా గర్వంగా ఉన్నా. వీళ్లందరూ మరెన్నో ఉన్నత శిఖరాలను అందుకోవాలని కోరుకుంటున్నా' అని రాజమౌళి పేర్కొన్నారు. భారతీయ సినిమా ఖ్యాతిని ప్రపంచదేశాలకు వ్యాప్తి చేసిన చిత్రం 'ఆర్ఆర్ఆర్' . రామ్‌చరణ్, ఎన్టీఆర్ ప్రధాన పాత్రల్లో దర్శక ధీరుడు రాజమౌళి తెరకెక్కించిన ఈ చిత్రం 2022లో విడుదలై ప్రపంచవ్యాప్తంగా భారీ వసూళ్లు రాబట్టిన విషయం తెలిసిందే. ప్రతిష్ఠాత్మకంగా భావించే ఆస్కార్ (నాటు నాటు పాటకు) అవార్డు కూడా సొంతం చేసుకుంది. ఈ సినిమా చిత్రీకరణ విశేషాలను తెలియజేస్తూ ఇటీవల చిత్రబృందం 'ఆర్ఆర్ఆర్: బిహైండ్ అండ్ బియాండ్' అనే డాక్యుమెంటరీ సిద్ధం చేసింది. తాజాగా ఇది నెట్‌ఫ్లిక్స్ వేదికగా విడుదలైంది. సినిమాలోని కీలక సన్నివేశాల చిత్రీకరణ, షూటింగ్‌లో చోటుచేసుకున్న సరదా మూమెంట్స్, నటీనటులు, దర్శక నిర్మాతల అనుభవాలతో ఈ డాక్యుమెంటరీ రూపుదిద్దుకుంది. దీనిని చూసిన ప్రతిఒక్కరూ టీమ్‌ను ఎంతగానో మెచ్చుకుంటున్నారు. సినిమాతో పోలిస్తే డాక్యుమెంటరీ ఎంతగానో మనసుని హత్తుకుందని పలువురు పేర్కొంటున్నారు. అంతేకాకుండా, డాక్యుమెంటరీ విభాగంలో ఇది కనుక ఆస్కార్‌కు వెళితే తప్పకుండా అవార్డు వస్తుందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

## మార్కో తెలుగు ట్రైలర్ విడుదల




ఉన్ని ముకుందన్ కథానాయకుడిగా హనీఫ్ దర్శకత్వంలో రూపొందిన యాక్షన్ థ్రిల్లర్ 'మార్కో' ఇటీవల మలయాళంలో విడుదలైన ఈ మూవీ బాక్సాఫీస్ వద్ద కాసుల వర్షం కురిపిస్తోంది. రూ.30కోట్లతో నిర్మించిన ఈ చిత్రం విడుదలైన వారంలో రోజుల్లోనే రూ.80కోట్లకు పైగా వసూలు చేసినట్లు ట్రేడ్ వర్గాలు లెక్కగట్టాయి. ఇప్పుడు తెలుగు ప్రేక్షకులను అలరించడానికి సిద్ధమైంది. నూతన సంవత్సరం సందర్భంగా జనవరి 1న ఈ చిత్రం విడుదల కానుంది. తాజాగా చిత్ర ట్రైలర్ విడుదలైంది. యాక్షన్ సన్నివేశాలను పెద్ద పీట వేసినట్లు ప్రచార చిత్రాలు చూస్తే అర్థమవుతోంది.

## పుష్ప-2 నుంచి షెకావత్ పాట విడుదల




అల్లు అర్జున్ కథానాయకుడిగా నటించిన తాజా చిత్రం 'పుష్ప 2 ది రూల్' సుకుమార్ దర్శకత్వంలో వచ్చిన ఈ సినిమాలో రష్మిక కథానాయిక నటించింది. డిసెంబర్ 5న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద కాసుల వర్షం కురిపిస్తున్న విషయం తెలిసిందే. ఇప్పటికే వరల్డ్ వైడ్‌గా రూ.1700 కోట్లకు పైగా వసూళ్లను రాబట్టింది ఈ చిత్రం. అయితే ఈ మూవీ నుంచి ఫుల్ వీడియో సాంగ్‌లను ఒక్కొక్కటిగా వదులుతున్న విషయం తెలిసిందే. ఇప్పటికే 'పుష్ప రాజ్' సాంగ్‌తో పాటు 'దెబ్బలు పడతాయ్ రో.. దెబదెబ్బలు పడతాయ్ రో.. కిస్ కిస్ కిస్సిక్' సాంగ్‌లను విడుదల చేసిన చిత్రబృందం తాజాగా మూవీలో ఇంటర్వెల్ ముందు వచ్చే దమ్ముంటే పట్టుకోరా షెకావత్ పట్టుకుంటే వదిలేస్తా సిండికేట్ అనే సాంగ్‌ను విడుదల చేసింది. థియేటర్‌లో ఉర్రుతలు ఊగించిన ఈ సాంగ్ విడుదలయ్యింది.

## బేబీ బంప్ ఫోటోలతో సామ్ హల్‌చల్



టాలీవుడ్ స్టార్ నటి సమంత గురించి ప్రత్యేక పరిచయం అక్కర్లేదు. తన అందం, అభినయంతోపాటు నటనతో కోట్లాది మంది అభిమానుల్ని సొంతం చేసుకుంది. ఏమాయ చేశావే చిత్రంతో తెలుగు ఇండస్ట్రీకి పరిచయమైన ఈ సుందరి.. అతి కొద్ది రోజుల్లోనే స్టార్ హీరోయిన్‌గా గుర్తింపు తెచ్చుకుంది. అనంతరం మంచి ఫామ్‌లో ఉండగానే టాలీవుడ్ నటుడు నాగచైతన్యను ప్రేమపెళ్లి చేసుకుంది. ప్రస్తుతం అతడితో విడాకులు తీసుకుని సింగిల్‌గా ఉంటోంది. ఈ క్రమంలో సమంతకు సంబంధించిన కొన్ని ఫొటోలు ప్రస్తుతం నెట్టింట షేక్ చేస్తున్నాయి. ఆ ఫొటోల్లో సామ్ బేబీ బంప్ తో కనిపించడం అందరినీ ఆశ్చర్యానికి గురి చేస్తోంది. అయితే, అవి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో రూపొందించినవిగా తెలిసింది. ఏఐ సాయంతో సమంత బేబీ బంప్ ఫొటోలను క్రియేట్ చేసి సోషల్ మీడియాలో పోస్టు చేశారు. ఇవి కాస్తా వైరల్ కావడంతో నెటిజన్లు, అభిమానులు షాక్ అవుతున్నారు. నాగచైతన్యతో విడాకుల అనంతరం మాతృత్వాన్ని అనుభవించాలని ఉందంటూ సామ్ అప్పట్లో చెప్పుకొచ్చిన విషయం తెలిసిందే. ఇప్పుడు బేబీ బంప్ ఫొటోలు చూసిన వారంతా ఈ విషయాన్నే గుర్తు చేసుకుంటున్నారు.